18-4Pg1exHMNWJQE.qxd:18-4Pg1exHMNWJQE.qxd 18/04/25 12:03 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-4-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 76 పేజీలు: 12 వెల: 6.50

రాష్ట్రపతికి ఆదేశాలిచ్చే అధికారం సుప్రీం కోర్టుకు లేదు!

టైమ్స్ జాబితాలో భారతీయులకు దక్కని చోటు


9లో



## సీడ్ యాక్సెస్ రోడ్లకు భూ సేకరణ

**సిఎం చంద్రబాబు చొరవతో ముందుకు వచ్చిన రైతులు, 20 ఎకరాలు ఇచ్చేందుకు సుముఖత**

**విజయవాడ, ఏప్రిల్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రధాన అనుసంధాన రహదారి (సీడ్ యాక్సెస్ రోడ్డు)లో మిగిలిపోయిన భాగాన్ని పూర్తి చేసేందుకు సిఆర్‌డిఎ సన్నాహాలుచేస్తోంది. ఈవిషయంలో సిఎం చంద్రబాబు నాయుడు కృషి ఫలించింది. ఈ విషయంలో సిఎం చంద్రబాబు పలు పర్యాయాలు అధికార యంత్రాంగంతోను, వ్యక్తిగతంగాను, మంత్రి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖాధికారులతో సంప్రదింపులు జరిపారు. దాంతో ఉండవల్లి. పెనుమాక రైతులు రాజధానికి కీలక రహదారైన స్పీడ్ యాక్సెస్‌కు తమ భూములను ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమం సమీపం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు 4 కి.మీ. పొడవైన భాగాన్ని పూర్తి చేసేందుకు భూసమీకరణలో భూములిచ్చేందుకు అక్కడి రైతులు ముందుకొచ్చారు. రైతుల నుంచి 69 ఎకరాలు తీసుకోవాల్సి ఉండగా ఇందులో 20 ఎకరాలు మాత్రమే పెండింగ్ ఉన్నట్లు సమాచారం. త్వరలోనే ఆ ప్రక్రియ పూర్తి చేసి, సిఆర్‌డిఎ టెండర్లు పిలవనుంది. రెండో దశలో ప్రకాశం బ్యారేజీ నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు 3.08 కి.మీ. పొడవున రహదారి నిర్మించేందుకు డిపిఆర్ సిద్ధం చేస్తోంది. 18.270 కి.మీ. తొలి ప్యాకేజీలో భాగంగా మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమం వరకు సుమారు 14 కి.మీ.ల రహదారిని 8 వరుసలుగా టిడిపి హయాంలోనే పూర్తి చేశారు.
అయితే ఆశ్రమం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు 4 కి.మీ. రోడ్డు నిర్మాణం భూసమీకరణ సమస్యలతో నిలిచిపోయింది. రాజధానికి రాకపోకలకు కీలకమైన ఈ ప్రధాన రహదారిని వైఎస్సార్సీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీన్ని పక్కనపెట్టి కరకట్ట రహదారిని విస్తరిస్తామని చెప్పినా అదీ పూర్తి చేయలేదు. సీడ్ యాక్సెస్ రోడ్డును ఇ3 రహదారిగా వ్యవహరిస్తున్నారు. రాజధానిలోని అన్ని ముఖ్య రహదారులు దీనితో అనుసంధానమవుతాయి. రాజధానిలో నిర్మాణ పనులు వేగం పుంజుకోవడంతో నిర్మాణ సామగ్రి, యంత్రాలు, ఇతర పరికరాలను తెచ్చుకునేందుకు ప్రస్తుతానికి ఇదే ప్రధాన రహదారి కానుంది. దీన్ని తొలి దశలో ప్రకాశం బ్యారేజీ వరకైనా వేగంగా పూర్తి చేయాలని సిఆర్‌డిఎ భావిస్తోంది. సీడ్‌యాక్సెస్ రోడ్డుకు అవసరమైన భూములను తీసుకునేందుకు రైతులతో సిఆర్‌డిఎ జరిపిన సంప్రదిం >>2



## వెయ్యి మెగావాట్ల ఇంధన స్టోరేజ్ వ్యవస్థ

**రాష్ట్రానికి కేంద్రం అనుమతులు**

**విజయవాడ,ఏప్రిల్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మరో వెయ్యి మెగావాట్ అవర్స్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి సిస్టం (బిఇఎస్ఎస్) ఏర్పాటు కానున్నది. ఇందుకు కేంద్రం సూత్రపాయంగా అనుమతించింది. ఇందుకు సంబంధించి ఎపి ఇంధనశాఖ ద్వారా అందిన సమాచారాన్ని అనుసరించి వాటికి వయబిలిటి గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద కేంద్రం గ్రాంటు ఇవ్వనుంది. ఇప్పటికే 2,000 మెగావాట్ అవర్స్ బిఇఎస్ఎస్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు ఇచ్చింది. మొత్తంగా 3,000 మెగావాట్ల విద్యుత్ నిల్వ ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో సుమారు 19,000 మెగావాట్ల విద్యుత్ ఒప్పందాలు ఉంటే అందులో పునరుత్పాదక విద్యుత్ (పవన, సౌర విద్యుత్) ఒప్పందాలు 7,800 మెగావాట్ల ఉన్నాయి. వాటి నుంచి వచ్చే విద్యుత్‌ను మస్ట్ రన్ విధానంలో తీసుకోవాలి. దీనివల్ల పగటి వేళల్లో ఇప్పటికే సుమారు 1,500 మెగావాట్ల మిగులు విద్యుత్ ఉంటోంది. ఏడాదిలో మరో 10,000 మెగావాట్ల పునరుత్పాదక ప్రాజెక్టుల నుంచి విద్యుత్ ఉత్పత్తి రానుంది. అది కూడా అందుబాటులోకి వస్తే గ్రిడ్ బేస్‌లోడ్ నిర్వహణకు ఇబ్బందిగా ఉంటుందని విద్యుత్ సంస్థలు భావిస్తున్నాయి.
ఈ కారణంగా విద్యుత్ నిల్వ చేసేందుకు కొత్తగా వచ్చిన బిఇఎస్ఎస్ సాంకేతికత ద్వారా 4,000 మెగావాట్ అవర్స్ విద్యుత్ నిల్వ ప్రాజెక్టులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదన పంపింది. ఇప్పటికే 2,000 మెగావాట్ అవర్స్ బిఇఎస్ఎస్ ప్రాజెక్టులకు ఇంధన శాఖ టెండర్లు పిలిచింది. రాష్ట్రంలో పగటి వేళల్లో విద్యుత్ డిమాండ్ ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ఏదోఒక టైంబ్లాక్‌లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 13,000 మెగావాట్ల వరకు >>2

## ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

**విజయవాడ, ఏప్రిల్17, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్సు 2025 కు సంబంధించి ప్రభుత్వం గెజిట్‌ను జారీ చేసింది. ఎపి షెడ్యూల్డు ఉపకులాల వర్గీకరణ ఆర్డినెన్సు 2025కు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదాన్ని తెలియచేయటంతో ప్రభుత్వం ఈ గెజిట్‌ను జారీ చేసింది. గెజిట్ జారీకి సంబంధించిన ఉత్తర్వులను న్యాయశాఖ కార్యదర్శి జి. ప్రతిభా దేవి జారీ చేశారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా రెల్లి, మాల, మాదిగ ఉపకులాలను ఎబిసి కేటగిరీలుగా విభజించారు. రెల్లి ఉపకులాలకు 1 శాతం, మాల ఉపకులాలకు 6.5 శాతం, మాదిగ ఉపకులాలకు 7.5 శాతం మేర రిజర్వేషన్లను కల్పిస్తూ ప్రభుత్వం ఈ గెజిట్ జారీ చేసింది. విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఈ రిజర్వేషన్లను వర్తింపచేసేలా ప్రభుత్వం ఈ ఆర్డినెన్సును జారీ చేసింది. త్వరలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను కూడా ఈ వర్గీకరణను పరిగణనలోకి తీసుకునే జారీ చేయనున్నారు.
ఎస్సీ వర్గీకరణ అంశంపైనా ఇటీవలే కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. దీనిపై ఇటీవల రాజీవ రంజన్ మిశ్రా కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ క్రమంలో దీనికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రాష్ట్రాన్ని యూనిట్‌గా వర్గీకరణ చేయాలని కమిషన్ నివేదిక ఇచ్చింది. జిల్లాను యూనిట్‌గా వర్గీకరణ చేయాలన్న ఎమ్మెల్యేల ప్రతిపాదనపై చర్చించింది. ఈ నేపథ్యంలోనే 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణకు మంత్రివర్గం నిర్ణయించింది. 2026 జనాభా లెక్కలు వచ్చాక జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా బుడగజంగాలు, మరో కులాన్ని ఎస్సీల్లో చేర్చేందుకు తీర్మానం చేయాలని నిర్ణయం తీసుకుంది.
ఇక ఎస్సీ వర్గీకరణకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వానికి గత నెలలో ఏక సభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా నివేదిక ఇచ్చారు. ఉమ్మడి జిల్లాల్లో ఎస్సీ వర్గీకరణపై విచారణచేసి సిఎస్ విజయానంద్‌కు రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికను అందించారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా రిజర్వేషన్ విధానం, ఎస్సీల్లో ఉపవర్గాల ఆర్థిక స్వావలంబన తదితర అంశాలపై ఏక సభ్య కమిషన్ అధ్యయనం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ ఉపకులాల నుంచి విజ్ఞప్తులు, అభ్యర్థనలు, అభిప్రాయ సేకరణపై ఏక సభ్య కమిషన్‌ను జరిపారు. ఈ >>2



## యంగ్ గ్లోబల్ లీడర్‌గా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయవాడ,ఏప్రిల్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** వరల్డ్ ఎకనామిక్ ఫోరం యంగ్ గ్లోబల్ లీడర్ జాబితాలో టిడిపి ఎంపీ, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి స్థానం లభించింది. ప్రపంచవ్యాప్తంగా తమ రంగాల్లో ఉత్తమ నాయకత్వం కనబరిచిన యువ నాయకులను వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎంపిక చేస్తుంది. ఈసారి భారత్ నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. దీనిపై రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా యంగ్ గ్లోబల్ లీడర్‌గా ఎంపిక కావడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమైన, ప్రభావితమైన నిర్ణయాలు తీసుకునే స్థానంలో భారత యువత ప్రాధాన్యం పెరుగుతోందని అన్నారు. నిజాయితీ, నూతన ఆలోచనలతో ప్రజలకు సేవ చేయాలని ఈ గుర్తింపు మరింత గుర్తు చేస్తుందని కేంద్రమంత్రి రామ్మోహన్ అన్నారు. 2014లో 26 ఏళ్ల అతి చిన్న వయసులో పార్లమెంట్ సభ్యుల్లో ఒకరిగా ఉన్న రామ్మోహన్ >>2

## వికసిత్ భారత్‌కు 7.8% వృద్ధిరేటు

**16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ పనగారియా**



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** తిరుపతి ఐఐటిలో గురువారం 16వ ఆర్థిక సంఘం ఛైర్మెన్ మరియు తొలి నీతి ఆయోగ్ వైస్ ఛైర్మెన్ డాక్టర్ అరవింద పనగారియా సందర్శించారు. ఆయనకు డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ వారి సిబ్బంది స్వాగతం పలికారు. విశిష్ట అతిథులతో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటుచేసిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ఐఐటి తిరుపతిలో జరుగుతున్న మార్పులు, పరిశోధనల, నావీన్యానికి కేంద్రంగా రూపుదిద్దుకుంటుందన్నారు. ఈ మూడవతరం ఐఐటి పురోగతిని అతిథులకు వివరించారు. విద్యార్థులలో మూడవంతుమంది పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లలో ఉన్నారని, అధ్యాపకులు 200కిపైగా పరిశోధన ప్రాజెక్టులలో పాల్గొంటున్నారని తెలిపారు. మెటీరియల్ సైన్స్, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎనర్జీ స్టోనేజ్, ఫుడ్ టెక్నాలజీ ప్రిసిషన్ టెక్నాలజీ వంటి ఇంటర్ డిసిప్లీనరి రంగాలలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు వివరించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అరవింద్‌పగారియా >>2

## సిట్ విచారణకు విజయసాయి గైర్హాజరు

**విజయవాడ,ఏప్రిల్17,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులోసిట్ విచారణకు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి గైర్హాజరయ్యారు. రాజ్ కసిరెడ్డే మద్యం కుంభకోణానికి కీలక సూత్రధారని ఇటీవల విజయసాయి వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో సాక్షిగా వాంగ్మూలం ఇవ్వాలని కోరుతూ విచారణకు హాజరుకావాలంటూ విజయసాయి రెడ్డికి సిట్ నోటీసులు జారీ చేసింది. గురువారం విజయసాయిరెడ్డి విజయవాడ సిట్‌కార్యాలయంలో విచారణకు హాజరుకావాల్సి ఉంది. ఈ క్రమంలో వివిధకారణాలతో విచారణకు రాలేకపోతున్నట్లు అధికారులకు విజయసాయిరెడ్డి సమాచారం అందించారు. వాస్తవానికి విజయసాయి రెడ్డిని ఈ నెల 18న విచారణకు >>2

## రైతులకు అండగా నిలవాలి

**బ్యాంకర్లకు మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశం**

**విజయవాడ,ఏప్రిల్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** రైతుకు అండగా నిలబడేందుకు బ్యాంకర్స్ సహకరించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. విజయవాడ కానూరులో సివిల్ సప్లైస్ భవన్‌లో గురువారం మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన బ్యాంకర్స్‌తో సమావేశం జరిగింది. గత ప్రభుత్వం రైతులకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించకుండా 1674 కోట్ల రూపాయల బకాయి లను వదిలి వెళ్లింది అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు చెల్లించవలసిన >>2



గురువారం జరిగిన బ్యాంకర్లు సమావేశంలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల



తిరుపతి ఎస్వీగోశాల వద్ద భారీగా మొహరించిన పోలీసులు

## జగన్ అక్రమాస్తుల కేసు

## దాల్మియా సిమెంట్స్ ఆస్తులు జప్తు చేసిన ఇడి

**విజయవాడ ఏప్రిల్ 17 ప్రభాతవార్త ప్రతినిధి:** జగన్ అక్రమాస్తుల కేసులో దాల్మియా సిమెంట్స్ ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రూ.793 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు తెలిపింది. కడప జిల్లాల్లో 417 హెక్టార్ల సున్నపురాయి గనులను అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం దాల్మియా సిమెంట్స్‌కు లీజుకిచ్చింది. ఇందులో అక్రమాలు చోటు చేసుకున్నాయని సిబిఐ గతంలోనే ఆరోపించింది. జగన్‌తో కలిసి దాల్మియా సిమెంట్స్ అక్రమంగా సున్నపురాయి గనుల లీజులు పొందినట్లు సిబిఐ >>2

## గోవుల మృతిపై చెలరేగుతున్న 'రాజకీయం'

**ప్రతిష్టకు పోతున్న కూటమి నేతలు**

**తిరుపతి,ఏప్రిల్ 17ప్రభాతవార్తప్రతినిధి:** హిందువులు సకలదేవతాస్వరూపాలుగా భావించి పూజించే టిటిడి ధార్మికసంస్థలో గోమాతల మరణాలపై రాజకీయనేతల సవాళ్లు ప్రతిసవాళ్లతో గురువారం ఉదయం తిరుపతి నగరంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎస్వీ గోశాలలో వందకుపైగా గోవులు మరణించాయని వైసిపి నేత, టిటిడి ట్రస్ట్ బోర్డు మాజీఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఇటీవల చేసిన ఆరోపణలకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి కూటమి నేతల ఎమ్మెల్యేలు నిజనిర్ధారణకు ఎస్వీగోశాలకు రావాలని ఆయనుకు సవాల్ విసిరారు. అదేసమయంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి కూడా 40 గోవులు మృతి చెందాయని, టిటిడి ఛైర్మన్ 23 గోవులని, మరీ టిటిడి ఇఒ 43 గోవులని ఇలా ఎవరికివారు తెలిసిన సమాచారం మీడియాకు వెల్లడించడం మరింత >>2





ఉత్తరాఖండ్‌లోని ఛమోలీ జిల్లాలో హేమ్‌కుండ్ సాహెబ్ యాత్ర మార్గంలో మంచు తొలగించేందుకు వచ్చిన ఆర్మీ అధికారులు, సిబ్బంది ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

# రోడ్లకు భూసేకరణ

>> పులు ఫలించాయి. భూములిచ్చేందుకు సమ్మతించిన రైతులు తమకు స్థలాల్ని సీడ్‌యాక్సెస్ రోడ్డుకు సమీపంలోని గ్రామాలకు చెందిన ఎల్‌పీఎస్ లేఅవుట్లలో ఇవ్వాలని కోరారు. వారికి వెంకటపాలెం, వెలగపూడి, మందడం గ్రామాల పరిధిలోని ఎల్‌పీఎస్ లేఅవుట్లలో స్థలాలు కేటాయించనున్నారు. ఈ ప్రతిపాదనను ఇటీవల ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సిఆర్‌డిఎ సమావేశంలో ఆమోదించారు. మంతెన ఆశ్రమం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీడ్‌యాక్సెస్ రోడ్డు ఉండవల్లి, పెనుమాక గ్రామాల భూముల్లోంచి వెళ్తుంది.

భూసమీకరణలో భూములివ్వాల్సిన వారిలో ఎక్కువ మంది ఆ గ్రామాల పరిధిలోనే ఉన్నారు. దాంతో ఉండవల్లి గ్రామానికి సంబంధించి ముసాయిదా ఎల్‌పీఎస్ లేఅవుట్, పెనుమాక గ్రామానికి సంబంధించి జరీబు భూముల రైతులకు ఎల్‌పీఎస్ లేఅవుట్ ఇంకా సిద్ధం కాలేదు. ఉండవల్లి, పెనుమాక గ్రామాల పరిధిలోని రైతులనుంచి మొత్తం భూమి సమీకరించేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది.



నిత్యావసరాల ధరల పెరుగుదలకు నిరసనగా కర్ణాటక కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న ఎఐసిసి కర్ణాటక ఇన్‌ఛార్జి రణదీప్ సూర్జేవాలా, సిఎం సిద్దరామయ్య, డిప్యూటి శివకుమార్‌లు

## ఇన్‌కమ్ ట్యాక్స్ వద్దు.. టారిఫ్ ఆదాయమే ముద్దు : ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 17:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల నుంచి వసూలు చేయనున్న టారిఫ్‌లపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. దేశానికి ఈ సొమ్ము లభిస్తే ఇప్పటికే ప్రజల నుంచి వసూలు చేస్తున్న ఆదాయపు పన్ను అవసరం ఇక ఉండబోదని అభిప్రాయపడ్డారు. తాజాగా ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 1870–1913 మధ్యలో అమెరికాలో ఇన్‌కమ్ ట్యాక్స్ లేదని.. టారిఫ్‌లే ప్రభుత్వ ప్రధాన ఆదాయ వనరని వెల్లడించారు. ఆ సమయంలో అమెరికా అత్యంత సంపన్న దేశంగా వర్ధిల్లిందన్నారు. 1880ల్లో మిగులు నిధులు ఖర్చు చేసేందుకు ఓ కమిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు.

కానీ, 1913లో ఆదాయపు పన్ను వచ్చాక పరిస్థితి మారిందని చెప్పారు.'టారిఫ్‌ల నుంచి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అది ఆదాయపు పన్నును భర్తీ చేస్తుంది. ప్రస్తుతం విధిస్తున్న పన్నులతో రోజుకు రెండు నుంచి మూడు బిలియన్ డాలర్ల ఆదాయం లభిస్తుంది. గతంలో ఎన్నడూ ఇంత మొత్తం రాలేదు' అని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. వ్యాపారాలు దెబ్బతినకుండా తాత్కాలికంగా సుంకాలకు విరామం ప్రకటించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తాను విధిస్తున్న సుంకాలను గ్రేట్ డిప్రెషన్ సమయంతో పోల్చడాన్ని ట్రంప్ కొట్టిపారేశారు. సుంకాల అమలుకు ముందే ఆ పరిస్థితి నెలకొందన్నారు.

# వర్షాకాలం ముందే కాలువల్లో పూడికతీత - మంత్రి నారాయణ

**విజయవాడ,ఏప్రిల్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** వర్షాకాలం ప్రారంభం నాటికి విజయవాడ నగరంలో అన్ని వరద నీటి కాలువల పూడికతీతపాటు మరమ్మత్తులు పూర్తిచేయాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు.రోడ్లపై ఎక్కడా నీరు నిలువ ఉండకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్ధేశం చేసారు.విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు,సమస్యల పరిష్కరించడంపై మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు..విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బోండా ఉమా, గద్దె రామమోహన్, బోడె ప్రసాద్‌తో పాటు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర,టౌన్ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ విద్యుల్లత,ప్రజారోగ్యవిభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ మరియన్న,జాతీయ రహదారుల సంస్థ అధికారులు పాల్గొన్నారు...వీఎంసీ పరిధిలో ఉన్న సమస్యలను అధిగమించడం,అభివృద్ధి ప్రణాళికలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

నగరంలో త్వరలో మరో ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభం కానుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు..మహానాడు జంక్షన్ నుంచి ఎనికేపాడు వరకూ ఫ్లైఓవర్ నిర్మిస్తుండటంతో ఈలోగానే ప్రత్యామ్నాయ రహదారులను ఎంపిక చేసి కొత్తగా రోడ్లు వేయాలని సూచించారు..అమరావతి నుంచి గన్నవరం ఎయిర్ పోర్ట్ కు వెళ్లే ప్రధానమైన రహదారి కావడంతో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు..ఇప్పటికే ట్రాఫిక్ మళ్లింపు కొరకు పలు రహదారులను ఎంపిక చేసినట్లు ఎంపీ కేశినేని చిన్ని మంత్రి నారాయణకు వివరించారు...ఈ రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు..ఎయిర్పోర్ట్ కారిడార్ లో గ్రీనరీ కి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

మరోవైపు తమ నియోజకవర్గాల్లో పార్కుల అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యేలు పలు ప్రతిపాదనలు మంత్రి ముందుంచారు...కార్పొరేషన్ లో ఉన్న నిధులను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యతా క్రమంలో పార్కులను అభివృద్ధి చేయాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు..నగరంలో మెప్మా లో ఉన్న స్వయం సహాయక మహిళలకు ఆదాయం సమకూరేలా పలు ప్రతిపాదనలపై చర్చించారు.

## ఆస్తులు జప్తు చేసిన ఇడి

>> 2013లో ఛార్జిషీట్ దాఖలు చేసింది. తద్వారా జగన్ సుమారు రూ.150 కోట్ల మేర అక్రమంగా లబ్ది పొందినట్లు అందులో పేర్కొంది రఘురామ్ సిమెంట్స్‌లో రూ.95 కోట్ల విలువైన షేర్లు రూ.55 కోట్లు హవాలా రూపంలో దాల్మియా సిమెంట్స్ ఇచ్చినట్లు అభియోగం మోపింది. సిబిఐ ఛార్జ్ షీట్ ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఇడి దర్యాప్తు చేపట్టింది. తాజాగా రూ.793 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది.

## విజయసాయి గైర్హాజరు

>> హాజరు కావాలంటూ సిట్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.అయితే ఈ రోజు కన్నా ఒక రోజు ముందుగా విచారణ వస్తానని విజయ సాయిరెడ్డి సిట్‌కు సమాచారం అందించారు. ఆయన విజ్ఞప్తి మేరకు నేడు విచారణకు హాజరు కావాలని సిట్ కోరింది.అనివార్య కారణాల వలన విచారణకు హాజరు కాలేకపోతున్నట్లు ఇవ్వాల సిట్ అధికారులకు విజయసాయిరెడ్డి వర్తమానం పంపించారు.

## గవర్నర్ ఆమోదం

>> నివేదిక ఆధరంగా ఎస్సీ వర్గీకరణ అంశపై కేబినెట్‌లో చర్చించి ఆమోదించారు. తాజాగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదం అనంతరం ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది.

# ఇంధన స్టోరేజ్ వ్యవస్థ

>> ఉంటున్నా ఎక్కువ టైం బ్లాక్‌లలో (ఒక టైం బ్లాక్ 15 నిమిషాలు) డిమాండ్ 8,000 మెగావాట్ల నుంచి 8,500 మెగావాట్ల మధ్య ఉంటోంది.

దీనివల్ల పగటి వేళల్లో జెన్‌కో థర్మల్ ప్లాంట్లను బ్యాక్ డౌన్ చేసిన తర్వాతా రోజుకు సుమారు 1,500 మెగావాట్ల మిగులు ఉంటోంది. జెన్‌కో థర్మల్ యూనిట్లను పూర్తి స్థాయిలో నిర్వహిస్తే మిగులు మరో 1,000 మెగావాట్ల వరకు పెరుగుతుందని అధికారుల అంచనా. ఆ మిగులు విద్యుత్ అవసరమైన సమయంలో వినియోగించుకోడానికి వీలుగా నిల్వ చేసే ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బిఇఎస్‌ఎస్ ప్రాజెక్టుల్లో నిల్వ చేసిన విద్యుత్‌ను పగటి వేళ పీక్ డిమాండ్ సమయంలో నాలుగు గంటలు రాత్రి పీక్ అవర్స్‌లో 4 గంటలు వినియోగించుకునేలా ప్రతిపాదించారు. ఈ లెక్కన 1,500 మెగావాట్ల బిఇఎస్‌ఎస్ ప్రాజెక్టును రెండు సైకిల్స్‌లో కలిపి 3,000 మెగావాట్ల విద్యుత్ నిల్వ చేసుకునే వెసులుబాటు కలగనుంది. రాష్ట్రంలో పిఎం సూర్యఘర్ పథకం కింద 20 లక్షల వినియోగదారుల ఇళ్లపై సౌర ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా సుమారు 4,000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ వస్తుంది.

పిఎం కుసుమ్ పథకం కింద ఫీడర్ల స్థాయిలో మినీ సౌర విద్యుత్ ప్రాజెక్టుల నుంచి వచ్చే ఏడాది మార్చి నాటికి ఉత్పత్తి వస్తుంది. వాటి ద్వారా 1,400 మెగావాట్ల విద్యుత్ రానుంది. గత వైఎస్సార్సీ ప్రభుత్వం సెకితో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 7,000 మెగావాట్ల సౌర విద్యుత్ దశలవారీగా తీసుకోవాలి. ఏప్రిల్ నుంచే 3,000 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసేందుకు ఒత్తిడి తెస్తోంది. ఇప్పటికే మైలవరం, కడప, మరికొన్నిచోట్ల అనుమతించిన సుమారు 2,000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏడాది వ్యవధిలో పూర్తయ్యే అవకాశం ఉంది.

## పాస్టర్ల గౌరవ వేతనానికి రూ. 30 కోట్లు విడుదల

**విజయవాడ,ఏప్రిల్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లింపు కోసం రూ. 30 కోట్లు బడ్జెట్‌ను మైనారిటీ సంక్షేమ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ గురువారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.2024 మే నెల నుంచి నవంబరు వరకు(7 నెలలు) పాస్టర్లకు గౌరవ వేతనాలు చెల్లింపు కోసం ఈ మొత్తాన్ని విడుదల చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 8427 మంది పాస్టర్లకు త్వరలోనే క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా వారి వారి బ్యాంక్ అకౌంట్లకు గౌరవ వేతనాన్ని జమ చేయడం జరుగుతుందని తెలిపారు.గుడ్ ఫ్రైడే ముందు రోజున ప్రభుత్వం పెండింగ్లో ఉన్న గౌరవ వేతనాలు చెల్లింపు కోసం రూ. 30 కోట్లు మొత్తాన్ని విడుదల చేయడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతున్నదని అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా రాష్ట్రంలోని క్రైస్తవులందరికీ శుభాకాంక్షలను మైనారిటీ శాఖా మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు

**ప్రత్యేక మెజిస్ట్రేట్లకు గౌరవ వేతనాన్ని పెంపు**

ప్రత్యేక మెజిస్ట్రేట్లకు గౌరవ వేతనాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ప్రత్యేక మెజిస్ట్రేట్లకు పెంచిన గౌరవ వేతనం కు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ల గౌరవ వేతనాన్ని నెలకు రూ. 30000నుంచి రూ. 45000 కు పెంచినట్లు అలాగే రవాణా ఖర్చుల నిమిత్తం మరో రూ. 5000 మొత్తాన్ని నెలకు చెల్లించనున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.ఇందులో ముఖ్యమైన విషయం గౌరవ వేతనం పెంపుదల2019 ఏప్రిల్ 1వ తేదీ నుంచి వర్తించేటట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

>> నాయుడు 2024 నుంచి ప్రధాని మోడీ మంత్రివర్గంలో క్యాబినెట్ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన నాయకత్వంలో పౌర విమానయాన శాఖలో నూతన మార్పులు చోటు చేసుకున్నాయి. విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాల కల్పన నుంచి దేశంలోని వివిధ మారుమూల ప్రాంతాలకు వైమానిక సేవలను అభివృద్ధి చేసేందుకు ఆయన ఎంతో కృషి చేస్తున్నారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు ద్వారా ఈ ఏడాది యంగ్ గ్లోబల్ లీడర్‌గా కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఎంపికయ్యారు.

ఈ ఏడాది జనవరిలో యూరప్‌లోని దావోస్ వేదికగా ప్రపంచ ఆర్థిక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, టిజి భరత్ తదితరులు హాజరయ్యారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి పలువురు కేంద్రమంత్రులు సైతం వెళ్లారు. వారిలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉన్నారు. ఈ ప్రపంచ ఆర్థిక సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. ఈ నేపథ్యంలో దావోస్ ఆర్థిక సదస్సులో కీలకంగా వ్యవహరించిన కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుకి గ్లోబల్ లీడరు అవార్డు లభించింది.ఈ క్రమంలో సిఎం నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. గురువారం తన ఎక్స్ ఖాతా వేదికగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయడుకు సిఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు మన దేశానికి.. మరి ముఖ్యంగా మన తెలుగు జాతికి గర్వకారణమని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సేవను అంకిత భావంతో చేస్తున్నారంటూ రామ్మోహన్ నాయుడుపై ఆయన ప్రశంసల జల్లు కురిపించారు. ఇది దేశంలోని యూవతకు స్ఫూర్తినిస్తుందన్నారు. మన రాష్ట్రంతోపాటు దేశ పురోగతికి కృషి చేస్తూ.. ప్రపంచ వేదికపై భారత్ స్వరాన్ని వినిపిస్తూ.. ఆయన నిరంతరం విజయాలను సాధించాలని కోరుకొంటున్నట్లు సిఎం చంద్రబాబు వెల్లడించారు.

# వికసిత్ భారత్‌కు 7.8% వృద్ధిరేటు

>> మాట్లాడుతూ భారత దేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్‌భారత్) మారే దిశగా ఎకానమి స్థితిని విశ్లేషిస్తూ ప్రస్తుతం అమెరికా డాలర్లలో 2540 అయిన భారత జాతీయ ఆదాయం 8రెట్లే పెరిగి భారత్‌మిడిల్ ఇన్‌కం నుంచి హై ఇన్‌కం ఎకానమిగా మారాలని చెప్పారు. దీన్ని సాధించాలంటే వచ్చే 24 సంవత్సరాల పాటు సగటు అభివృద్ధి రేటు 7.8శాతం ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. గత రెండు దశాబ్దాలలో భారత్ ఎన్నో సంక్షోభాలను అధిగమించి 8-9శాతం వృద్ధి రేటు సాధించిందని గుర్తు చేసి భవిష్యత్తులో మరింత స్థిరమైన అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని వివరించారు. భవిష్యత్తులో భారత వృద్ధికి మద్దతిచ్చే మూడు ముఖ్య అంశాలను ఆయన వివరించారు. తక్కువ ఆదాయం నుంచి అధిక ఆదాయంపైపు మార్పు, చైనా మరియు కొరియాలాంటి దేశాల మార్గాన్ని అనుసరించి భారత దేశానికి అభివృద్ధి అవకాశం ఉందని వివరించారు. డెమోగ్రాఫిక్ డివిడెంట్ యువజనాభా అధారంగా ఎక్కువ పొదుపు, మెరుగైన సేవల అందింపు, మరియు ఉత్పాదక పెరుగుతుందన్నారు. ఇన్ఫ్రాస్టక్చర్ మరియు సంస్కరణలు ప్రజాస్వామ్యంలో నెమ్మదిగా జరుగుతాయి అనీ భారత్ పట్టుదలగా ముందుకు సాగుతోందన్నారు. ఆటల్‌సెతు, కొత్త పార్లమెంట్ భవనం వంటి ప్రాజెక్టులు దేశ సామర్థ్యాన్ని చూపిస్తున్నాయని వివరించారు. తక్కువ ఉత్పాదకత కలిగిన మైక్రో ఎంటర్ ప్రైజస్‌నుంచి కార్మికులను ఎక్కువఉత్పాదక కలిగిన రంగాల వైపు తరలించాల్సిన అవసరం ఉందన్నారు. ఇది ప్రైవేటు రంగం మరియు, విధాన సంస్కరణలు ద్వారా సాధ్యమౌతుందన్నారు. ముఖ్యంగా కార్మిక మరియు భూమిసంస్కరణలు అత్యవసరమని పేర్కొన్నారు. ప్రశ్నోత్తర సమావేశంలో తయారి రంగంవృద్ధిలో అలస్యం జరిగిందని,దీనికి కారణంగా కఠిన కార్మిక చట్టాలను చెప్పారు. మీడియం ఎంటర్ ప్రైజస్ పెరగాలని, పరిశ్రమ ఆధారిత నైపుణ్య శిక్షణ అవసరమని పేర్కొన్నారు.కాలుష్యనియంత్రణ మరియు శక్తి భద్రత కోసం పునరుత్పాదక ఇంధన వనరులను వాడడం ద్వారా,, భారత్ సుస్థిర అభివృద్ధిని కొనసాగించవచ్చునని చెప్పారు. రాబోయే దశాబ్దంలో భారత దేశం 9-10 ట్రిలియన్ ఎకానమిగా మారే అవకాశం ఉందనే నమ్మకం ఉందని పనగారియా వివరించారు.హ్యూమానిటీస్ మరియు సోషల్ సైన్సెస్ విభాగం నిర్వహించిన సమావేశంలో 16వ ఆర్థిక సంఘం సభ్యులు మరియుఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకానమి గ్రోత్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మనోజ్‌పాండా పాల్గొన్నారు.

# గోవుల మృతిపై చెలరేగుతున్న 'రాజకీయం'

>>అనుమానాలకు తావిచ్చింది. కూటమి నేతలు విసిరిన సవాల్ స్వీకరించిన భూమన అందుకు సిద్ధమంటూ ప్రకటించారు. ఇదే సమయంలో కూటమి పార్టీకిచెందిన ఎమ్మెల్యేలు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని గురువారం ఉదయం గోశాల వద్ద పెద్దఎత్తున నిరసన తెలిపేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కరుణాకర్‌రెడ్డి అబద్ధపు ప్రచారాన్ని, ఆరోపణలను తిప్పి కొట్టాలని కూటమినేతలు పిలుపునిచ్చారు. మరోవైపు కూటమి ఎమ్మెల్యేలతోబాటు వైఎస్సార్సీ నేతలు కూడా భారీగా గోశాల వద్దకు చేరుకుంటారని సమాచారంతో తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో అదనపు ఎస్పీ ఎ.రవి మనోహరచారి, తిరుపతి డిఎస్పీలు ఎం.భక్తవత్సలం, ప్రసాద్, భారీగా పోలీసుబలగాలు మొహరించాయి. దీనికిముందుగానే పోలీసులు తిరుపతి నగరంలో, గోశాల వద్ద ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకున్నారు. కూటమి ఎమ్మెల్యేలతోబాటు వైఎస్సార్సీ నేత భూమన కూడా భారీగా కార్యకర్తలతో రాకూడదని, గన్‌మెన్‌లతోనే గోశాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని కోరారు. అయితే వైఎస్సార్సీ నుండి కొంత విముఖత రావడంతో ముందస్తుగా వైసిపి నేతలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. వారిలో కరుణాకర్‌రెడ్డిని కూడా పోలీసులు గృహనిర్భంధించారు.

**ఇంటివద్దే రోడ్డుపై నిరసన:**

టిడిపి కూటమి నేతలు గోశాల వద్ద గోవుల మృతిపై నేరుగా బహిరంగ చర్చకు రావాలని భూమన కరుణాకర్‌రెడ్డికి పిలుపునిచ్చారు. అయితే దీనికంటే ముందే పోలీసులు గృహనిర్బంధం చేయడంతో, తనను గోశాలకు వెళ్లనివ్వలేదని ఏకంగా ఇంటివద్దే పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. ఈ నిరసనతో అక్కడ వాతావరణం మరింత టెన్షన్‌గా మారింది. ఈ సమయంలో గోశాలను పరిశీలించడానికి తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి, వైసిపి తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, మాజీమంత్రి ఆర్‌కె రోజా కూడా చేరుకోవడంతో కూటమి నేతలు మాటల యుద్ధం చేశారు. మరోవైపు ఎంపితో కలసి గోశాలలో ఉన్నపుడు ఓ దశలో ఇరువర్గాలు మాటామాటా చేసుకున్నారు. దీంతో పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. ఈ నేపథ్యంలో యువనేత అభినయ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఎస్వీయూనివర్సిటీ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

**గుంపులుగా గోశాల వద్దకు రావద్దు:**

ఎస్వీగోశాల ఉన్న తుమ్మలగుంట ప్రాంతంకు ఏ పార్టీ నాయకులైనా గుంపులుగా రావద్దని పోలీసులు సూచించారు. కార్యకర్తలతో కాకుండా గన్‌మెన్‌లతో రావాలని, గోశాలను సందర్శించి మీడియాతో మాట్లాడి వెళ్లిపోవాలని కోరారు. అయితే అప్పటికే కూటమి పార్టీల ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, డాక్టర్ మురళీమోహన్, బొజ్జల సుధీర్‌రెడ్డి, డాక్టర్ థామస్,తిరుపతి నేతలు నరసింహయాదవ్, సుగుణమ్మ, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, శ్రీధర్‌వర్మ, కంకణాల రజినీకాంత్‌నాయుడు, సిఆర్ రాజన్ ఇలా భారీగా చేరుకుని గోశాలలోని ఆలయం వద్ద వేచివున్నారు.

**భూమనకు స్వయంగా ఫోన్‌చేసి పిలిచిన బొజ్జల:**

గోశాలలో వందకుపైగా గోవులు మృతిచెందాయని వైసిపి నేత భూమన అబద్ధపు ప్రచారం, ఆరోపణలపై కూటమి పార్టీల నేతలు చర్చకు సవాల్ విసిరారు. దీంతో పోలీసులు బయటకు రానీయలేదని భూమన కూటమినేతలకు తెలియజేశాడు. అయితే పోలీసు ఎస్కార్ట్‌మధ్య తీసుకువస్తామని, మీ అంగీకారం చెప్పాలని, జగన్ పాలనలో అక్రమాలు జరిగాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కరుణాకర్‌రెడ్డికి ఫోన్‌లో సంభాషించాడు. అయితే పోలీసుల నుండి అనుమతి వస్తేగానీ రానని చెప్పి ఆయన రాలేకపోయారు. దీంతో గోవుల మృతిని రాజకీయ లబ్ధికోసం వాడుకోవాలని ప్రయత్నించిన వైఎస్సార్సీ నేతలు స్తబ్ధుగా ఉండాల్సి వచ్చింది.

## వారం - వర్జ్యం

తేది : 18-04-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.పంచమి సా.5.04
జ్యేష్ఠ ఉ.8.20
వర్జ్యం రా.9.35-రా.11.18
దు.ఉ.10.03-10.53, 2) మ.3.04-3.54
శుభసమయం : ఉ.9.20-9.40, సా.6.00-7.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:**సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు.

**వృషభం:** ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం. ప్రయాణాలలో తొందరపాటు వద్దు. వస్తువులు కొనుగోలు.

**మిథునం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురువుతాయి.

**కర్కాటకం:** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తిచేస్తారు. ఋణబాధలు ఎదురై చికాకులు పెడతాయి.

**సింహం:** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వస్తులాభం.

**కన్య :** దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**తుల :** స్థిరాస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. బంధువుల నుండి శుభవార్తలు.

**వృశ్చికం:**ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. సోదరుల నుండి ధనలాభం పొందుతారు.

**ధనుస్సు:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. శ్రమకు తగ్గిన ఫలితం దక్కదు.

**మకరం:**ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కుటుంబ సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**కుంభం:** వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. అధిక శ్రమ.

**మీనం :** ఏ పని చేపట్టినా వాయిదా పడుతుంది. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కాశ్మీర్‌ను పాక్ ఎప్పటికీ మరిచిపోదు! పాక్ ఆర్మీ-చీఫ్ ఆసీమ్ మునీర్

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 17:** కశ్మీర్‌పై పాకిస్థాన్ మరోసారి నోరుపారేసుకుంది. ఇస్లామాబాద్‌కు కశ్మీర్ గొంతుకు వెళ్లే రక్తనాళం వంటిదని పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ వ్యాఖ్యానించారు. కశ్మీర్‌ను పాకిస్థాన్ ఎప్పటికీ మర్చిపోదని, కశ్మీరీలను ఒంటరిగా వదిలిపెట్టబోమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓ ప్రవాస పాకిస్థానీయుల సమావేశంలో పాల్గొన్న మునీర్ ఇతర దేశాల్లో ఉంటున్న పాకిస్థానీలు తమ ఉన్నతమైన భావజాలం, సంస్కృతిని మర్చిపోవద్దనీ, పిల్లలకు పాక్ చరిత్ర వివరిస్తూ ఉండాలని సూచించారు. తమ తాతలు ప్రతీఅంశంలో తాము హిందువుల కంటే భిన్నమైన వాళ్లమని భావించారనీ అదే రెండు దేశాల ఏర్పాటుకు పునాది వేసిందంటూ విషం చిమ్మారు. ప్రతి విషయంలో మనం హిందువులకంటే విభిన్నవారిమైన మన పూర్వీకులు నమ్మారు. మన మతం విభిన్నం. మన ఆచారాలు, సంస్కృతులు, ఆలోచనలు, ఆశయాలు పూర్తిగా భిన్నం. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది. మనం రెండు విభిన్న దేశాలు, ఒకటి కాదు అని నమ్మారు కాబట్టే ఈ సిద్ధాంతం పుట్టింది. అందుకే పాకిస్థాన్ చరిత్రను మరిపోవద్దని మీ పిల్లలకు కచ్చితంగా చెప్పాలి. ఈ దేశాన్ని ఏర్పాటు చేయడానికి మన పూర్వీకులు చాలా త్యాగాలు చేశారు. మనం కూడా చేశాం. ఈ దేశ చరిత్రను మరిచిపోవద్దని ప్రతిఒక్కరినీ కోరుతున్నాను జనరల్ అసీమ్ మునీర్, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ 13లక్షల ఆర్మీ ఏం చేయలేకపోయింది. దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలపై మాట్లాడిన ఆయన 13 లక్షల బలమైన భారత సైన్యమే తమను ఏమీ చేయలేదనీ, ఉగ్రవాదులు పాకిస్థాన్ ఆర్మీని ఏం చేయగలరని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. బలూచిస్తాన్ వేర్పాటువాదాన్ని తమ సైన్యం అణచివేస్తుందని, మరో 10 తరాల వరకు కూడా ఉగ్రవాదులు విజయం సాధించలేరని చెప్పారు. పాక్ ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలతో ఆ దేశ సైనిక నాయకత్వానికి ఇండో పాక్ ఘర్షణలను పరిష్కరించే ఉద్దేశం లేదని స్పష్టమైంది. ఆయన వ్యాఖ్యలపై భారత్ ఘాటుగా స్పందించే అవకాశం ఉంది.భారత్ కొట్టిన దెబ్బకు రియాక్షన్ ఇటీవల ఐక్యరాజ్యసమితివేదికగా శాంతి పరిరక్షక సంస్కరణ అంశంపై జరిగిన డిబేట్‌లో పాకిస్థాన్ కశ్మీర్‌పై చేస్తున్న విష ప్రచారాన్ని భారత్ ఎండగట్టింది.

## తైవాన్‌కు అత్యంత సమీపంలో చైనా జలాంతర్గాములు!

**తైపీ, ఏప్రిల్ 17:** తైవాన్‌కు అత్యంత సమీపంలో చైనాకు చెందిన శక్తిమంతమైన జలాంతర్గాముల కదలికలుపెరిగాయి. తాజాగా గూగుల్ మ్యాప్స్‌లో ఈ విషయం వెల్లడైంది. తైవాన్ సమీపంలోని చైనా నౌకాదళ స్థావరమైన క్వింగ్‌డావ్‌లో కనీసం ఆరు శక్తిమంతమైన జలాంతర్గాములు దర్శనమిచ్చాయి. ఎల్లోసీలో ఉన్న దీనిని చైనా తొలి సబ్‌మెరైన్ బేస్‌గా వ్యవహరిస్తారు. ఈ చిత్రాలను ఆస్ట్రేలియాకు చెందిన నావికాదళ నిపుణుడు అలెక్స్‌లక్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.జపాన్ సముద్రం, తూర్పు చైనా సముద్రజలాల్లోకి అత్యంతవేగంగా జలాంతర్గాములు ప్రవేశించేందుకు క్వింగ్‌డావ్ స్థావరం అనుకూలం. ఇక్కడ రెండు టైప్ 091, 093ఏ జలాంగర్గాములు నిలువగా.. మరో గుర్తుతెలియని సబ్‌మెరైన్‌కూడా ఉంది.

ప్రస్తుతం దానిని విచ్ఛిన్నంచేస్తుండి ఉంటారని పేర్కొన్నారు. ఇక అదే చిత్రంలో టైప్092 జలాంతర్గామి కూడా కనిపిస్తోంది. దీని స్థానాన్ని సరికొత్త టైప్ 094తో భర్తీ చేయనున్నారు. బీజింగ్‌తో ఉద్రికత్తలు పెరుగుతున్న వేళ తైవాన్ వార్షిక హన్‌కుయాంగ్ యుద్ధ విన్యాసాలు మొదలుపెట్టింద. అవి 14 రోజులపాటు జరగనున్నాయి. 2027లో చైనా ఆక్రమిస్తుందనే అంచనాలను దృష్టింలో పెట్టుకుని వీటిని నిర్వహిస్తున్నట్లు తైవాన్ రక్షణ మంత్రి వెల్లింగ్టన్ కూ పేర్కొన్నారు.

# రైతులకు అండగా నిలవాలి

>> బకాయిలను చెల్లించడం జరిగింది అన్నారు... కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలల కాలంలో దాదాపు 24 వేల కోట్ల రూపాయలను చెల్లించిందన్నారు. సంస్కరణల్లో భాగంగా నూతన సాంకేతిక విధానం అవలంబించి ధాన్యం కొనుగోలుకు వాట్సాప్ విధానం ప్రవేశపెట్టిందన్నారు. వాట్సాప్ విధానంలో 17వేల మంది రైతులు ధాన్యం అమ్మకం జరిపేరన్నారు. ఖరీఫ్ మాసంలో ఆరు లక్షల మంది రైతుల నుంచి 38 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు... ధాన్యం కొనుగోలు జరిగిన 24 గంటల్లో రైతుల ఖాతాలో నగదు జమ కావడంతో వారు ఆనందంగా ఉన్నారన్నారు. అదేవిధంగా రేషన్ పక్కదారి పట్టకుండా రేషన్ మాఫియాపై ఉక్కు పాదం మోపడం జరిగింది అన్నారు.నూతన సాంకేతిక విధానంతో కొత్త రేషన్ కార్డులు అందించబోతున్నామని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగించి ప్రతి వేర్ హౌస్ గోడౌన్‌వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తున్నామన్నారు. కాబట్టి బ్యాంకర్స్ వడ్డీ రేటు తగ్గించుకొని ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందించే రేషన్ కోసం చాలామంది ప్రజలు ప్రతినెలా ఎదురుచూస్తున్నారన్నారు. ప్రతి కార్డుదారుని సకాలంలో రేషన్ అందాలన్నారు.

18-04Pg3exHMNWJQEBP.qxd:18-04Pg3exHMNWJQEBP.qxd 18/04/25 12:54 AM Page 1





## తిరుమలలో అపచారాలపై పవన్ ఎందుకు మాట్లాడటంలేదు

### - మాజీ మంత్రి రోజా

**తిరుమల,ఏప్రిల్ 17ప్రభాతవార్తప్రతినిధి:** సనాతన ధర్మాన్ని కాపాడతామన్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇవాళ తిరుమలలో అపచారాలు జరుగుతుంటే ఎందుకు మాట్లాడటంలేదని మాజీమంత్రి ఆర్‌కె రోజా ప్రశ్నించారు. ఎక్కడో ఏదో జరిగితే స్పందించి మాట్లాడే ఆయన తిరుమల విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని విమర్శించారు. డైవర్షన్ పాలిటిక్స్ చేసి ఎక్కడో ఏదో జరిగితే మాట్లాడే ఆయన అపచారాలపై ఎందుకు మాట్లాడటం లేదన్నారు. తప్పుచేసిన వారిని శిక్షించాలని ఎందుకు నిలదీయడంలేదని అన్నారు. ఇదేనా పవన్‌కల్యాణ్ చిత్తశుద్ధి..పదవులు ఇచ్చి ప్యాకేజీలు ఇస్తే నోరు పెగలదా అని రోజా వ్యంగ్య విమర్శలు చేశారు. గురువారం ఉదయం తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె తిరుపతికి వెళ్ళి టిటిడి ఎస్వీగోశాల వద్ద ధర్నాలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. గోశాలలో గోవుల మృతిపై మాట్లాడాలని, ప్రభుత్వంలో తప్పులపై నిలదీయాలని సూచించారు.

# రాజధానిపై నారాయణ మంత్రం

### - అమరావతి రాజధానిలో పడిపోయిన ప్లాట్ల ధరలు
### - ల్యాండ్‌బ్యాంక్ కోసమే ఎత్తుగడ అంటున్న రైతులు
### - ఆందోళన వద్దు మంత్రి నారాయణ

**సచివాలయం,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం అధికారంలోనికి రావడంతో తమప్లాట్లకు ధరలకు రెక్కలు వచ్చిన ఆనందంలో ఉన్న రైతుల ఆశలపై నీళ్ల పోసినట్లు అయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.రాజధాని అవసరం కోసం ఇంకా 44వేల ఎకరాల భూమి అవసరం ఉంటుందనిరాష్ట్ర పురపాలక శాఖమంత్రి నారాయణ సూచనప్రాయంగా వెల్లడించారు .దాదాపు అవసరమైన వేల ఎకరాలను చుట్టుపక్కల 4మండలాల్లో సేకరించే అవకాశం ఉందని మంత్రి వివరించారు.100ఏళ్ల ముందు చూపుతో ముఖ్యమం త్రి రాజధాని అవసరాలకు ఉపయోగపడేలా అలోచనలు చేశారన్నారు.ఇందులో భాగంగానే ప్రపంచస్థాయి విమానాశ్రయం,రైల్వే జంక్షన్, పర్యాటక ప్రదేశాలు,క్రీడామైదానాలు నిర్మించే విధంగా ప్రణాళిక రూపొందించాలని భావిస్తున్నారు.ఇప్పటికే కొన్ని గ్రామాల రైతులు మాభూములు పూలింగ్‌కు ఇస్తామని ముందుకు వచ్చిన విషయం గతంలోజరిగింది,అయితే దాదాపు 60వేల కోట్లు నిధులు అమరావతి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం జరిగింది.గతంలో కూడా సీఆర్డీఏ కోర్ కాపిటల్ విషయంలో ప్రకటనలకు విరుద్ధంగా నిర్ణయించారు.గత వారం రోజులుగా కొనుగోలు దారుల రాక గతంలో ఇచ్చిన అడ్వాన్స్ వదులుకొని మా రైతులకు కన్నీళ్ల పెట్టిస్తున్న పరిస్థితి ఏర్పడింది.ఇంత జరిగిన తర్వాత ఎలాంటి ఆందోళనవ వద్దు అనిచెప్పండం ఎంటని ప్రశ్నిస్తున్నారు.కానీ రైతులకు అందిన సమాచారం ప్రకారం ఈ ప్రకటన విడుదల చేసిన అనంతరం పక్క మండలాల్లో తక్కువ ధరలకు భూములు వస్తున్న నేపద్యంలో కొనుగోలు దారులు భూములు కొంటున్నారు.కూటమి అధికారంలోకి వచ్చిన సందర్భంగా 8వేల ఎకరాలు ల్యాండ్ సిఆర్‌డిఏ కి ఉందని చెప్పారు.కానీ ఇప్పుడు కేవలం 2వేల ఎకరాలు మిగిలిందని మంత్రి ప్రకటించారు.ఈ నేపద్యంలో మంత్రి లంక గ్రామాల్లో పర్యటించడం కొన్ని అనుమానాలకు దారీ తీస్తుందన్నారు.33,000ఎకరాలు స్వీకరించిన భూమితోపాటు ప్రభుత్వ భూములు ఉన్నాయని ఆ వివరాలు తెలియజేయకపోడం చాలా హాస్యాస్పదంగా ఉందని ఆ భూములను కేటాయించిన వివరాలు ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.రాజధానిలో భూముల ధరలు పడిపోవడం వెనక ప్రభుత్వం లోని కొందరి హస్తం కూడా ఉందని విమర్శలు రైతుల నుంచి వినిపిస్తుంది

## భూమనను గృహనిర్భంధం చేయలేదు

### - తిరుపతి ఎస్పీ

**తిరుపతి,ఏప్రిల్ 17ప్రభాతవార్తప్రతినిధి:** గోశాలలోగోవుల మృతిపై రాజకీయపార్టీల నేతలు సవాళ్ళు ప్రతిసవాళ్ళు నేపధ్యంలో వైసిపి నేత,మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని పోలీసులు గృహనిర్బంధం చేయలేదని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు వివరణ ఇచ్చారు. ఆయన్ను పోలీసులు గృహనిర్బంధం చేశారనే వార్తలను ఖండించారు. టిటిడి గోశాలకు వెళ్ళడానికి భూమనకు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే రెండు పార్టీల నేతలు ఒకేసమయంలో వెళ్లకూడదని, వ్యక్తిగత భద్రతా సిబ్బందితో మాత్రమే వెళ్ళవచ్చని సూచించామని ఎస్పీ తెలిపారు.

# అధికార బలంతో కాంగ్రెస్‌ను అణచివేయాలని చూస్తే ప్రతిఘటిస్తాం

### - సోనియా,రాహుల్‌పై అక్రమకేసులు ఎత్తివేయాలి
### - తిరుపతిలో కాంగ్రెస్ నేతల నిరసన

**తిరుపతి, ఏప్రిల్ 17ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రంలో అధికారంలో ఉన్నామని, ఇకపై తామే ఉంటామని బరితెగింపుతో బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని అణగదొక్కాలని చూస్తే ప్రతిఘటన తప్పదని తిరుపతి జిల్లా కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయనాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై చార్జిషీట్లు నమోదు చేయడాన్ని తిరుపతి కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. బిజెపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తిరుపతినగర అధ్యక్షుడు గౌడపేరచిట్టిబాబు మాట్లాడుతూ బిజెపి అధికార బలంతో రాజ్యాంగాన్ని, చట్టాలను తుంగలో తొక్కి ఇష్టానుసారం వ్యవహరిస్తోందాన్నరు. అప్రజాస్వామికంగా మోడీ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఓ కేసులో లింకుపెట్టి పార్టీ గుర్తింపును రద్దుచేయాలని కుట్రచేయడం బిజెపి నేతల అసలు రంగు బట్టబయలు అవుతుందన్నారు.



## అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన పోలీసులకు అవార్డులు

**విజయవాడ,ఏప్రిల్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** నేర శోధనలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన పోలీసులకు డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ఎబిసిడి అవార్డులను అందజేశారు. ఆ మేరకు డీజీపీ కార్యాలయం నేడు సమాచార పత్రాన్ని విడుదల చేసింది.పశ్చిమ గోదావరి జిల్లా ఎస్‌పి అద్నాన్ నయూమ్‌ఆస్మి నేతృత్వంలోని టీమ్ హత్య కేసును అత్యంత సమర్ధవంతంగా శోధించినందుకు ప్రథమ బహుమతిని, శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పి రత్న నేతృత్వంలోని టీమ్‌కు శిశువు హత్యకు సంబంధించి 26 ఏళ్ల పాత కేసును చేధించినందుకు ద్వితీయ బహుమతికి ఎంపిక చేశారు. విజయనగరం జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ నేతృత్వంలోని టీమ్‌కు సైబర్ క్రైమ్ (డిజిటల్ అరెస్ట్) కేసును చాకచక్యంగా చేధించినందుకు తృతీయ బహుమతిని గుంటూరు జిల్లా ఎస్‌పి ఎస్ సతీష్‌కుమార్ నేతృత్వంలోని టీమ్‌కు చేబ్రోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక హత్య కేసును చాకచక్యంగా చేధించినందుకు కూడా తృతీయ బహుమతిపి అందజేశారు. సకాలంలో నిందితులను అరెస్ట్ చేసినందుకు పోలీస్ అధికారులను డిజిపి అభినందించారు.

# పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో కౌంటర్‌వేయాలని హైకోర్టు ఆదేశం

**విజయవాడ,ఏప్రిల్17,ప్రభాతవార్తప్రతినిధి:** పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల అనుమానస్పద మృతి పట్ల దాఖలైన కేసులో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులిచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డిజిపి, సిట్ డిఎస్‌పి, సిబిఐలకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల మృతి ఘటనపై అనుమానాలు ఉన్నాయని, సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు కెఎ పాల్ వేసిన పిల్, ఇదే తరహాలో రాజమండ్రికి చెందిన దాడి నాగేశ్వరరావు మరో పిల్‌ను కలిపి బెంచ్ విచారించింది. పోస్టుమార్టం నివేదికతోపాటు సిసిటివి ఫుటేజ్, ఇతర సాక్ష్యాలన్నింటినీ భద్రపరిచేలా పోలీసులకు ఉత్తర్వులివ్వాలని పాల్ కోరారు. రోడ్డు ప్రమాదంలో మరణించినట్లుగా తప్పుగా చెబుతున్నారని, తప్పుడు వీడియోలతో మృతిపై సందేహాలు రేకెత్తేలా చేశారని, ఈ వ్యవహారంపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశాలివ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్ ప్రణతి వాదిస్తూ, ప్రవీణ్ మద్యం తాగి బైక్ నడిపి ప్రమాదానికి గురై మరణించారని చెప్పారు. కౌంటర్ వేస్తామని చెప్పడంతో విచారణ వాయిదా పడింది.

# డిజిటల్ మీడియాను మరింత బలోపేతం చేయాలి

### - తిరుమలలో క్రమం తప్పకుండా టిటిడి సేవలపై ప్రకటనలు ఇవ్వాలి
### - టిటిడికి అసెంబ్లీ అంచనాల కమిటీ సూచన



**తిరుమల,ఏప్రిల్ 17ప్రభాతవార్తప్రతినిధి:** నవతరానికి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి వైభవాన్ని తెలియజేసేలా డిజిటల్ మీడియాను మరింత బలోపేతం చేయాలని ఏపి అసెంబ్లీ అంచనాల కమిటీ సూచించింది. తిరుమలలో క్రమం తప్పకుండా టిటిడిసేవలపై ప్రకటనలు ఇవ్వాలని,టిటిడి వసతి గృహాల్లో అన్ని చోట్ల శ్రీవేంకటేశ్వరస్వామి ,పద్మావతి అమ్మవారి చిత్రపటాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టిటిడి సేవలను కమిటీ సభ్యులు అభినందిస్తూ పలు అంశాలపై సూచనలు చేశారు. గురవారం ఉదయం అసెంబ్లీ అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుల్ల జోగేశ్వరరావు, సభ్యులు భూమా అఖిలప్రియ, నమ్మిక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, డాక్టర్ వాల్మీకి పార్థసారధి, పాశం సునీల్‌కుమార్, వరుదు కళ్యాణి, పెన్మమ్మత్స వరాహ వెంకట సూర్యనారాయణరాజు, ఏలూరు సాంబశివరావు, టిటిడి ఇఒ శ్యామలరావు, .జెఇఒ వీరబ్రహ్మం, సిఇ సత్యనారాయణతో కలసి కమిటీ సమావేశమైంది. శ్రీవారి భక్తులకు అందిస్తున్న సేవలపై అంచనాల కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో భక్తులకు అందిస్తున్న సేవలకు, ప్రస్తుతం సేవలకు సేవలలో చాలా మార్పు కనిపిస్తోందని అన్నారు. శ్రీవారి భక్తులకు మరింత నాణ్యంగా సేవలందించి స్వామివారి అనుగ్రహానికి పాత్రులూకావాలని కోరారు. గురువారం ఉదయం ఈ కమిటీ ఆలయంలోనికి చేరుకుని తొలుత శ్రీవారిని దర్శించుకున్నారు.

## మంత్రి నారా లోకేష్‌పై ట్విట్టర్‌లో పోస్టు

### - చిత్తూరులో కృష్ణవేణిపై కేసు నమోదు

**చిత్తూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై ఎక్స్(ట్విట్టర్) వేదికగా అనుచిత వాఖ్యలు చేసిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కృష్ణవేణిపై చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్త కృష్ణవేణి ఎక్స్(ట్విట్లర్) వేదికగా బుధవారం అనుచిత వాఖ్యలు చేశారు. అలాగే మంత్రి నారా లోకేష్ ఫోటోలను మార్ఫింగ్ చేసి శాంతి భద్రతలకు విఘాతం కల్గించే విధంగా ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు పెట్టారు. ఈ విషయంపై చిత్తూరు నగరంలో నివాసం వుంటున్న తెలుగుదేశం కార్యకర్త, మంత్రి నారా లోకేష్ అభిమాని శ్రీనివాసబాబు తమ అభిమాన నేత, మంత్రి నారాలోకేష్‌పై ఒక పార్టీకి చెందిన మహిళ సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ అసభ్యకర మార్ఫింగ్ ఫోటోలు పెట్టి మంత్రి నారా లోకేష్‌ను అప్రతిష్టపాలు చేసిందని బుధవారం వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ కృష్ణవేణిపై సిఆర్‌నెం.48/2025 అండర్ సెక్షన్ 196(1), 353(2), 352, 336(3), 336(4), బిఎన్‌ఎస్, 66-ఇటిఎ-2000-2008 కింద కేసు నమోదు చేశారు. ఇప్పటికే కృష్ణవేణిని పోలీసులు తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులో అరెస్టు చేసి ఆంధ్రకు తీసుకువచ్చి పలు పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులపై విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తగా చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో కృష్ణవేణిని చిత్తూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి కోర్టులో హాజరుపరచే అవకాశాలు వున్నాయి.

## గ్రామ కంఠాల సమస్య తొలగించ లేదు: కన్నెధార శివశంకర్

**సచివాలయం,ఏప్రిల్ 17,ప్రభాతవార్త : ఇప్పటికీ** గతంలో రైతులు భూ సమీకరణ ద్వారా ఇచ్చిన భూములకు సంబందించి గ్రామకంఠాల సమస్య తొలగించలేదని పెదపరిమి రైతు కె.శివశంకర్ తెలిపారు.కొందరి రైతులకు ప్లాట్లు ఎండోమెంట్స్ ల్యాండ్లను చెరువుల్లోనూ రెవెన్యూ డొంకలు రోడ్లలోనూ కేటాయించారని వారికి న్యాయం చేయకుండానే పదేళ్ళు గడిచిందని విమరి ్శంచారు.పక్క గ్రామాల రైతులు గత ఐదేళ్ళుగా భూములిచ్చి ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారో చూశామని తెలిపారు.ప్రభుత్వం భూములు సేకరించే అంత ఉత్సా హం వారి సమస్యలు పరిష్కరించే విషయంలో చిత్తశుద్ధిలేదని అర్థమైందన్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే తిరిగి ఇబ్బందులు వస్తాయని రైతన్నలకు తెలిసిందని ఇలాంటి సందర్భాల్లో భూములిచ్చే విషయంలో మేము సిద్ధంగా లేమని తెలిపారు.

# మృతదేహం డోర్ డెలివరీ కేసులో ప్రత్యేక న్యాయవాదిగా ముప్పాళ్ల సుబ్బారావు

**విజయవాడ ఏప్రిల్ 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య,అనంతరం అతని మృతదేహాన్ని డోర్‌డెలివరీ చేసిన కేసులో ఏపీ ప్రభుత్వం ప్రత్యేక న్యాయవాదిని ఏర్పాటు చేసింది..ముప్పాళ్ల సుబ్బారావును ప్రత్యేక న్యాయవాదిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌కు ప్రత్యేక న్యాయవాది సహకరిస్తారు. తన వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న కాకినాడకు చెందిన వీధి సుబ్రహ్మణ్యం అనే దళిత యువకుడిని వైకాంగ్రెస్‌పార్టీకి చెందిన ఎంఎల్‌సీ అనంతబాబు హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసినట్లు అభియోగాలున్నాయి. ఈ కేసు అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. అప్పటి ప్రభుత్వం వ్యవహరించిన తీరు పోలీసుల దర్యాప్తుపై ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి. బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ న్యాయవాది హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు తీవ్ర పోరాటం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసును ప్రత్యేకంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో గతంలో ఇదే కేసుపై న్యాయపోరాటం చేసిన ముప్పాళ్ల సుబ్బారావును ప్రత్యేక న్యాయవాదిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



## లిక్కరు స్కాంలో ఎంపి మిధున్‌రెడ్డి విచారణను రికార్డు చేసే అంశాన్ని పరిశీలించాలి: హైకోర్టు

**విజయవాడ,ఏప్రిల్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం వ్యవహారంలో ఏపీ సిట్ జారీ చేసిన నోటీసులపై ఎంపీ మిథున్ రెడ్డి హైకోర్టునుఆశ్రయించారు. మద్యం కుంభకోణంలో ఈ నెల18న విచారణకు రావాల్సి ఉందిగా మిథున్ రెడ్డికి ఏపీ సిట్ నోటీసులు ఇచ్చింది. విచారణ సందర్భంగా న్యాయవాదిని అనుమతించాలని, వీడియో రికార్డింగ్ చేసేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. మిథున్ రెడ్డి వేసిన పిటిషన్‌పై ఈరోజు విచారణకు వచ్చింది.విచారణను రికార్డు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఐడీకి హైకోర్టు ఆదేశించింది.లిక్కర్ స్కాంలో రేపు ఉదయం 11 గంటలకు మిథున్ రెడ్డి సిట్ ముందు విచారణకు హాజరుకావాల్సి ఉంది. మద్యం కుంభకోణం కేసులో విచారణకు రావాల్సి ఉందిగా మిథున్ రెడ్డికి ఏపీ సిట్ నోటీసులు జారీ చేసింది. రేపు ఉదయం విజయవాడలోని సీపీ కార్యాలయంలోని ఏపీ సిట్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని, దీనికి సంబంధించిన డాక్యుమెంట్లు, ఇతర సమాచారం తమకు అందించాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

**కార్పొరేషన్ ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** కడప రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కడప నకాష్ వీధికి చెందిన సోను(23) జులాయి గా తిరిగేవాడు. ఇతనిపై గతంలో రెండు గంజాయి కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిన్న పోలీసులు గంజాయి కేసులో సోను అదుపులోకి తీసుకొని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ లో ఉంచారు. రాత్రి ఉన్నఫలంగా సోనుకు కడుపు నొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఇక్కడికి రాగానే మృతి చెందాడు. కానీ సోను పోలీస్ స్టేషన్ లోని బాత్రూంలో తన చొక్కాతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. కానీ పోలీసులు ఆ విషయాన్ని ధ్రువీకరించలేదు. మృతుడి తల్లి మాత్రం తన కుమారుడు కడుపు నొప్పితోనే చనిపోయాడని మీడియాకు వెల్లడించారు.

ఆత్మహత్య చేసుకున్నాడా లేదా కడుపునొప్పితో మృతి చెందాడు అనేది తెలియ రావడం లేదు. పోలీసులు మాత్రం ఏ విషయాన్ని స్పష్టం చేయడం లేదు.

# సిట్ దర్యాప్తుతో బట్టబయలు కానున్న వైఎస్‌ఆర్సీ బండారం

### -ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకే టిటిడి గోశాల ఆవుల మరణం అంటూ డ్రామాలు
### -ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు తాము చేసిన తప్పుల కర్మ వెంటాడుతుందని, వారు అధికారంలో ఉండగా చేసిన అవినీతి, అవకతవకల బండారం సిట్ దర్యాప్తుతో బట్టబయలవుతుందనే భయంతో ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు టిటిడి గోశాలలో ఆవులు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మరణించినట్లు భూమన అసత్య ప్రచారాలు చేయటం మొదలు పెట్టారని, దీని వెనుక వైఎస్ జగన్మోహనరెడ్డి కుట్ర ఉందని ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్ శరపరంపరగా ధ్వజమెత్తారు. రఘురామ్ గురువారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్‌రెడ్డి చేసిన తప్పులకు ప్రజలకు క్షమాపణ చెప్పాల్సి ఉందిపోయి, అసత్యాలు ప్రచారం చేస్తూ రాజకీయంగా పబ్బం గడుపుకోవాలని యుక్తులు పన్నుతున్నారని, కూటమి ప్రభుత్వంలో ఇలాంటి చౌకబారు ఎత్తులు చెల్లనేరవని అన్నారు. భూమన కరుణాకరరెడ్డికి దేవుడి మీద నమ్మకం లేదని, ఇలాంటి వ్యక్తిని జగన్‌రెడ్డి టిటిడి ఛైర్మన్ చేయటం వలన అక్కడ మాఫియా తరహాలో దేవుడి సొమ్ము దోపిడీ జరిగిందని ఆరోపించారు. టిటిడిలో 35 మంది బోర్డు సభ్యులను జగన్ నియమిస్తే హైకోర్టు కొట్టివేసిన విషయం గుర్తుచేసుకోవాలన్నారు. ఇంట్లో బైబుల్ చదువుతానంటూ తాను క్రిష్టియానిటీ అనే విషయాన్ని తానే వెల్లడించి, ఆలయ ప్రతిష్టను భంగ పర్చేందుకు కనీసం డిక్లరేషన్ కూడా ఇవ్వకుండా తిరుమలకు వచ్చి భక్తి నటించిన విషయం ప్రజలంతా గమనించారన్నారు. తిరుమలలో నెయ్యి కొనుగోళ్ళలో అవినీతి, ప్రసాదాల కల్తీ, గోశాల ఆవులకు కాలం చెల్లిన మందులు వాడటం, హరినాథరెడ్డి విజిలెన్స్ వారిని గోశాలకు రానివ్వకుండా అడ్డుకోవటం వంటి దుర్మార్గాల గురించి అందరికీ తెలిసిపోయిందన్నారు. తిరుమల శ్రీవారి పట్ల అనుచితంగా, అవినీతిగా, అక్రమంగా ప్రవర్తించేవారికి ఎలాంటి దుర్గతి పడుతుందో చరిత్ర చెబుతోందని హెచ్చరించారు. కాగా సమావేశంలో టిడిపి నాయకులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, గింజుపల్లి రమేష్, తాళ్ళూరి వెంకటేశ్వర్లు,

అమ్మనబోయిన రాణి, సంకా వెంకట్రావు, సంకా భాస్కర్, ఇన్నమూరి రాజు, షేక్ అన్వర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా పేద పిల్లల ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర విద్యాశాఖ

**విజయవాడ,ఏప్రిల్17,ప్రభాతవార్తప్రతినిధి:** ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో పేద పిల్లల ప్రవేశాలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది.ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. 2025- 26 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతి ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తులు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నాయని సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న, బలహీన వర్గాల పిల్లలకు రాష్ట్రంలో వారి నివాస సమీప ప్రాంతంలో అన్ని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత గ్రామ సచివాలయం, మండల విద్యావనరుల కేంద్రం, సంబంధిత పాఠశాల నుంచి మే 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

ఇతర విషయాల కోసం సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులను సంప్రదించవచ్చని, అదే విధంగా టోల్‌ఫ్రీ నెంబర్ 18004258599ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు ఆన్‌లైన్ పోర్టల్‌లో ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు నమోదు చేయాలని ఆదేశించారు.

# ల్యాండ్ బ్యాంక్‌కోసం ఇదో ఎత్తుగడ

### తుళ్లూరు బిజెపి నాయకులు మార్తా రవి

**సచివాలయం,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** అమరావతిలో మౌలికవసతులు కల్పించి రైతుల ప్లాట్లు ఆబివృద్ధి చేసి తర్వాత ప్రభుత్వం ఆలోచించి ముందుకు వెళ్లాలని బిజెపి నాయకులు మార్తా రవి అన్నారు.రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ప్రకటనలతో రైతులు గందరగోళంలో ఉన్నారన్నారు.

ఇప్పటికే మూడు మండలాల పరిధిలో 33,000వేల ఎకరాలు భూ సమీకరణ ద్వారా తీసుకొని పది సంవత్సరాలు గడిచిందని ఇంతవరకు ప్లాట్లో అభివృద్ధి గానీ మౌలిక వసతులు గానీ కల్పించలేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వంశీ 40,000వేల ఎకరాలు భూ సమీకరణ లేదా భూ సేకరణ ద్వారా సేకరించే ఆలోచన చేస్తామనటం సమంజసం కాదన్నారు.ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.



## ప్రైవేటు వైద్య కళాశాలలకు డీమ్డ్ హోదా ఇవ్వడం కుదరదు

### వైద్య ఆరోగ్య శాఖ

**విజయవాడ ఏప్రిల్ 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలలను డీమ్డ్ హోదా ఇవ్వకూడదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.ఈ మేరకు దరఖాస్తు చేసిన వైద్యకళాశాలల యాజమాన్యాలకు ఎన్వోసీ ఇవ్వడం సాధ్యంకాదని వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేస్తూ లేఖలు పంపింది. డీమ్డ్ హోదా ఇస్తే ఫీజులు చెల్లించే స్థోమత లేని వారు తీవ్రంగా నష్టపోతారని వైద్య ఆరోగ్యశాఖ వ్యక్తం చేసిన అభిప్రాయంతో ప్రభుత్వం ఏకీభవించింది. రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలల్లో కొన్ని డీమ్డ్ హోదా కల్పించాలని కోరుతూ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం.

## లోయలో పడి దగ్ధమైన కారు - ఇద్దరికి గాయాలు

**సంగం ( నెల్లూరు), ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** సంగం - కోరిమెర్ల రహదారిలో మలువు వద్ద కారు అదుపు తప్పి లోయలపడి మంటలు చెలరేగాయి.

కలిగిరి నుండి నెల్లూరు వెళుతున్న అదుపుతప్పి మలువు వద్ద కల్వర్టును ఢీకొని లోయలో పడి పోయింది. కారులో నలుగురు వ్యక్తులు ఉన్నారు.



కారులో మంటలు చెలరేగాయి. సమీపంలో ఉన్న కొందరు కారులో ఉన్న వారిని బయటకు తీశారు. ఇద్దరు వ్యక్తులకు మాత్రం తీవ్రగాయాలు అయ్యాయి.

వారిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయాలైన వారు నెల్లూరుకి చెందిన క్రాంతికుమార్,అజయ్,జష్వంత్ రేవంత్‌గా గుర్తించారు.సంఘటనా స్థలాన్ని సిఐ వేమారెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వార్త


రథం ఒకే చక్రంతో ఎలా నడవలేదో అలాగే కేవలం అదృష్టంతోనే పనులు నెరవేరవు. అదృష్టం, మానవ ప్రయత్నం ఈ రెండూ కార్యసాధన అనే రథానికి రెండు చక్రాలు.

న-డబ్ల్యు ఎమర్సన్

# కాగితాల్లోనే గిరిజన సంక్షేమం!

గిరిజన సంక్షేమం,అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తున్నామని, వేలాది కోట్లరూపాయలు వెచ్చి స్తున్నామని,ఒకపక్క నేతలు గొప్ప చెప్పుకుంటు న్నా మరొకపక్క కనీస వైద్యసదుపాయాలు లేక అర్థాకలితో అల్లాడుతున్న లక్షలాది మంది గిరిజన పుత్రుల బాధలు వర్ణనాతీతం. వైద్యసదుపాయం మాట అటుంచి కడుపునిండా తిండిలేక పౌష్టికాహారం లోపించి అనేక మంది గిరిపుత్రులు అంధులుగా మారుతున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. భావిభారత పౌరులు గా ఎదగాల్సిన వేలాది మంది మన్యం బాలలు రేచీకటి, గ్లాకోమా, కేటరాక్ట్, విటమిన్ ఏ లోపంతో అంధులుగా మారడమేకాక అనేక రోగాలబారిన పడుతున్నట్లు తెలుస్తు న్నది. అన్నిరోగాల మాట అటుంచి సర్వేంద్రియాల్లో కళ్లు అత్యంత ప్రధానమైనవి. అవే మూసుకుపోయిఅంధులుగా మారితే ఆ వ్యక్తితోపాటు ఆ కుటుంబం పరి స్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. స్వాతంత్ర్యం వచ్చిఏడున్నర దశాబ్దాలు దాటినా ఇంకా అవిద్య, అజ్ఞా నం, మూఢత్వం దారిద్ర్యం ప్రకృతితోపాటు తోటిమాన వుడు చేస్తున్న దోపిడీలకు గిరిజన ప్రాంతాలు అతలాకు తలం అవుతున్నాయి. గిరిజనులకు ప్రత్యేక ప్యాకేజీలం టూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న కోట్లాది నిధుల్లో నాలుగోవంతు కూడా వారి దరికి చేరడం లేద నేది కాదనలేని వాస్తవం.వారికోసం ప్రత్యేకంగా సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలు ఏర్పాటు (ఐటిడిఏ) చేసినా ఆశిం చిన ప్రయోజనాలు చేకూరడం లేదు. ఇప్పటికీ దేశంలో వేలాది గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. నడవడానికి కూడా సరైన బాటలు లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి.బస్సు ఎక్కని వారేకాదు కనీసం ఈనాటి వరకు బస్సు ను చూడనివారెందరో ఉన్నారు. ఈ మధ్య ఆంధ్ర ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గిరిజన గ్రామా లకు రోడ్లు వేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వయంగా ఆయా గిరిజన ప్రాంతాల్లో తిరుగుతూ వారి సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తూ అదే సమయంలో అన్నింటికంటే ముఖ్యంగా రోడ్లు వేయించే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ఇప్పటికీ వేలాదిగిరిజన గ్రామాల్లో కనీస ఆరోగ్యవసతి అటుంచి అది పొందేందుకు మైళ్ల దూరం కాలినడ కన పోవాల్సిన దురదృష్టపు పరిస్థితులు ఉన్నాయి. గర్భిణీ స్త్రీలను, ప్రాణాపాయంలో ఉన్న రోగు లను డోలె కట్టి కిలోమీటర్ల కొద్దీ మోసుకుపోవాల్సిన దురదృష్టపు పరిస్థితుల్లో గిరిజన గ్రామాలు కొట్టుమిట్టాడు తున్నాయి. వైద్యంవిషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారనే చెప్పొచ్చు. ఎండాకాలంలో నీరులేక ఎక్కడో చెలమల నుండో లేక రాళ్లమధ్యలో ఆగిఉన్న నీటిపైనే వారు ఆధారపడాల్సి వస్తున్నది. అందుకోసం మైళ్లకొద్దీ నడవాల్సిన పరిస్థితులు కూడా ఉన్నాయి. ఇక ఈ ఎండాకాలం పోయి వర్షాకాలం ఆరంభమయ్యే సమయం లో పాతనీరు, కొత్త నీరు కలయికతోపాటు వాతావరణం లో వచ్చే మార్పుల వల్ల మలేరియా, స్వైన్‌ఫ్లూ, డెంగ్యూ లాంటి వ్యాధులు విజృంభించడం, వందలాది మంది అసువులు బాయడం యేటా సర్వసాధారణమైపోతున్నది. ఎవరు అధికారంలో ఉన్నా గిరిజన సంక్షేమం గూర్చి చెప్తున్న మాటలకు, ఆచరణలో చేస్తున్న దానికి పొంతన లేకుండాపోతున్నది. ఇతర విషయాలు ఎలా ఉన్నా గిరి జనుల విషయంలో ప్రధానంగా రహదారి వైద్యం, విద్య విషయంలో నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం క్షమార్హంకాదు. వైద్యం, విద్య విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి కేటాయించిన నిధులు వారి సంక్షేమానికే అందేలా చూడ డంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. కోట్లాది రూపాయలు ఇతర ప్రాంతాల కార్యక్రమాలకు మరలించే కార్యక్రమం నిరాటంకంగా జరిగింది. దీనిని గుర్తించిన ఆనాటి పాలకులు 1970లో సాంఘిక సంక్షేమ శాఖ నుంచి విడదీసి ప్రత్యేకంగా గిరిజన సంక్షేమశాఖను ఏర్పాటుచేశారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొట్నాక భీంరావు తొలి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో బాధ్యతలు స్వీకరిం చారు. అప్పటి వరకు ఎంతో కాలంగా మూలనపడి ఉన్న హేమండర్ఫ్ నివేదికలోని సిఫారసును అమలు చేసేందు కు నడుం బిగించారు. ఆనాడే గిరిజన ప్రాంతాల అభి వృద్ధికి ఐటిడిఏల ఏర్పాట్లకు నాంది పలికింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిది ఐటిడిఏల ద్వారా ఆనాటి నుంచి వందలాది కోట్లు ఖర్చు పెడుతూనే ఉన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. భవనా లను నిర్మిస్తున్నారు. కానీ డాక్టర్లను కింది స్థాయి ఉద్యో గులను నియమిస్తున్నా వారిని అక్కడికి పంపి గిరిజను లకు అందుబాటులో ఉంచడంలో సఫలీకృతం కాలేక పోతున్నారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో గిరిజనులకు ప్రభుత్వ వైద్యశాలలపై నమ్మకాలు సన్నగిల్లిపోతున్నాయి. సరఫరా అవుతున్న మందుల్లో కూడా నాసిరకం ఉండ డంతో రోగాలు తగ్గక విశ్వాసంసన్నగిల్లి గిరిజనులు నాటు వైద్యం వైపు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికీ పసర్లు, వేర్లతో వచ్చీరాని వైద్యం చేసుకొని ఆరోగ్యాన్ని చెడగొట్టు కోవడమేకాక అసువులు బాస్తున్న గిరిజనులు ఎందరో ఉన్నారు. సోకింది ఏ జబ్బో తెలియక నాటు వైద్యుల మందులతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఈ వచ్చీరాని వైద్యం తీవ్రప్రభావం చూపుతు న్నది. ఓట్లకోసం ఎత్తులు, పైఎత్తులు, వ్యూహాలు, ప్రతి వ్యూహాలు వేయడం మాని త్రికరణశుద్ధిగా వారి అభ్యున్న తికి పాటుపడాలి. ప్రధానంగా విద్య, వైద్యం, రోడ్లువంటి కనీస సదుపాయాలను అందించాల్సిన బాధ్యత నేతలపై ఉంది. దీనిని విస్మరిస్తే చరిత్ర క్షమించదు.

మిక్కిలి ధనంగానీ, గొప్ప విద్య గానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.



అరిస్టాటిల్

శత్రువుల నుంచి కాపాడుకోవాలంటే వాళ్లని మిత్రులుగా మార్చుకోవడమే ఉత్తమమైన మార్గం.



స్వామి వివేకానంద


# సుప్రీం తీర్పు గవర్నర్లకు మార్గదర్శకం!

*ఈ జడ్జిమెంట్‌తో తమిళనాడు ప్రభుత్వానికి 12 మంది వైస్‌ఛాన్సలర్స్‌ను నియమించే అవకాశం కలిగింది. త్వరితగతిన ఆ బాధ్యత న్యాయ సమ్మతంగా పక్షపాతరహితంగా నిర్వహించినప్పుడే ప్రభుత్వానికి కష్టానికి తగ్గ ఫలితం దక్కినట్లవుతుంది. టాలెంట్‌తోపాటు అవినీతికి పాల్పడని విద్యాదక్షులకే ఈ పదవులు దక్కుతే అందరూ సంతోషిస్తారు. అయితే గవర్నర్ పదవిని శోభయామానంగా, గౌరవప్రదంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఆ పదవికి నియమించబడ్డ వ్యక్తికే ఉంటుంది. గవర్నర్ హితుడిగా, స్నేహితుడిగా, మార్గదర్శకుడిగా రాష్ట్రప్రభుత్వానికి ఉన్నప్పుడే ఫెడరల్ వ్యవస్థలో గవర్నర్ పదవికి నిజమైన స్థానం లభిస్తుంది. సుప్రీంకోర్టు తీర్పుపైన మారేలాంటి నిర్ణయం వచ్చినా ఈ మూలసూత్రాన్ని ఏ గవర్నర్ విస్మరించకూడనిదిగా ఈ తీర్పు నిలిచిపోతుందని విశ్వసించడటంలో తప్పులేదు.*



రావులపాటి సీతారాంరావు

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి రాష్ట్రాలలో అధికారం లేనట్లయితే గవర్నర్ల పాత్ర ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ప్రభుత్వాలకు ఇబ్బందికరంగా మారుతున్నది. చట్ట సభలలో ఆమోదించిన బిల్లులు, ఒక సారి గవర్నర్ తిప్పి పంపినా మళ్లీ ఆమోదింప చేసి పంపిన తర్వాత కూడా గవర్నర్ ఆఫీసులోనే ఉంచు కొని రాష్ట్రపతికి పంపటం సుప్రీం కోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. తమిళ నాడు గవర్నర్ ఆర్.యన్. రవి విషయంలో ఈ సందర్భం గా సుప్రీంకోర్టు జడ్జిమెంట్ వల్ల సెంటర్– సేట్ సంబంధాల మీద ప్రభావం ఎక్కువగానే ఉంటుందని భావించక తప్ప దు. ఫెడరల్ వ్యవస్థ మీద గణనీయమైన ఒత్తిడి ఫలితంగా సుప్రీం తీర్పు ఆ వ్యవస్థ సిద్ధాంతాలను కూడా ఈ తీర్పులో ఉటంకించక తప్పలేదు. సుప్రీం జడ్జిమెంటుపై కేంద్రం అప్పీలు కూడా చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. సుప్రీం కోర్టు తీర్పులో మూడు నెలల్లో ఆ బిల్లులను గవర్నర్ ఆమో దంతో తిరిగి రాకపోతే, అవి ఆమోదం పొందినట్లే అని స్పష్టంగా తేల్చిచెప్పింది. ఈ గడువును కేంద్రంలోని హోం శాఖ నిశితంగా పరిశీలిస్తున్నదని మీడియాలో వార్తలు వస్తు న్నాయి. కేంద్రం ఏదోవిధంగా గవర్నర్ అధికారాలను కాపా డేందుకు చర్యలు చేపట్టబోతున్నదని కొందరు అధికారుల భోగట్టా! తీర్పులోని లోపాలను కేంద్రం లోతుగా అధ్యయ నం చేస్తున్నది. అధికారులు ఒక అంశాన్ని పరిశీలనకు లేవ నెత్తారు. రాష్ట్రపతి కానీ గవర్నర్ కానీ ఒక బిల్లుకు అను మతి ఇవ్వకపోతే దాని గడువు ముగిసిపోయినట్లేనని విశ్లేషి స్తున్నారు. అయితే రాజ్యాంగంలోని 201లో ఈ నిర్దేశిత గడువు ప్రస్తావనలేదు. స్టాలిన్ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు రాగానే 10 బిల్లులకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి అసెంబ్లీ అధికారాలను చాటి చెప్పినట్లు విశ్లేషకులు న్యాయనిపుణులు భావిస్తున్నారు. కేరళ ప్రభుత్వం కూడా ఇలాంటి బిల్లులను చట్టాలుగా రూపొందింప చేసుకోవాలనే ప్రయత్నంలో ఉం దని వార్తలు వెలువడుతున్నాయి. ఈ విషయం సమగ్రంగా పరిశీలించిన తర్వాత ఒకఅంశం ప్రముఖంగా అందరి దృష్టి లోకి వచ్చింది. రాష్ట్ర శాసనసభలు ఆమోదించే బిల్లులపై రాష్ట్రపతి నిర్ణయం తీసుకోటానికి కాల పరిమితిని నిర్దిష్టంగా నిర్ధారించటం ఇదే మొదటిసారి. గవర్నర్లు బిల్లులను రాష్ట్ర పతికి పంపే విషయంలో ఆర్టికల్ 201 తీసుకోవాల్సిన చర్యలను గురించి వివరిస్తుంది. ఈ ఆర్టికల్ ఆ కాలపరిమి తిని ప్రస్తావించలేదు. ఈ సందర్భంగా కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ఒక చిత్రమైన వ్యాఖ్యను చేయడం గమ నార్హం. జడ్జీల వద్ద పెండింగ్ కేసులకు జాప్యం ఉన్నట్లే గవర్నర్ల వద్ద కూడా జాప్యానికి కారణాలుంటాయని చెప్పారు. అదికూడా ఆలోచించాల్సిన విషయమే కదా అని న్యాయకోవిదులు భావిస్తున్నారు. అయితే జస్టిస్ జె.పి పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పు ఒక విధంగా సెంటర్,స్టేట్ సంబంధాల విషయంలో స్పష్టత ఇచ్చినట్లయింది. ఫెడరల్ సూత్రాలు ప్రజాస్వామ్యాన్ని ఆచరించే దేశాలు విస్మరించకూడదన్న సూచన బలంగా వినిపించినట్లయింది. ఈ తీర్పుకు ఏవైనా అడ్డంకులు వచ్చి, తొలిగిపోతే పరిపాలనాపరంగా రాష్ట్రాలకు ముఖ్యంగా శాసనసభలు తీర్మానించిన బిల్లుల విషయాల్లో స్వతంత్రంగా వ్యవహరించే వెసులుబాటు




రాజ్యాంగం రాష్ట్రాలకు ఇచ్చిందన్న మూలసూత్రాన్ని తీర్పు బలపరిచినట్లయింది. గవర్నర్లు కూడా ఏ విధంగా వారి వారి రాజ్యాంగ విధులను నిర్వహించాలో తెలపటమే కాకుండా కొన్ని పరిమితులు అంతర్లీనంగా ఉన్నాయన్న రాజ్యాంగ సూత్రాన్ని నొక్కివక్కాణించినట్లయింది. బాధ్యతల నిర్వహణ పట్ల కూడా వారి స్పష్టతను ఎరుక పరిచిందని న్యాయనిపుణులు సంతోషపడుతున్నారు. గవర్నర్లకూ రాష్ట్రాలకూ, (ముఖ్యంగా కేంద్రంలో అధికారం లేకపోవటంతో) రాష్ట్రాలతో విభేదించి కేంద్ర ప్రభుత్వాన్ని అనుసరించి నడిచే గవర్నర్లకు వైస్‌ఛాన్సలర్ల ఎంపిక విషయం సమస్యల వలయంగా మారింది. వైస్ ఛాన్సలర్ల ఎంపిక నియామకాల అంశంలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర పరిమితంగా ఉందని నమ్మే గవర్నర్లు ముందు ముందు జాగ్రత్తగా వ్యవహరించక తప్పదేమో! గవర్నర్లు యూనివర్సిటీల ఛాన్సలర్స్‌గా వ్యవహరిస్తారు కాబట్టి ప్రతిసారీ ఈసమస్య ప్రభుత్వాలనూ గవర్నర్లను ఇబ్బంది పెట్టున్నది. ప్రభుత్వాలు ప్రజల చేతఎన్నుకోబడ్డవి. కేవలం టిట్యులర్ హెడ్‌గా ఉన్న గవర్నర్లకు ఈ అధికారం పూర్తిగా రాజ్యాంగం దఖలు చేయలేదనే వాదన రాష్ట్ర ప్రభుత్వాలది.సమస్యకు జవాబు దొరకక ఇరుపక్షలూ 'ఇగో'తో తలపడుతున్నాయి. ప్రజలకు జవాబు దొరకని ప్రశ్నగా మారిపోయింది. సుప్రీంకోర్టులో దీనికి సంబంధించిన బిల్లుల నిలుపుదలను తమిళనాడు ప్రభుత్వం ఛాలెంజి చేయడంతో ఈ తీర్పు రావటం గమనించదగ్గ విషయమయింది. తమిళనాడులో గవర్నరు బదులుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని వైస్‌ఛాన్సలర్స్‌ను నియమించే అధికారాన్ని ఇచ్చే బిల్లును రియడాప్ట్ చేసిన తర్వాత కూడా గవర్నర్ రవి వీటిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నిర్ణయం కోసం పంపటం వల్ల ఈ లిటిగేషన్ సుప్రీంకోర్టు దాకా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని వెళ్లాల్సి వచ్చింది. సుప్రీంకోర్టు, రాష్ట్రపతి అంగీకరించినట్లుగానే భావించాలి అని తీర్పు చెప్పటం కేంద్రానికి, రాష్ట్ర గవర్నర్‌కు శరాఘాతంలా తగిలింది. ఈ తీగడొంకను కదిల్చింది. గవర్నరు ఈ విధంగా చేయడాన్ని సుప్రీంకోర్టు తీర్పులో తప్పుపట్టింది. సుప్రీం ఈ తీర్పులో వాడిన పద జాలం దాదాపు టిట్యులర్ హెడ్స్ పనితీరును జల్లెడ పట్టినట్లుగా ఉంది. రవి గవర్నర్‌గా రాజీనామా చేయతగ్గ తీర్పు ఇది. సహజ వాతావరణంలో పనిచేయడం అటు కేంద్రంలోని పెద్దలూ, రాష్ట్రాలలోని గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడో వదిలిపెట్టారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మన దేశంలో ప్రభావితం చేసే విధంగా ప్రవేశం ఇవ్వలేదు కానీ ఈ తీర్పువల్ల ఆర్టిఫిషియల్ వాతావరణంలో కేవలం పదవిని ఆధారం చేసుకొని పాలన ప్రతి వ్యవస్థా చేస్తున్నదన్నది మాత్రం పూర్తిగా తేటతెల్లమయింది. కేంద్రం తనను గవర్నర్‌గా చేసింది కాబట్టి రవి డి.యం.కె ప్రభుత్వాన్ని ఇరుకులో పెట్టటానికే ఈ బిల్లుల తతంగం నడిపారని యన్.డి.ఏ కూటమి ప్రతి పనిని తప్పుపట్టే వారు అనుకుంటున్నా. సుప్రీంకోర్టు వెలిబుచ్చిన అభిప్రాయాలతో కో ఆపరేటివ్ ఫెడరలిజం సూత్రాన్ని నమ్మేవారు ఏకీభవిస్తున్నారు. కేవలం గవర్నర్ రవిని మాత్రమే సుప్రీంకోర్టు తప్పుపట్టిందని అనుకోవడానికి వీలులేదు. ఇలాంటి బిల్లుల విషయంలో గవర్నర్లు ఏ విధంగా వ్యవహరించాలో సుప్రీంకోర్టు నిర్దేశించిందనే భావించాలి. స్క్రూటినీ పేరుతో రోజుల తరబడి బిల్లులను గవర్నర్లు ఉంచుకోవటం తగదని సుప్రీంకోర్టు చెప్పకనే చెప్పింది. రాజ్‌భవన్లు పారదర్శకంగా జవాబుదారీగా వ్యవహరించాలన్న రాజ్యాంగ సూత్రాన్ని అత్యున్నత న్యాయస్థానం వెలుగులోకి తెచ్చింది. ఈ జడ్జిమెంట్‌తో తమిళనాడు ప్రభుత్వానికి 12 మంది వైస్‌ఛాన్సలర్స్‌ను నియమించే అవకాశం కలిగింది. త్వరితగతిన ఆ బాధ్యత న్యాయ సమ్మతంగా పక్షపాతరహితంగా నిర్వహించినప్పుడే ప్రభుత్వానికి కష్టానికి తగ్గఫలితం దక్కినట్లవుతుంది. టాలెంట్‌తోపాటు అవినీతికి పాల్పడని విద్యాదక్షులకే ఈ పదవులు దక్కుతే అందరూ సంతోషిస్తారు.అయితే గవర్నర్ పదవిని శోభయామానంగా,గౌరవప్రదంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఆ పదవికి నియమించబడ్డ వ్యక్తికే ఉంటుంది.గవర్నర్ హితుడిగా,స్నేహితుడిగా, మార్గదర్శకుడిగా రాష్ట్రప్రభుత్వానికి ఉన్నప్పుడే ఫెడరల్ వ్యవస్థలో గవర్నర్ పదవికి నిజమైన స్థానం లభిస్తుంది.సుప్రీంకోర్టు తీర్పుపైన మారేలాంటి నిర్ణయంవచ్చినా ఈ మూలసూత్రాన్ని ఏ గవర్నర్ విస్మరించకూడనిదిగా ఈ తీర్పు నిలిచిపోతుందని విశ్వసించడటంలో తప్పులేదు. ●

# వారసత్వ సంపదను కాపాడుకుందాం

బి.మధుపాళి

అంతర్జాతీయ మానవాళిని ఆకర్షిస్తున్న సహజ సిద్ధమైన లేదా మానవ నిర్మిత కట్టడాలు లేదా ప్రదేశాలను "వారసత్వ కట్టడాలు (హెరిటేజ్ స్ట్రక్చర్స్)" లేదా "స్మారక చిహ్నాలు (మాన్యుమెంట్స్)" లేదా" ప్రదేశాలు (సైట్స్)" అని పిలుస్తారు. అత్యంత పురాతన దేవాలయాల నుంచి అత్యద్భుత కట్టడాల వరకు అన్ని ప్రదేశాలు అనాదిగా మానవ నాగరికత చిహ్నాలుగా, గత వారసత్వ సంపద పునాదులుగా కొనసాగుతూనే ఉన్నాయి. వారసత్వ కట్టడాలు, ప్రదేశాలు మానవ సమాజ మానసిక ఆరోగ్య ప్రదాతలుగా, మానవాళి గత చరిత్రకు సాక్షాలుగా గంభీరంగా నిలబడి ఉన్నాయి. మన పునాదులను పటిష్టపరుచుకోవడం, వాటి భద్రతకు నడుం బిగించడం నేటి ఆలోచనాపరమైన మానవాళి కర్తవ్యం. మనం నివసిస్తున్న ప్రదేశానికి ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. వాటిలో పురాతన కట్టడాలు,గత వైభవం కలిగిన దేవాలయాలు, అద్భుత సహజ ప్రకృతి ప్రదేశాలు, మనం సగర్వంగా చెప్పుకునే వారసత్వ కట్టడాలుఉంటాయి. మన వారసత్వ కట్టడాలు, ఆకర్షణీయ స్థలాల మనుగడ నేడు ప్రశ్నార్థకంగా మారడం, విపత్తులు/సంక్షోభాల విష వలయంలో చిక్కి విధ్వంసానికి గురికావడం జరుగుతున్న వేళ, మన వారసత్వ నిర్మాణాలను కాపాడుకోవాలనే సదుద్దేశంతో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్" సంస్థ చొరవతో పాటు యునెస్కో సౌజన్యంతో ప్రతి ఏటా 18 ఏప్రిల్ రోజున ప్రపంచ దేశాలు అంతర్జాతీయ స్మారక చిహ్నాలు ప్రదేశాల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్)" లేదా ప్రపంచ వారసత్వ దినోత్సవం (వరల్డ్ హెరిటేజ్ డే)" పాటించుట 1983 నుంచి కొనసాగుతున్నది. వారసత్వ కట్టడాలు,ఇతర ప్రజాదరణ పొందిన కట్టడాలు తరతరాలుగా మానవాళి విజ్ఞానాన్ని, వినోదాన్ని, మానసిక ప్రశాంతతను, పర్యాటకాన్ని అందిస్తూనే ఉన్నాయి. వీటిని అపురూపంగా కాపాడుకో



వడం, వాటి పరిరక్షణకు అవసరమైన చర్యలను సత్వరమే తీసుకోవడం, మన సాంస్కృతిక వైభవ చిహ్నాలను సంరక్షించుకోవడం, వాటిని జాతీయ గుర్తింపు కలిగిన కట్టడా లుగా నిలబెట్టడం మన కనీస కర్తవ్యమని గమనించాలి. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ ఏర్పడి 60ఏండ్లు పూరితి అవుతున్న శుభగడియల్లో 2025 అంతర్జాతీయ స్మారక చిహ్నాలు ప్రదేశాల దినోత్సవ ఇతివృ త్తంగా విపత్తులు, సంక్షోభాలతో ప్రమాదంలో వారసత్వ కట్టడాలు 60 ఏండ్ల ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మాన్యు మెంట్స్ అండ్ సైట్స్ సంస్థ పకడ్బందీ కార్యాచరణ" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రకృతి సహజ విపత్తులు, మానవ సాయుధ సంక్షోభాలు, వాతావరణ ప్రతికూల మార్పులతో మన వారసత్వ కట్టడాల ఉనికిప్రమాదపు అంచున నిలుస్తున్నవేళ ప్రభుత్వాలు, సంస్థ లు, వృత్తి నిపుణల కళాకారులు, పౌర సమాజం, యువత చేయిచేయి కలిపి మన గత ఘనచరిత్రను కాపాడుకోవడం విధిగా జరగాలి. ప్రపంచవ్యాప్తంగా యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ సంపదలు 1,092 ఉన్నాయి. వీటిలో అత్యధికంగా 845 సాంస్కృతిక, 209సహజ,38 మిశ్రమ కట్టడాలు లేదా ప్రదేశాలున్నాయి. ప్రపంచ దేశాల్లో అత్యధిక వారసత్వ కట్టడాల్లో ఇటలీలో 54,చైనాలో53, స్పెయిన్‌లో 47,జర్మనీలో44, ఫ్రాన్స్‌లో 44, ఇండియాలో 43 ఉన్నాయి. 2024లో భారతంలో 43వ యునెస్కోగుర్తింపు పొందిన కట్టడంగా అస్సాంలోని మెయిడమ్ అహోం రాజవంపు కట్టడాల జాబితాలో చేరింది. మన దేశంలోని యునెస్కో గుర్తింపు పొందిన 43 కట్టడాల్లో ముఖ్యమైనవిగా అజంతా గుహలు, ఎల్లోరా గుహలు,ఆగ్రాకోట, తాజ్‌మహల్,కోణార్క్ సూర్య దేవాలయం, మహాబలిపురం, కాజిరంగా నేషనల్ పార్క్, ఖజురాహో స్మారక చిహ్నం, ఫతేపూర్ సిక్రీ,కుతుబ్ మినార్, ఢిల్లీఎర్రకోట,రామప్పదేవాలయం,శాంతినికేతన్‌లాంటివి ఉన్నాయి. మన పునాదులను కాపాడుకుంటూ, గత వైభవ చిహ్నాలనుంచి ప్రేరణ పొందుతూ,వాటి నుంచి విజ్ఞానాన్నిపొందుతూ, పర్యాటక ప్రదేశాలుగా తలచి మానసిక ప్రశాంతతను పొందుతూ బాధ్యతాయుతంగా కొనసాగుదాం.

# ప్రజావాక్కు



## గాయాలే తెలియని వైద్యులు ఉంటారా?

ఒక కేసు విచారణలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ గాయాలు ఎలా ఉంటాయో తనకు తెలియదని చెప్పడం చాలా విడ్డూరంగా ఉంది! గాయాలు ఎలాఉంటాయో తెలియకుండానే వైద్యురాలిగా ఎలా పట్టాపొందారు? ఎలా వైద్య సేవలు అందించారు? అసలు తెలియనప్పుడు అసలు గాయాలే లేవని సర్టిఫికెట్ ఎలాఇచ్చారు? తెలియకుండానే సంతకంపెట్టి ఎవరో సంతకం పెట్టమంటే పెట్టానుఅంటే చట్టం అంగీకరించదు కదా? అసలు ఆవిడ వైద్యురాలిగా కొనసాగడానికి అర్హత లేదని ఆవిడ చెప్పిన సమాధానాలు ధృవీకరిస్తున్నాయి. ఆవిడను వెంటనే ప్రభుత్వ సర్వీసు నుంచి తొలగించడమే కాకుండా వైద్యురాలిగా ఆవిడకు ఇచ్చిన పట్టా రద్దు చేయాలి! ఆవిడ ఇప్పటివరకు పొందిన వేతనం మొత్తం ప్రభుత్వం తిరిగి రాబట్టాలి.

-జి. రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

## నిపుణుల కమిటీ అవసరం

**తెలంగాణ** రాష్ట్రంలో రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల విషయంలో ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. ఏర్పడింది అనడం కంటె రాష్ట్రప్రభుత్వమే ఇలాంటిపరిస్థితిని సృష్టించింది అని చెప్పడమే సమంజసంగా ఉంటుంది. పదవీ విరమణ చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ బెనిఫిట్స్ ఇవ్వటం సంప్రదాయం. సిఎం రాష్ట్రం దివాలా తీసింది అన్నరీతిలో మాట్లాడుతూ ప్రభుత్వ ఖజానా నిల్ అని చెప్తున్నారు. ఆదాయ మంతా గతప్రభుత్వం చేసిన అప్పులకువడ్డీలు చెల్లించడానికే పోతోందని చెప్తున్నారు. రాష్ట్ర ఖజానా నిల్ అయితే ఉచిత పథకాలకు డబ్బులు ఎక్కడి నుండి వస్తున్నాయి.

-జి.అశోక్, గోదూరు, జగిత్యాలజిల్లా

## రైళ్ల సంఖ్యను పెంచాలి

**విజయవాడ** నుంచి గుంతకల్లు మార్గంలో పగటిపూట చాలా తక్కువసంఖ్యలో రైళ్లునడుస్తున్నాయి. ఈ మార్గంలో ఎక్కువ రైళ్లు నడపవలసిన అవసరం ఉంది. చాలా మంది తరచు తమ పనుల నిమిత్తం విజయవాడకు వెళుతూ ఉంటారు. కావున అధికరైళ్లు ఈమార్గంలో నడపాలి. అలాగే పగటిపూట విజయవాడ నుంచి గుంతకల్లుకు ఎక్కువ సంఖ్య రైళ్లు నడుపుటకు చర్యలు తీసుకోవాలి.

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

## లీవ్‌యాప్‌లో లోపాలు సరిచేయాలి

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రప్రభుత్వం విద్యాశాఖ ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు కొరకు లెర్నింగ్ ఎక్స్లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) పేరుతో కొత్తయాప్‌ను తీసుకొచ్చింది. గతప్రభుత్వం ఉపాధ్యాయులకు అనేక యాప్స్ ఇవ్వడం దానితో పెరిగిన పనిఒత్తిడిని తగ్గించాలని ఉపాధ్యాయ సంఘాలు అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించగా ప్రస్తుత ప్రభుత్వం అన్నీ యాప్స్ ఒకే దానిలో పనిచేసేలా చేస్తామని కొత్తగా లీవ్‌యాప్‌ను తీసుకొచ్చింది. అయితే ఎలాంటి మార్పులు చేయకుండా ఒకే యాప్‌లో అనేక రకాల యాపులు పెట్టినందున ఉపాధ్యాయులపై ఉన్న పని ఒత్తిడిఏమాత్రం తగ్గలేదు.ఉపాధ్యాయులు తమపై ఉన్న యాప్ల భారం తగ్గించమని కోరుతుంటే, ఉన్న యాప్లను ఒకే యాప్‌లో ఉంచి పెద్ద మార్పు చేశామని ప్రభుత్వం చెప్పడం ఎంత వరకు సబబు. లేటెస్ట్ వర్షన్ ఫోన్స్‌లో లీవ్‌యాప్ పనిచేయడం లేదని చెబుతున్నారు. కాబట్టి ప్రభుత్వం లీవ్ యాప్‌లో లోపాలు సవరించాలి. యాప్ అన్నీ మొబైల్స్‌లో పని చేసేలా చూడాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

## ఉపాధి హామీని కొనసాగించాలి

**ఉపాధి** హామీ పథకంలో భూమిఅభివృద్ధి కార్యక్రమాన్ని కొనసాగించాలి. ఈపనిని కొనసాగించడంవల్ల ఎక్కువ మందికి ఉపాధి హామీ పని దొరికే అవకాశం ఉంది. అంత మాత్రమే కాదు నిరూపయోగమైన భూమి సాగుయోగ్యముగా తయారు అవుతాయి. సాగు యోగ్యంగా తయారు అయిన తరువాత రైతులు భూమి లో పంటలు వేసుకుంటారు అటు తరవాత కూలీలకు కూడా పని దొరుకుతుంది. ఇంత బృహత్తరమైన పనిని చేయగలిగే పనుల జాబితా నుండి తీసివేయడం దుర్మార్గం.

-భారత అవినాష్, జనగామ

## ధారావాహికలను సెన్సార్ చేయాలి

**ప్రస్తుతం** టీ.వీల్లో అన్నిఛానల్స్‌లో ప్రసారమయ్యే ధారావాహికలలో ఎక్కువగా ఇతరులకు హాని కలిగించడం, వివాహేతర సంబంధాలు, తనకు కావాల్సింది దక్కించుకునేందుకు ఏమైనా చేయడం లాంటివి చూపిస్తున్నారు. కొన్నిసందర్భాల్లో హద్దులు మీరి అసభ్యకర దృశ్యాలు, అసభ్యకర దుస్తులు ధరిస్తున్న దృశ్యాలు ఎక్కువగా నేటియువతరంపై ప్రభావం పడవచ్చు. సినిమాలు మాదిరిగానే సెన్సార్ బోర్డు సర్టిఫికేట్ పొందిన తర్వాతే టీ.వీల్లో ధారావాహికలు ప్రసార్జయ్యేలా చర్యలు తీసుకోవాలి.

- డి. వెంకటరెడ్డి, బెంగుళూరు

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సర్వోదయ దార్శనికుడు 'ఆచార్య వినోబాభావే'



కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు.. మహా పురుషులవుతారు అని ఒక మహాకవి పలికిన మాటలు ఆచార్య వినోబా భావే విషయంలో అక్షర సత్యాలు. ఎందుకంటే ఒక మనిషి తన ధృఢమైన సంకల్పంతో ఉక్కు మనిషిగా మారి తనను తానే సైన్యంగా చేసుకుని, ఎన్నో గాయాలతో, రుగ్మతలతో ఉక్కిరిబిక్కిరవుతున్న భారతీయ సమాజాన్ని సంస్కరించి చక్కదిద్దే భాధ్యతను తన భుజాలకెత్తుకున్నాడు. సంక్రమించిన స్వాతంత్ర్యాన్ని, కొత్తగా ఏర్పాటైన రాజ్యాంగాన్ని, పరిపాలనా పరిస్థితులను ప్రజలు అప్పుడప్పుడే అర్థం చేసుకుంటున్న రోజులవి. మరో పక్క ఆంగ్లేయులు తమ స్వార్థం కోసం ప్రోత్సహించిన చిన్న చిన్న సామ్రాజ్యాలు, వాటిని ఏలుతున్న రాజులు ప్రభుత్వానికి, ప్రజలకి తలనొప్పిగా మారి ఉన్న అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా వినోబా భావే అడుగులు తడబడలేదు. తాను స్వీకరించిన దృడ సంకల్పం ముందు, తాను గురి పెట్టిన మహా లక్ష్యం ముందు ఇదేమి పెద్దవి కాదన్న విశ్వాసంతో "భూదాన్" అనే నినాదాన్ని పట్టుకుని, నిబ్బరంగా, నిరాడంబరంగా, ఒక్కడుగా సభ్య సమాజంలోకి తన అడుగులు ముందుకేశాడు ఆచార్య వినోబా భావే.. అదే భూదాన్ ఉద్యమానికి భారమైన. ఎంతో భాధ్యత కలిగిన మొట్ట మొదటి అడుగు. దక్షిణ భారత దేశంలోని మద్రాస్ రాష్ట్రంలో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతంలో ఉన్న ప్రత్యేకమైన పరిస్థితులను, వాటి తీవ్రతను తన సహచర ఉద్యమ స్ఫూర్తిపరులకు వివరించి, అప్పటికి జరగవలసిన జాతీయ సర్వోదయ 3వ వార్షిక సదస్సును ఈ ప్రాంతంలోనే నిర్వహించి అక్కడి ప్రజలందరికీ దేశ అంతరంగిక భద్రతలో కీలకమైన శాంతి, సామరస్య విధానాలను వివరించాలని నిర్ణయించారు. 1951, ఏప్రిల్ 9, 10, 11 తేదీలలో హైదరాబాద్ శివారులోని శివరాంపల్లిలో జాతీయ సర్వోదయ 3వ వార్షిక సదస్సు జరిగింది. ఈ సదస్సుకి దేశ నలు మూలల నుండి పలువురు ప్రముఖ గాంధేయ వాదులు, సర్వోదయ క్రియాశీలనాయకులు హాజరయ్యారు. ఈ సదస్సు చివరి రోజున తాను భారత దేశ వ్యాప్తంగా స్వచ్ఛంద భూదాన్ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు వినోబా భావే. అది కూడా ప్రజలు భూపోరాటానికి సిద్ధపడుతున్న తెలంగాణ ప్రాంతం నుండే... తొలి విడతగా శివరాంపల్లి నుండి మహారాష్ట్రలోని పౌనార్ వరకు తాను పాదయాత్ర చేస్తానని ఆయన ప్రకటించారు. దీనిలో భాగంగానే ఆచార్య వినోబా తన సహచరులతో కలిసి ఏప్రిల్ 15న శివరాంపల్లి నుండి పాదయాత్రగా కదిలి గ్రామ గ్రామాలను సందర్శిస్తూ ఏప్రిల్ 17 రాత్రి వరకు అప్పటి నల్గొండ జిల్లాలోని పోచంపల్లి అనే ఒక గ్రామానికి చేరుకున్నారు. ఆరాత్రి ఆయన అక్కడే బస చేసేందుకు గ్రామ నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆచార్య వినోబా భావే భావోద్వేగమైన ప్రసంగానికి మంత్ర ముగ్ధుడైన పోచంపల్లి జమీందార్ వెదిరే రామచంద్రారెడ్డి తక్షణమే స్పందించి, పోచంపల్లి గ్రామంలో భూమి లేని నిరుపేద కుటుంబాలకు పంచడానికి 100 ఎకరాలభూమిని దానంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆ దానం వెంటనే అమలులోకి వచ్చే విధముగా దాన పత్రాన్ని సిద్ధం చేసి వినోబా భావేకు అందించారు. ఇది భారత దేశంలోనే తొలి స్వచ్ఛంద భూదానంగా ప్రకటించబడింది. ఆయనను వినోబా భావే ఎంతగానో అభినందించి ఆ భూమిని తక్షణమే కుటుంబానికి 2 ఎకరాల చొప్పున అధికారుల సమక్షంలో ఆ గ్రామంలో భూమి లేని నిరుపేద కుటుంబాలకు అప్పగించారు. 2014 తరువాత ఈ రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా ఇప్పటి వరకూ భూదాన్ యజ్ఞ బోర్డులనిర్మాణం జరగలేదు. అయితే 2023లో మాత్రం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న అప్పటి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సర్వ సేవా సంఘ్ సిఫారసు లేకుండా తమ పార్టీకి చెందిన ఒక వ్యక్తిని కేవలం ఛైర్మన్‌గా భూదాన్ యజ్ఞ బోర్డును నియమిస్తున్నట్లుగా ప్రత్యేక గెజిట్‌ను తీసుకొచ్చింది. ఆతర్వాత న్యాయస్థానం జోక్యంతో అది రద్దయ్యింది. అయినా వాటిని దక్కించుకోవడానికి అనేక విధాలుగా దొడ్డి దారుల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. అసలు ఈ భూములకు పూర్తి సంరక్షణ బాధ్యత వహించాల్సిన ప్రభుత్వాలు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో వారి ఆగడాలకు అడ్డుకట్టలు లేకుండా పోతున్నాయి. కొంత శాతం భూములైతే ఇంకా దాతల వారసుల గుప్పిట్లోనే ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. సర్వ సేవా సంఘ్ భూదాన్ యజ్ఞ బోర్డు ద్వారా చట్ట ప్రకారంగా స్వచ్ఛందంగా ఎవరికైనా వితరణ చేయాలి, లేదా నిరుపేదల అవసరాల కోసం ప్రభుత్వం కోరితే సర్వ సేవా సంఘ్ అనుమతించాలి తప్ప 1965 "భూదాన్ – గ్రామదాన్" చట్టంలో మరే ఇతర మార్పులు చేయడానికి ఎలాంటి అవకాశం లేదు. ఇప్పటికైనా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ విషయాన్ని గుర్తించి, ఒక మహోన్నత ఆశయంతో, ధృడ సంకల్పంతో ఆచార్య వినోబా భావే యజ్ఞంగా భావించి కొనసాగించిన భూదాన్ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని, ఆయన గౌరవార్థం రెండు తెలుగు రాష్ట్రాలలో భూదాన్ యజ్ఞ బోర్డులు ఏర్పాటు చేసి ఇంకా మిగిలి ఉన్న భూములను నిరుపేద ప్రజలకు పంచేందుకు చట్ట ప్రకారం అన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- ఎన్. రాంబాబు నాయుడు
ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండలి అధ్యక్షుడు

# గుంటూరు వార్త

## రూ.1.15 లక్షలు ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే



**మాచర్లటౌన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని మసీదులకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు పట్టణంలోని 15 మసీదులకు విద్యుత్తు బకాయిలు ఉన్నాయని ఎమ్మెల్యే జూలకంటి దృష్టికి తీసుకురాగా తాను ఆర్థికసాయం చేస్తానని ప్రకటించారు. అందులో భాగంగా 15 మసీదులకు సంబంధించి రూ.1.15 లక్షల నగదును స్థానిక మర్కస్ మసీదులో ఆయా మసీదుల నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు, పలువురు ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.



ఆర్థికశాఖామంత్రి నిర్మల సీతారామన్‌తో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

# ఆ ఇసుక లారీలు ఎవరివి.?

- ట్రాక్టర్లతో డంపింగ్...లారీలతో తరలింపు
- కన్నెత్తి చూడని మైనింగ్, రెవిన్యూ, పోలీస్ యంత్రాంగం
- చోటా నాయకుల పనితీరుతో ఎమ్మెల్యేకి చెడ్డ పేరు
- అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ప్రజల కోరిక

**పెదకూరపాడు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న గ్రామాల్లో అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో ఇసుక లారీలు వెళ్తున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం ట్రాక్టర్ల సాయంతో డంపు చేసుకున్న ఇసుకను రాత్రులు లారీలకు లోడ్ చేయించి ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నారని స్థానిక ప్రజలు తెలిపారు. అచ్చంపేట మండలం నుంచి కొత్తపల్లి, కోగంటివారిపాలెం ప్రాంతాలలోని ఇసుక రీచ్ నుంచి రాత్రి వేళల్లో ఇసుక లారీలు తరలి వెళ్తున్నాయని స్థానికులు తెలిపారు. ట్రాక్టర్ ద్వారా సేకరించి ఇసుక చిగురుపాడు గ్రామం నుంచి డంపు చేసి అక్కడి నుంచి ఇసుకను లారీలకు ఎత్తి దూర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు అమ్ముతున్నారని స్థానిక ప్రజలు తెలిపారు. అమరావతి మండలంలోని మల్లాది, దిడుగు గ్రామాల నుంచి అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో ఇసుకను లారీలలో తరలిస్తున్నారని స్థానిక ప్రజలు తెలిపారు. రెవిన్యూ యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం, మైనింగ్ అధికారులు తెలిసి కూడా అటు వైపు కన్నెత్తి చూడలేదని స్థానిక ప్రజలు తెలిపారు. నదీ పరివాహ ప్రాంతంలో ఉన్న ఏ రీచ్ కి అనుమతులు లేవని నిపుణులు తెలిపారు. స్థానిక నేతల ఇష్టారాజ్యంగా ఎమ్మెల్యే అనుమతి లేకుండా రాత్రి వేళల్లో ఇసుక తరలిస్తున్నారని ప్రజలు తెలిపారు. ఇలా ఎమ్మెల్యే పేరు చెప్పుకొని ఇసుక తరలిస్తున్న వారిపై ఎమ్మెల్యే తగు చర్యలు తీసుకోవాలని లేకుంటే నియోజకవర్గంలో తనకున్న పేరు ఇలాంటి చోట నాయకుల వల్ల పోయే అవకాశాలు ఉన్నాయని కూటమి అభిమానులు, నాయకులు కోరారు. ఉచితంగా ఇచ్చే ఇసుకను అడ్డదారుల్లో డంపింగ్ చేసి లారీల్లో తరలించే వారిపై అధికారులు, ఎమ్మెల్యే తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని నియోజకవర్గ ప్రజలు కోరారు.







ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యాలు, ఇసుకను వాహనాలలోకి డంప్ చేస్తున్న దృశ్యం (ఫైల్ ఫోటోలు)

# ఫలించిన పెమ్మసాని కృషి

- పెమ్మసాని వినతులకు స్పందించిన కేంద్ర ఆర్థికశాఖ
- ఎయిమ్స్ హాస్పిటల్‌కు పోస్టులను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- 534 పోస్టులకు ఆదేశాలు జారీ

**గుంటూరు తూర్పు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** మంగళగిరిలోని ఎయిమ్స్ (ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్) హాస్పిటల్ అభివృద్ధి నిమిత్తం గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన కృషి ఫలించింది. ఎయిమ్స్ హాస్పిటల్ సామర్థ్యానికి తగ్గట్లుగా సిబ్బంది, ఉద్యోగులు, వైద్యులు అందుబాటులో ఉంటే ఖచ్చితంగా ఉన్నత స్థాయి సేవలు అందించగలుగుతుందనే ప్రయత్నంలో భాగంగా పెమ్మసాని చేసిన ప్రయత్నం సాకారం అయింది. ఈ క్రమంలో 960 పడకల ఎయిమ్స్ ఆసుపత్రికిగానూ అదనంగా 534 ప్రధాన ఉద్యోగాలను శాశ్వత ప్రాతిపదికన తీసుకోవాలని సూచిస్తూ కేంద్ర ఆర్థిక, ఖర్చుల శాఖ ఆదేశాలను గురువారం జారీ చేసింది. కాగా పీఎమ్ఎస్ఎస్‌వై-4 (ప్రధాన మంత్రి స్వస్త్య సురక్ష యోజన పథకం) కింద ఆ పోస్టులను ఏర్పాటు చేయడానికి కేంద్ర ఆరోగ్య, సంక్షేమశాఖ ఆమోదం తెలిపింది. వివరాల్లోకి వెళితే...గడిచిన ఫిబ్రవరి 28న ఎయిమ్స్ హాస్పిటల్‌లో సమస్యలు, ఇబ్బందులు తదితరాలపై పెమ్మసాని అక్కడి అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ క్రమంలో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతాసింగ్, సిబ్బంది, వైద్యుల కొరత అంశాన్ని పెమ్మసాని దృష్టికి తీసుకొచ్చారు. ప్రతిపాదనలపై సంబంధిత ఢిల్లీ కార్యాలయంలో సంప్రదించి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల అంశాన్ని పెమ్మసాని చొరవ తీసుకొని ముందుకు తీసుకెళ్ళారు. ఈ క్రమంలోనే గడిచిన ఏప్రియల్ 2 న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ని శాఖ కార్యాలయంలో పెమ్మసాని కలిసి ఎయిమ్స్ సమస్యలను వివరించారు. ఈ క్రమంలో ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం ఫైళ్ళలో కదలిక తీసుకు రావడంతో 960 పడకల సామర్థ్యమున్న ఎయిమ్స్ హాస్పిటల్ సామర్థ్యానికి సరిపడా 534 ఉద్యోగాలను మంజూరు చేశారు. అందులో ముఖ్యంగా అసోసియేట్ ప్రొఫెసర్-10, అసిస్టెంట్ ప్రొఫెసర్-10, సీనియర్ రెసిడెన్స్ -100, జూనియర్ రెసిడెన్స్ - 100, డిప్యూటీ నర్సింగ్ సూపరిండెంట్ -3, అసిస్టెంట్ నర్సింగ్ సూపరిండెంట్ -10, నర్సింగ్ ఆఫీసర్స్-100 తదితర 534 పోస్టులను మంజూరు చేస్తూ కేంద్ర ఆరోగ్య, సంక్షేమశాఖకు కేంద్ర ఆర్థిక, వ్యయాలశాఖ సూచించింది. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ మంగళగిరిలోని ఎయిమ్స్‌కు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిరంతర విద్యుత్ సరఫరా, మంచినీటి సరఫరా, అలాగే మరో 10 ఎకరాల భూకేటాయింపులను చేశారన్నారు. అలాగే నారా లోకేష్ నేతృత్వంలో ఆ హాస్పిటల్‌కు రెండు ఎలక్ట్రికల్ బస్సులను ఏర్పాటు చేశారని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు. ఆ ఇరువురి స్ఫూర్తితో తాను చేసిన ఈ ప్రయత్నానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ పోస్టుల నియామకాల అంశంలో సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు, కేంద్ర ఆరోగ్య, సంక్షేమశాఖ మంత్రి జే.పి.నడ్డా కి, విద్యా, ఐటీశాఖామంత్రి నారా లోకేష్‌లకు గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ పెమ్మసాని చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలియజేశారు.



## పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

**గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్17, ప్రభాతవార్త :** గుంటూరులోని శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ తెలిపారు. గురువారం బుడంపాడు, నగరాలు, గోరంట్ల తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యల పై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ గుంటూరు నగరంలో విలీనమైన గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన పట్ల ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇప్పటికే స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజల అభిప్రాయాల మేరకు సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేస్తున్నామన్నారు. కార్మికులను రేషనలైజేషన్ ద్వారా పారిశుధ్య పనుల మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాలో సమస్యలు, అంతరాలు గుర్తించామని ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జరీ చేశామన్నారు. అలాగే బుడంపాడులో గత పర్యటనలో ఆదేశించిన పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకొని, ఆయా పనుల్లో జాప్యంపై ఇంజనీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సిసి రోడ్ల డ్రైన్ నిర్మాణం అనంతరమే చేపట్టాలన్నారు. పర్యటనలో డిఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



## సీఆర్డీఏ పరిధిలో నిర్మాణాలపై కమిటీ సమావేశం

**గుంటూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** రాజధాని పరిధిలో భారీగా నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరగనున న్న దృష్ట్యా సంబంధిత శాఖాధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా ప్రత్యేక అధికారి, సీఆర్డీఏ కమీషనర్ కె.కన్నబాబు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మిని శంకరన్ హాల్లో జిల్లా ప్రత్యేక అధికారి కె.కన్నబాబు, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసి ఏ.భార్గవ్ తేజ, జిఎంసీ కమీషనర్ పులి శ్రీనివాసులతో కలసి సిఆర్డీఏ పరిధిలో నిర్మాణాలపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్ర పరిపాలన కొలువుదీరే సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు, ఇతర విభాగాల పనుల పున:ప్రారంభం కానున్న దృష్ట్యా అధికారులతో సమన్వయ కమిటి సమావేశం నిర వ్వహించడం జరిగిందన్నారు. సీఆర్డీఏ పరిధిలో చేపట్టనున్న నిర్మాణాలకు వచ్చే కార్మికులకు భద్రత ఏర్పాట్లు చేపట్టాలని, అసాంఘీక శక్తుల నుంచి కార్మికులకు రక్షణ కల్పించే విధంగా పోలీసు శాఖ అధికారుల చర్యలు చేపట్టాలన్నారు. రాజధాని పరిధిలోని పిహెచ్‌సి ని 30పడకల ఆస్పత్రిగా అప్‌డేట్ చేయడం జరిగిందని, కార్మికులకు వైద్యం చికిత్స అందించడం జరుగుతుందని జిల్లా వైద్యాధికారి కమీషనర్‌కు తెలిపారు. నిర్మాణ పనులకు కార్మికులు కుటుంబాలతో పనులకు వస్తారు కాబట్టి వారి కుటుంబాల్లో ని చదువుకునే పిల్లలను దగ్గరలోని స్కూల్స్‌లో, పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరి ్పంచాలని ఐసిడిఎస్ పిడి, డిఈవోకి సూచించారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ భవన నిర్మాణం జరిగే ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్మికులు అదిక సంఖ్యలో వస్తున్నందున లా అండ్ అర్డర్ చక్కగా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. నిర్మాణాలకు సంబంధించి అవసరమైన మెటీరియల్ అందేలా భూగర్భ శాఖాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎన్ఎస్‌కె ఖాజావలి, జెడ్పి సీఈవో జ్యోతిబసు, డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, డిఈవో సి.వి.రేణుక, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి, డిపివో నాగసాయి కుమార్, ఐసీడీఎస్ పిడి విజయలక్ష్మి, జిల్లా ఉ పాధి అధికారి దుర్గాభాయి, కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్ గాయత్రీదేవి, మైనింగ్ ఆర్ఐ లావణ్య, ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.



## కెఎల్‌యు లో ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులకు బహుమతుల పంపిణీ

**తాడేపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** కెఎల్‌యు లోని ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం జరిగినట్లు ఆ విబాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని మొదటి, రెండవ, మూడవ విద్యాసంవత్సరాలకు చెందిన విద్యార్థులకు పరిశోదనలపైన నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ పరిశోదనా పత్రాలను సమర్పించి, ప్రచురించిన వారిలో ప్రతి విద్యా సంవత్సరం నుండి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు విద్యార్థులను ఎంపిక చేసి సఫలత సమ్మేళన్-2025 అనే పేరుతో ఏర్పాటు చేసిన సదస్సులో బహుమతులను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి కాంటినెంటల్ కాఫీ ప్యాక్టరీ నుంచి ప్రొడక్షన్ హెడ్ డాక్టర్ జె.విజయశాంతి, ఆపరేషనల్ హెడ్ కె.విశ్వనాథ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. కార్య క్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొఫెసర్ విసీలు డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖర్‌రావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఎక్కడా చెత్త కనిపించరాదు

### - గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

**గుంటూరు తూర్పు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, పరిసరాలు అద్దంలా ఉండాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ సూచించారు. బుధవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్ వైజర్లతో ఎమ్మెల్యే నసీర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సిల్టు కుప్పలుగాని, చెత్త సమస్యలుగాని ఉండకూడదని స్పష్టం చేశారు. ఇంకా రెండు జేసీబీలు అవసరమని శానిటరీ ఆఫీసర్లు కోరగా, వీటిపై కమిషనర్ తో మాట్లాడతానని తెలిపారు. గ్రాస్ కటింగ్ మిషన్లు, సిల్ట్ వర్కర్స్ పనితీరు వంటి అంశాలపై వివరాలు సేకరించారు. షెడ్యూల్ ప్రకారం సిల్టు వర్కర్లతో పని చేయించాలని సూచించారు. 24/7 శానిటరీ ఆఫీసర్ లతో అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు .



## సోలార్ పవర్ ప్రాజెక్టులనిర్మాణాలకు అవసరమైన భూసేకరణ చేపట్టాలి : బాపట్ల జిల్లా కలెక్టరు



**బాపట్ల, ఏప్రిల్17, ప్రభాతవార్త:** సోలార్ పవర్ ప్రాజెక్టులనిర్మాణాలకు అవసరమైన భూసేకరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లో త్రాగునీటి సరఫరా, పరిశ్రమలకు భూసేకరణ, ఇసుక రవాణా, స్వచ్ఛ ఆంధ్ర, పరిశ్రమల స్థాపన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్టుల నిర్మాణాలకోసం చీరాల, రేపల్లె డివిజన్ ల్లో భూసేకరణ చేపట్టాలన్నారు. రుతుపవనాలు రాకముందు ప్రజలకు ఇసుక కొరత లేకుండా ముందస్తుగా లక్ష టన్నుల ఇసుకను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లా నుండి ఇతర రాష్ట్రాల కు ఇసుక అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్టులు, నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం గాజులంక 1 ఇసుక రీచ్ నుండి ఇసుక సరఫరా జరుగుతుందన్నారు. గాజులంక 2 ఇసుక రీచ్ త్వరలో ప్రారంభించడము జరుగుతుందన్నారు. జువ్వలదీన్నే ఇసుక రీచ్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏజెన్సీ ద్వారా త్వరలో ప్రారంభిస్తారన్నారు. జిల్లాలో త్రాగునీటి ఇబ్బందులు లేకుండా కృష్ణ పశ్చిమ కాలువల ద్వారా త్రాగునీటి ట్యాంకుల కు నీరు నింపు కోవాలని ఆయన అధికారులు ఆదేశించారు. బాపట్ల పట్టణానికి త్రాగునీరు అందించే రక్షిత మంచినీటి పథకానికి కృష్ణ పశ్చిమ కాలువ ద్వారా నీటిని నింపుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. జిల్లాలో జరిగిన ఎం.ఎస్.ఎం.ఇ సర్వే రివాల్యుడేషన్ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెన్షన్ల పంపిణీలో మూడుసార్లు ఫిర్యాదులు వచ్చిన సిబ్బందిని పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్, జిల్లా సరఫరాల శాఖ అధికారి విల్లీయమ్స్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్, రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎం వర్సిటీలో యూకే ఎడ్యుకేషన్ ఫెయిర్

### బ్రిటన్ వర్సిటీల ప్రతినిధులు హాజరు

**మంగళగిరి, ఏప్రిల్ 17. ప్రభాతవార్త :** అమరావతిలోని ఏపీ ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీలో బుధవారం యూకే ఎడ్యుకేషన్ ఫెయిరు నిర్వహించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మరియు అచీవర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ విద్యా ప్రదర్శనను వర్సిటీ ఆడిటోరియంలో ఏర్పాటు చేశారు. బ్రిటన్ కు చెందిన వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు, విద్యావంతులు ఫెయిర్ కు హాజరై విద్యార్థులకు పలు వివరాలను వెల్లడించారు. ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్, బర్మింగ్ హామ్ సిటీ యూనివర్సిటీ, మాంచెస్టర్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీల ప్రతినిధులు హాజరై విద్యార్థులకు విద్యా పరమైన అంశాలలో పలు సూచనలు చేశారు. ఆయా యూనివర్సిటీలలో అందు బాటులో ఉన్న కోర్సులు, ఫీజల వివరాలు, అక్కడ లభించే మసతులు, ప్రయాణ సదుపాయాలు, దనతి వివరాలను తెలియజేసి ఉన్నత విద్యావకాశాలను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో నేషనల్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అలూమ్ని యూనియన్ వ్యవస్థాపకులు డాక్టర్ పనమ్ ఆరోబా, యూకే పార్లమెంట్ మాజీ సభ్యులు వీరేంద్ర శర్మ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఇంటర్నేషనల్ నిటేషన్స్ డైరెక్టర్ లక్ష్మీనరసింహన్ తదితరులు పాల్గొన్నారు.



## కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే ప్రత్యేక గ్రీవెన్స్

**గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** నగర పాలక సంస్థలో పని చేసే కార్మికులు మరియు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెల ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యలపై నేరుగా తమకు అర్జీలు, ఫిర్యాదులు అందించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ అన్నారు. గురువారం నగర పాలక సంస్థ కార్మికులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారం కొరకు వర్కర్స్ గ్రీవెన్స్ ని కమిషనర్ ఛాంబర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విభాగాల వారీగా కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంకు ప్రతి నెల వర్కర్స్ గ్రీవెన్స్ నిర్వహిస్తామని, గ్రీవెన్స్ లో అందే ఆర్జీలను, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని విభాగాదిపతులకు స్పష్టం చేశారు. కార్మికులు కూడా తమకు అందే జీతాలు, ఇతర అలవెన్స్‌ల సమస్యలపై గ్రీవెన్స్ లో నేరుగా తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా, కార్మిక సంఘాల నాయకులూ ఈ.మధుబాబు, బి.ముత్యాలరావు, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొని అర్జీలు అందించారు.

వార్త VAARTHA CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

SITUATION VACANT

★ BLUEDART_Hiring for Delivery Boys & Girls. Income upto 25,000 pm. Eligibility:- #2 Wheeler Licence # Bike / Scooty. Call_ @ 8790655077.

(Ro.No.1979)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## వైభవంగా మాచర్ల శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

మాచర్ల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: మాచర్ల పట్టణంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవ తిరునాళ్ల సందర్భంగా ఆలయంలో కొలువుదీరిన స్వామివార్లను స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్నాడు ప్రజల ఆరాధ్య దైవం పాడి పంటలతో పల్నాడు సస్యశ్యామలంగా తులతూగాలని స్వామివారిని మొక్కుకున్నారు. అనంతరం స్వామివారి దర్శనానికి అశేషంగా తరలివస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆలయ అధికారులకు సూచించారు.

**వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్న బ్రహ్మానందరెడ్డి:** స్వామివారిని దర్శించుకుని తిరిగి వస్తున్న క్రమంలో ఆలయం గాలి గోపురం పక్కన వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. అక్కడున్న మందులను, వైద్య పరికరాలను పరిశీలించారు. షుగర్ ఎంత ఉందో ఒకసారి చూడమ్మ డాక్టరమ్మ అని అక్కడున్న సిబ్బందిని అడిగి, షుగర్, బీపీ పరీక్షలు చేయించుకున్నారు. బ్రహ్మానందరెడ్డి రక్తనమూనాలు సేకరించిన సిబ్బంది.. షుగర్ నార్మల్‌గా ఉందని పరీక్షించిన మిషన్ రిపోర్టును ఆయనకు చూపారు. అనంతరం బీపీని చెక్ చేసుకునాౖడు. దీంతో సంతృప్తి వ్యక్తం చేస్తూ.. అయితే షుగర్, బీపీ మిషన్లు బాగానే పనిచేస్తున్నాయన్న మాట అంటూ చమత్కరించేసరికి అక్కడున్న వారంతా నవ్వుకున్నారు.

**కూరగాయల మార్కెట్లో భారీ అన్నదానం**

పల్నాడు ప్రజల ఇలవేల్పు మాచర్ల చెన్నకేశవస్వామి తిరునాళ్ల సందర్భంగా పల్నాడు బ్రహ్మానాయుడు కూరగాయల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతియేటా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం అభినందనీయమని ఎమ్మెల్యే జూలకంటి కొనియాడారు. గురువారం స్థానిక కూరగాయల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. అనంతరం తిరునాళ్ల మహోత్సవానికి దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు అన్న ప్రసాదాలను వితరణ చేశారు. అన్నదాన కార్యక్రమానికి ముందుగా పార్కు సెంటర్లో ఉన్న పల్నాడు రాజ్యం మహామంత్రి పల్నాటి బ్రహ్మానాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే తనయుడు గౌతమ్‌రెడ్డి, తెదేపా యువ నాయకులు జూలకంటి అక్కిరెడ్డిలను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యూత్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్రి శివారెడ్డి, తెదేపా పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మాజీ కౌన్సిలర్ మద్దిగపు వెంకట్రామరెడ్డి, వజ్రానాయక్, పట్టణ తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రథోత్సవంతో పులకించిన మాచర్ల పురవీధులు**

కలియుగ బ్రహ్మాండ నాయకుడు మాచర్ల శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దివ్య రథోత్సవం గురువారం మాడవీధుల్లో నయనానందకరంగా సాగింది. రథసాల ముందు శ్రీదేవి, భూదేవి సమేతంగా రథంపై ఆశీనులైన శ్రీచెన్నకేశవ స్వామివారికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహిచారు. గుమ్మడికాయతో దిష్టి తీసి, రథాన్ని మాడవీధుల్లోకి స్వాగతించారు. ఈ సందర్భంగా రథోత్సవాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ శతాబ్దాలుగా జరుగుతున్న స్వామి వారి రథోత్సవ కార్యక్రమానికి తండోపతండాలుగా భక్తులు తరలివస్తుంటారనని, వారందరికీ స్వామి వారి దివ్యదర్శనం జరిగేలా రథంపై ఉన్న సిబ్బంది సహకరించాలని సూచించారు. రథంపై స్వామి వారి కైంకర్యాలు చేసే సిబ్బంది మాత్రమే ఉండాలని, తాను కూడా అందుకే రథంపై ఎక్కడం లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే జూలకంటి, ఆయన సతీమణి శోభారాణి, తనయుడు గౌతమ్‌రెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి, స్వామివారి రథం గొలుసులను పట్టుకొని జై చెన్నకేశవ అంటూ మాడవీధుల్లోకి స్వామివారిని తోడ్కొని వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో యెనుముల కేశవరెడ్డి, మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పీజీ కోర్సులపై విద్యార్థులకు అవగాహన

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** వర్సిటీ అందజేస్తున్న పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్సిటీ పిజీ ప్రవేశాల డైరెక్టర్ ఆచార్య పి.బ్రహ్మాజీరావు ఆధ్వర్యంలో అధ్యాపకులు ఆచార్య వి.తులసీదాస్‌ల బృందం గురువారం గుంటూరులోని టిజేపిఎస్ కళాశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్సిటీ అందిస్తున్న పోస్టు గ్రాడ్యుయేషన్ సైన్స్, ఆర్ట్స్,



మేనేజ్‌మెంట్, కామర్స్ కోర్సులతోపాటు ఏపి ఐసెట్ కోర్సులపై కూడా అవగాహన కల్పించారు. ఏపి పోస్టు గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ద్వారా విద్యార్థులకు పిజీ కోర్సులు ప్రవేశాలు కల్పించినున్నట్లు వివరించారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనంతరం కోర్సులకు తగ్గట్లు ఉపాధి అవకాశాలు, ఉద్యోగ అవకాశాలను విశ్వవిద్యాలయం అందిస్తున్న పలు వసతులను మౌలిక సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో టిజేపిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనితాదేవి సుమారు 300మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో అధునాతన వైద్యసేవలు

**-హిమోఫిలియాకు జీజీహెచ్‌లో అధునాతన వైద్యం**
**-రోగులు సద్వినియోగం చేసుకోవాలి**
**-గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరుతూర్పు, ఏప్రిల్17, ప్రభాతవార్త :** హిమోఫిలియా బాధితులకు గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో అధునాతన వైద్యసేవలు అందిస్తున్నామని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ సూచించారు.




ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా గురువారం గుంటూరులోని ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ యస్ యస్ వి రమణతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో పేద రోగుల కోసం కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో రోగుల కోసం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హిమోఫిలియా రోగులకు ప్రతి నెలా రూ.10 వేలు పింఛన్ అందిస్తున్నామని వెల్లడించారు. తద్వారా రోగులకు చేయూతగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఏడాది కాలంగా జీజీహెచ్ లో హిమోఫిలియా రోగులకు సత్వర సేవ



లందిస్తోన్న సుధీర్‌కు అభినందనలు తెలిపారు. జన్యుపరమైన వ్యాధులతో రక్తస్రావమయ్యే ఈ వ్యాధిపై అవగాహన కల్పించడం మంచి నిర్ణయమన్నారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో గతేడాది హిమోఫిలియాతో బాధపడుతున్న నాగ దుర్గ అనే మహిళకు రూ.1.30 కోట్లు వెచ్చించి వైద్యం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పి సమత, డాక్టర్ శైలజ, డాక్టర్ దేవకుమార్, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ వెంకారెడ్డి, డాక్టర్ మురళి, డాక్టర్ పోలయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

## 22న శ్రీపోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల

**యద్దనపాడు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మైదవోలు గ్రామంలో కొలువై ఉన్న గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి వార్షిక తిరునాల మహోత్సవం ఈ నెల 22వ తేదీ అంగరంగ వైభవంగా జరుగనున్నది. మంగళవారం తెల్లవారుజాము నుంచే అమ్మవారికి విశేష అలంకారాలతో ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఆలయం వద్ద పొంగళ్ళు, నైవేద్యాల సమర్పణతో పాటు పలు రకాల ప్రసాదాల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తిరునాల సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేపట్టామని, అవసరమైన సౌకర్యాలు సమకూరుస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు. అదేరోజు రాత్రి భారీ విద్యుత్ ప్రభలు తీసుకురానున్నారు. గ్రామ ప్రజలే కాకుండా సమీప ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో అత్యంత వైభవంగా జరిగే ఈ తిరునాళ్ళకు సంబంధించిన పనులను వేగవంతంగా చేస్తున్నట్లు తెలిపారు. కావున భక్తులు అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని గ్రామపెద్దలు కోరారు.



## గురుకుల విద్యార్థులకు పరిశుభ్రత, అలవాట్లుపై అవగాహన

**యద్దనపాడు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వంకాయలపాడు పంచాయితీ పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో గురువారం వ్యక్తిగత పరిశుభ్రత మరియు మంచి అలవాట్లపై అవగాహన కార్యక్రమాన్ని నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ వారు గురువారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా



విద్యార్థులకు పలు ప్రశ్నల ద్వారా వారు రోజువారీ తీసుకుంటున్న జాగ్రత్తలపై అడిగి తెల్సుకున్నారు. దానికి వారు సరిఅయిన సమాదానాలను అందజేయటం జరిగిందని, వారికి ప్రతి అంశంపై అవగాహన కలుజేసామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు నరేంద్ర సువర్ణకుమారి, ఉపాధ్యక్షులు వై ప్రసాదరావు, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలను అరికట్టాలి

నిజాంపట్నం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి



ఒక్కరిపై ఉందని ఐసిడిఎస్ పల్లపట్ల సిడిపిఓ అనసూయ అన్నారు. గురువారం బాల్యవివాహాల నిర్మూలనపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు జరుగుతుంటే వెంటనే 1098 నెంబర్‌కు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నాగలక్ష్మీ, ఎంఇఓ 1 శోభాచంద్, ఎంఇఓ 2 శేషుగోపాలం తదితరులు పాల్గొన్నారు.

## గంగా భగీరథ సగర సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**మంగళగిరి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** మంగళగిరి నగరంలోని వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం గురువారం ప్రారంభించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు హాజరై చలివేంద్రాన్ని



ప్రారంభించారుతొలుత పోతినేని శ్రీనివాసరావుకు సంఘం అధ్యక్షులు పండేటి సాంబశివరావు పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారుఅనంతరం పోతినేని శ్రీనివాసరావు రిబ్బన్ కట్ చేసి చలివేంద్రం ప్రారంభించి వాహనదారులకు, పాదచారులకు మజ్జిగ, చల్లటి మంచినీటితో పాటు పులిహోర, చక్కర పొంగలి పంపిణీ చేశారుఈ సందర్భంగా టిడిపి గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతునేని శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం తరపున సంఘం ప్రతినిధులు గత 20 సంవత్సరాల నుంచి మంగళగిరిలోని గౌతమ బుద్ధ రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారుల, పాదచారుల, ప్రజల సౌకర్యార్థం ముఖ్యంగా ఎండాకాలంలో ఫ్రిజ్ ఏర్పాటు చేసి, చల్లని మంచినీటిని ఉచితంగా అందించే విధంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. సంఘం వారు అందిస్తున్న పలు సేవా కార్యక్రమాలకు తమ వంతు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. సంఘం అధ్యక్షులు పండేటి సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభివృద్ధికి విశేషమైన కృషి చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ స్ఫూర్తితో గంగా భగీరథ సగర సంఘం ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక చింతనతో గత 20 సంవత్సరాలుగా మంగళగిరి శివాలయం, శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలోని స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు.. ప్రసాదాలు, ప్రతి నెలా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారుఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పండేటి సాంబశివరావు, నంగళం ప్రసాద్, కర్నాటి శివసత్యన్నారాయణ, కథారి విష్ణుమూర్తి, గండికోట రాజారావు, గండికోట వీరరాఘవులు, గండికోట అచ్చియ్య, పంచల శివన్నారాయణ, బేతపూడి మధుబాబు, నల్లమోలు నాగరాజు, దుంపల సోములు, నంద్యాల గోపాలం తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థినిని అభినందించిన కలెక్టర్

**నరసరావుపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** ఇండియన్ నేషనల్ టాలెంట్ ఒలింపియాడ్‌లో చైతన్య విద్యార్థులు మంచి ప్రతిభ చూపారు. గురువారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్




ఒలంపియాడ్‌లో 2024-25 పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థి ఆర్లగడ్డ కుశాల్‌ను సత్కరించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లా నుండి జాతీయస్థాయిలో జరిగే పోటీలకు హాజరై గ్రాండ్ ప్రైజ్ సాధించడం సంతోషమన్నారు. ల్యాప్‌ట్యాప్‌ను చిన్నారి కుశాల్‌కు బహుమతిగా అందించారు. భవిష్యత్తులోనూ పల్నాడు జిల్లాలో విద్యాభివృద్ధికి ప్రభుత్వపరంగా ప్రోత్సాహం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగూల్‌మీరా, ఉపాధ్యాయులు ఉన్నారు.

## బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అంబేద్కర్ కృషి ఎనలేనిది

**గుంటూరు విద్య, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కుట్రతోనే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను ఎన్నికల్లో రెండుసార్లు ఓడించిందని చంద్రమౌళి నగర్‌లోని బిజేపి కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి



ఉత్సవాల్లో భాగంగా రేపు రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరీ గుంటూరు రానున్నారని వెల్లడించారు. ఆయన కేవలం రాజ్యాంగ రచయిత మాత్రమే కాకుండా సామాజిక న్యాయం కోసం నిరంతరం శ్రమించిన శక్తివంతమైన వ్యక్తి అంబేద్కర్ అని పేర్కొన్నారు.

బిజేపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాండురంగ విఠల్ మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అంబేద్కర్ చేసినకృషి ఎనలేనిది, అంటరానితనాన్ని భారతదేశంలో రూపుమాపటానికి ఆయన చేసినకృషి మరువలేనిదన్నారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా విశిష్టమైన సేవలు అందించారన్నారు. రెండు సంవత్సరాల 11నెలల 18రోజుల పాటు శ్రమించి భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో ఆయన పట్టుదల కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆశలను దేశ ప్రధాని మోడీ నాయకత్వంలో నెరవేరుస్తున్నారని తెలిపారు. మహనీయుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు బిజేపి అధికార పూర్వకంగా నిర్వహిస్తున్న నేపధ్యంలో బిజేపి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌పార్టీ భారత రాజ్యాంగ నిర్మాతను ఎన్నో ఇబ్బందులకు గురిచేసిందని పాండురంగ విఠల్ వెల్లడించారు. అంబేద్కర్ 134వ జయంతి పక్షోత్సవాలు బిజేపి ఆధ్వర్యంలో గొట్టిపాటి కళ్యాణ మంటపంలో 18వ తేది సాయంత్రం 4గంటలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి బిజేపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరీ, ముఖ్యనేతలు రానున్నారని, మేధావులు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారని, ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పాండురంగ విఠల్ విజ్ఞప్తి చేశారు.

బిజేపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేద్కర్ మాట్లాడుతూ సొంతలాభం కోసం కాంగ్రెస్ పార్టీ ఎక్కువసార్లు రాజ్యాంగాన్ని సవరించిందని విమర్శించారు. భారతీయ జనతాపార్టీ 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం దేశ హితం కోసం ప్రజల సంక్షేమం కోసం రాజ్యాంగాన్ని 26సార్లు మాత్రమే సవరించిందని, అందులో ముఖ్యంగా ఆర్టికల్ 370ని రద్దుచేయడం పౌరసత్వ సవరణ చట్టం లాంటివి ముఖ్యంగా చెప్పుకోవచ్చన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు వైవి సుబ్బారావు, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ-వ్యర్థాల వల్ల ప్రజల ఆరోగ్యానికి నష్టం : డాక్టర్ రవీంద్ర

**రేపల్లె(నిజాంపట్నం), ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** ఈ- వ్యర్థాల వల్ల పర్యావరణానికి నష్టం సంభవించి తద్వారా ప్రజల ఆరోగ్యానికి హాని



జరుగుతుందని డాక్టర్ రవీంద్ర అన్నారు. స్థానిక ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎలక్ట్రానిక్ వ్యర్థాలు-నిర్వహణ అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ విషపూరిత పదార్థాలు మానవుల శరీరంలోకి ప్రవేశించి ఊపిరితిత్తుల వ్యాధులు, కీళ్ళనొప్పులు, సంతానసాఫల్యత సమస్యలు వస్తాయన్నారు. స్వచ్ఛఆంధ్ర -స్వర్ణఆంధ్ర కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం దాను మాట్లాడుతూ ఈ వ్యర్థాలను రీ సైక్లింగ్‌ద్వారా ఉపయోగకరమైన పదార్థాలను తిరిగి పొందవచ్చన్నారు. సదస్సుకు ప్రిన్సిపాల్ టిసి రవిచంద్ర అధ్యక్షత వహించగా, డాక్టర్ ఎం బుజ్జిబాబు, కె బాలగురవయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

**ఈ వ్యర్థాలను మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలి:** ఎలక్ట్రానిక్ వ్యర్థాలైన కంప్యూటర్లు, మానిటర్లు, ప్రింటర్లు పారవేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందజేస్తే రీ యూజ్, రీసైకిల్ చేయటానికి అవకాశం ఉంటుందని మున్సిపల్ కమీషనర్ కె సాంబశివరావు అన్నారు. గురువారం ఈ వ్యర్థాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

## విత్తన షాపుల్లో అధికారుల తనిఖీలు

**నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** పట్టణంలోని పలు విత్తన దుకాణాలలో వ్యవసాయశాఖ అధికారులు, గుంటూరు కమిషనర్, అగ్రికల్చర్ డైరెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలను నిర్వహించారు. అధికారులు ఆర్.శశిధర్‌రెడ్డి, బి.ఎన్.సురేసన్‌లతో పాటు ఏడిఏ మస్తానమ్మ తనిఖీలలో పాల్గొన్నారు. పట్టణంలోని విత్తన దుకాణాలలో తనిఖీలను నిర్వహించి హెచ్‌టి పత్తి విత్తనాల అమ్మకాలకు రాష్ట్రంలో అనుమతులు లేవన్నారు. అటువంటి విత్తనాలు అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



చట్టరీత్యా నేరమని తెలియజేశారు. పట్టణంలో డీలర్ల వద్ద హెచ్‌టి విత్తనాలు లేవని గుర్తించామన్నారు. రైతులకు తప్పనిసరిగా విత్తన కొనుగోళ్ళకు సంబంధించి రశీదు ఇవ్వాలన్నారు. డిస్ట్రిబ్యూటర్ వద్ద నుండి మాత్రమే విత్తనాలు తీసుకోవాలని, లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద కొనుగోలు చేస్తే సమస్యలు తక్కువగా ఉంటాయని అధికారులు తెలియజేశారు. తనిఖీలలో మండల వ్యవసాయ అధికారి బి.నరేంద్రబాబు, ఏఈవో బ్రహ్మయ్య పాల్గొన్నారు.

## ప్రాణాపాయ స్థితిలోఉన్న వ్యక్తిని కాపాడిన పాతగుంటూరు సిఐ సోమయ్య

**గుంటూరు విద్య, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** ప్రాణాపాయ స్థితిలోఉన్న వ్యక్తిని పాతగుంటూరు పోలీస్టేషన్ సిఐ సోమయ్య కాపాడిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. సుద్దపల్లి డొంకలోని శాంతినగర్‌కు చెందిన ఒక వ్యక్తి వివిధ కారణాలతో ఇశ్రాయేలు పేట మణిపురం బ్రిడ్జి కింద బుధవారం



రాత్రి 11గంటల ప్రాంతంలో ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే అంశంలో ఒంటిపై పెట్రోలు పోసుకున్నాడు. సంఘటనను గమనించిన స్థానికులు స్పందించి పాతగుంటూరు సిఐ సోమయ్యకు సమాచారం అందించారు. సోమయ్య సమాచారం అందుకున్న వెంటనే తన సిబ్బందతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. వెంటనే అంబులెన్స్ కి ఫోన్‌చేయించి అంబులేన్స్‌లో గాయపడ్డ ఆ వ్యక్తిని తీసుకొని ప్రభుత్వాసుపత్రిలో జాయిన్ చేయించారు. ఆ వ్యక్తి వివరాలు కనుక్కొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రాధమికంగా మందుల అవసరాన్ని గుర్తించి సీఐ సోమయ్య కొంత ఆర్థిక సహాయాన్ని అందించి త్వరితగతిన వైద్యం అందే అంశంలో చొరవ చూపారు. తక్షణం వైద్యసేవలు అందించడంతో వైద్యులు ఆ వ్యక్తికి ప్రాణాపాయం లేదని చెప్పడంతో సిఐ సోమయ్య ఊపిరి పీల్చుకున్నారు. వ్యక్తి ప్రాణాలు కాపాడడంలో సిఐ చూపిన మానవతా దృక్పధానికి ఇశ్రాయేలుపేట యూత్ ప్రశంసల జల్లు కురిపించింది. స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ సిఐ సోమయ్యను ప్రత్యేకంగా అభినందించారు. కాకి గుండెకు కరుకుతనమే కాదు, చల్లని మనస్సున్న మంచి హృదయం కూడా ఉంటుందని సీఐ సోమయ్య విషయంలో నిజమైంది. మానవతా దృక్పదంతో వ్యక్తి ప్రాణాలు కాపాడడం నిజంగా ఆయన వ్యక్తిత్వానికి మరొక నిదర్శనం అని స్థానికులు అభినందన వెల్లువ కురిపించారు.

## నాటుసారా నిర్మూలనకు సిబ్బంది కృషి చేయాలి

**- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్**

**నిజాంపట్నం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** నాటుసారా వల్ల కలిగే దుష్పలితాలను ప్రజలకు వివరించి నాటుసారా తాగకుండా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క సిబ్బందిపై ఉందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమీషనర్ ఎం సుధాకరరెడ్డి అన్నారు. గురువారం నగరం శాఖ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేయకుండా ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయం, కలిగి ఉన్నవారిపై చట్టపర చర్యలు తీసుకోవాలన్నారు. సారా నిర్మూలన కార్యక్రమం



సఫలీకరణ చేసే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. నవోదయం 2 కార్యక్రమంపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీరాంప్రసాద్, ఎస్ఐ విజయలక్ష్మీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమతుల ఆహారంతో ఆరోగ్యం పదిలం

**కొల్లూరు, ఏప్రియల్ 17 (ప్రభాతవార్త) :** గర్భిణీలు, బాలింతలు సమతుల ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని అమృతలూరు ప్రాజెక్టు ఐసిడిఎస్ అధికారిని గన్నవరం విజయలక్ష్మీ అన్నారు. బుధవారం దోనేపూడి ఆలపాటి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ఫజరున్నీసా ఆధ్వర్యంలో జరిగిన



పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమంలో విజయలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భంతో ఉన్న స్త్రీ ఆరోగ్యపరమైన పోషకాహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం యొక్క ప్రాథమిక సూత్రాలు, పండ్లు కూరగాయలు, చిరు ధాన్యాలు పుష్కలంగా తీసుకోవాలన్నారు. ఆరోగ్యపరమైన పోషకాహారం తీసుకోవడం వలన గర్భవతులు దృఢంగా ఉంటారన్నారు. అదే విధంగా గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీ వైద్యశాలలో అంగన్‌వాడీ కేంద్రాల్లో వారి పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. గర్భిణీలు ప్రతిరోజు పాలు, ఆకుకూరలు తప్పకుండా తీసుకోవాలన్నారు. పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. భావితర పౌరులను ఏర్పరిచే బాధ్యత తల్లులదే అన్నారు. గర్భిణీలు ఎప్పుడైతే మంచిగా మంచి ఆహారం తీసుకుంటారో పిల్లలు బలంగా పుడతారని, మెదుడు పెరుగుదల ఉంటుందని, అప్పుడే తెలివైన పిల్లలు కలుగుతారన్నారు. ముందుగా పోషకాహార విలువలపై గ్రామాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో స్టాల్స్‌ని ఏర్పరచి తల్లులకు చూపించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఫజరున్నీసా, కార్యకర్తలు రాజ్యలక్ష్మీ, విజయలక్ష్మీ, సౌభాగ్యలక్ష్మీ, శారద, భాగ్యమ్మ, రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## నాటక రంగానికి విశేష సేవలందిస్తున్న సోమేష్

**నిజాంపట్నం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** నాటక రంగంలో విశేష సేవలందిస్తున్న సోమేష్‌ను కందుకూరి వీరేశలింగం విశిష్ట పురస్కారానికి ఎంపిక కావటం అభినందనీయమని తెదెపా నియోజకవర్గ అధ్యక్షుడు



కొలసాని రాము అన్నారు. గురువారం మండలంలోని బొర్రావారిపాలెంలో కూటమి నాయకులు సోమేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా నాటకరంగానికి విశేష సేవలందించి అనేక అవార్డులు పొందిన ఘనత సోమేష్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య, జనసేన మండల నాయకుడు మైలా నరేష్‌యాదవ్, కేసన సోమయ్య తదితరులున్నారు.

## వర్క్‌షాప్ బ్రోచర్ ఆవిష్కరణ

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం నిర్వహించబోతున్న రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ బ్రోచర్‌ను ఇన్‌చార్జ్ విసి ఆచార్య కంచర్ల గంగాధరరావు, ఇన్‌చార్జ్ రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలా మణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ జి.సింహాచలం, కళాశాల ప్రిన్సిపాల్ పి.సిద్దయ్య, ఇంజనీరింగ్ అధ్యాపకులతో కలసి ఆవిష్కరించారు. అన్ మెన్డ్ వెహికల్స్ అండ్ ఇట్స్ అడ్వాన్స్డ్ అండ్ అప్లికేషన్స్ అనే అంశం మీద ఈనెల 22,23 తేదీల్లో వర్క్‌షాప్ కన్వీనర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండి. తౌసిఫ్ అహ్మద్,



కార్యదర్శి డాక్టర్ సిహెచ్ తిరుమలరావు తెలిపారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ యుజిసి స్పాన్సర్స్ ప్రోగ్రామ్ అని రోసోర్స్ పర్సన్స్‌ని వివిధ రంగాల్లో నిష్ణాతులను పిలుస్తున్నారని, విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు ఈ వర్క్‌షాప్స్‌ని వినియోగించుకోవాలని కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ వి.చంద్రమౌళి, మెకానికల్ కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రశేఖర్, డాక్టర్ ఆర్.విజయ్ ప్రకాష్, డాక్టర్ కె.శ్రీదేవి, పి.నరేంద్రమోహన్, బి.విజయ్‌కుమార్, టెక్నిషియన్స్ కెఆర్‌ఎస్ రామారావు కె.సురేష్, ఎల్.సాంబశివరావు, కోడూరు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాకు అంతరాయం

**నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** పురపాలక సంఘ పరిధిలో త్రాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పట్టణం లోని పల్నాడురోడ్డులో ఎస్ఎస్ఎన్ కళాశాల వద్ద ప్రధాన పైపులైన్‌పై లీక్ ఏర్పడటంతో అధికారులు మరమ్మత్తు పనులు చేపట్టారు. మున్సిపల్ డి.ఈ. రఫీ ఆధ్వర్యంలో మరమ్మత్తు పనులు నిర్వహిస్తున్నారు. నీటి సరఫరా సిబ్బంది జేసిబి సహాయంతో పైపులైన్ లీకేజీని గుర్తించారు. సాధ్యమైనంత వేగంగా పనులు పూర్తి చేసి నీటి సరఫరాను అందించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ డి.ఈ. రఫీ తెలియజేశారు. శుక్రవారం ఉదయం నుండి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. శనివారం ఉదయం యధావిధిగా నీటిని సరఫరా జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

## ప్రకృతి వ్యవసాయం ప్రతి ఒక్కరైతు తప్పనిసరిగా చేయాలి

**పెదకూరపాడు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** పెదకూరపాడు మండలం ఆర్ ఎస్ కె లో మండలస్థాయి వ్యవసాయశాఖ, అనుబంధశాఖలు, సెర్ప్ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయశాఖలతో గురువారం మండల లెవెల్ కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా వ్యవసాయశాఖ ఎమ్ఏఓ శాంతి హాజరై మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ పంటకు ముందు ప్రతి ఒక్క రైతు తన పొలంలో పిఎండీస్ (నవధాన్య విత్తనాలు) చల్లాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా చీడ పీడల్ని నివారించడం జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా అదనపు మేనేజర్ ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ ప్రీమాన్ సూన్ డ్రై సొయింగ్



వేయడం వలన నేల గుళ్ళబారుతుందన్నారు. నీటిని నిలువ చేసుకొనే శక్తి పెరుగుతుందన్నారు. నీటి ఎద్దడిని తట్టుకో గల్గుగుతుందన్నారు. ప్రధాన పంట ఖర్చు సైతం తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. ఏపిఎం సునీత మాట్లాడుతూ ప్రతి యానిమేటర్ తన పరిధిలోని స్వయం సహాయక సంఘాల్లో గల ప్రతి రైతును ప్రకృతి వ్యవసాయం వైపు తీసుకెళ్ళాలని, ప్రతి ఒక్కరూ కిచెన్ గార్డెన్ ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవడం వల్ల వాటిలో విషపూరితమైన రసాయన పురుగు మందులు అధికంగా ఉన్నందువలన భయంకరమైన క్యాన్సర్, గుండె జబ్బు, రక్తహీనత వస్తుందని తెలియజేశారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు.

## డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఘన నివాళులు

**రాజుపాలెం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** రాజుపాలెం మండలంలోని కొండమోడు - పిడుగురాళ్ళ - కె.యన్.ఆర్.విద్యాసంస్థలునందు గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కళాశాల డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్‌రావులు రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా



వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహనీయుడు, విద్యారంగం అభివృద్ధికి కృషి చేసిన దార్శనికుడు, దేశ మొదటి ఉప రాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి భారత రత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సాధినేని నరసింహారావు, మోటమర్రి సోమశేఖర్, విద్యార్థినీ విద్యార్థులు డాక్టర్ రాధాకృష్ణన్ కి ఘనంగా నివాళులర్పించారు.

## బాదంతో కార్డియో మెటబాలిక్ ఆరోగ్యం

**విజయవాడ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** ప్రపంచంలోని ప్రముఖ ఆరోగ్య పోషకాహార నిపుణులు ప్రతిరోజు బాదం తినడం కార్డియో మెటబాలిక్ ఆరోగ్యానికి అర్థవంతమైన ప్రయోజనాలు అందిస్తుందని 11 మంది శాస్త్రవేత్తలు వైద్యులు పరిశోధనలు చేయడంతో పాటు బాదం ప్రయోజనాలపై ఏకాభిప్రాయానికి వచ్చి గట్ మైక్రోబయామ్‌కు మేలు జరుగుతుందని కొద్దిపాటి బరువు తగ్గడంలో సహాయకారి అని తేల్చారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం స్థానిక పార్టీ



కార్యాలయంలో 9 మంది లబ్ధిదారులకు మంజూరైన ఆటోలను, నగదు చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో తొమ్మిది మందికి దీని ద్వారా లబ్ధి చేకూర్చడం సంతోషమన్నారు. కేంద్రం అందిస్తున్న ఈ పథకంలో 50 శాతం సబ్సిడీని పొందవచ్చున్నారు. పదిశాతం లబ్ధిదారులు పెట్టుకోవాల్సి ఉంటుందన్నారు. 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం రుణ రూపంలో అందిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు చేయూతనివ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా చిన్నచిన్న వ్యాపారాలకు ఎంతో ఉపయోగమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బ్యాంక్ మేనేజర్లు, లబ్ధిదారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వైభవంగా షిర్డిసాయి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**రెంటచింతల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** మండలంలోని పాలువాయి జంక్షన్లో గల షిరిడీసాయి ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. సాయి దివ్య పూజా కార్యక్రమాల్లో ముందుగా పుష్పగిరి పీఠాధిపతులు విద్యాన్ సింహభారతి స్వామి వారిచే ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అర్చకులు జిగురు వెంకటలక్ష్మి నరసింహ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. సాయినాథుని కీర్తిస్తూ సాయి



భక్తులచే సంకీర్తనలు ఆలపించారు. ఆలయ అర్చకులు గోపాలపాండే వే భక్తులకు తీర్థప్రసాదాల వితరణ, దాతల సహకారంతో అన్నదానం చేపట్టారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో మంగళవారం తోరణాలు కట్టి, విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పరిసర గ్రామాల నుంచి సాయి భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తుల సాయి సంకీర్తనలు, స్మరణలతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

# సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు చేసిన మహిళ అరెస్టు

**గురజాల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** సోషల్ మీడియాలో అనుచిత పోస్టులపై మంగళగిరికి చెందిన పాలేటి కృష్ణవేణిని దాచేపల్లి పోలీసులు బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు. వెంకయ్యాయుడు ఇంటికి కృష్ణ మాదిగ భోజనానికి వెళ్లిన సమయంలో అనుచిత పోస్టు చేసిన కృష్ణవేణిపై టీడీపీ నేత దుర్గారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హైదరాబాద్లో ఉన్న కృష్ణవేణిని దాచేపల్లి పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్కు తరలించారు. గురువారం వైద్య పరీక్షల నిమిత్తం గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. అనంతరం గురజాల కోర్టుకు తరలించారు.

**కూటమి ప్రభుత్వంలో చిత్ర విచిత్రాలు: మాజీ ఎమ్మెల్యే కాసు**

కూటమి ప్రభుత్వం, దాచేపల్లి పోలీసులు చిత్ర విచిత్రాలు చేస్తున్నారని గురజాల మాజీ శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కృష్ణవేణిని హైదరాబాద్లో అరెస్ట్ చేశారని, ఎందుకు అరెస్ట్ చేశారని వైసీపీ నేతలు, కార్యకర్తలు దాచేపల్లి పోలీస్‌స్టేషన్కు వెళ్లగా పోలీస్‌స్టేషన్కు తలుపులు వేశారన్నారు. పల్నాడు ప్రాంతంలో చిత్ర విచిత్రాలు చూస్తున్నామన్నారు. ఎక్కడైనా ముద్దాయికి బేడీలు వేసి పోలీస్‌స్టేషన్కు తీసుకెళ్లడం చూశాం.. శిక్షపడినప్పుడు బేడీలు వేయడం చూశాం.. పోలీసులే వాళ్ల పోలీస్‌స్టేషన్కు బేడీలు వేయడం బహుశా చరిత్రలో మొదటి సారిగా వింటున్నాం, చూస్తున్నామని, ఇంతకన్నా సిగ్గుచేటు ప్రభుత్వానికి ఏమైనా ఉంటుందా అని ప్రశ్నించారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, పోలీస్‌స్టేషన్ సీఐకి భవిష్యత్తులో అవార్డులు, రివార్డులు ఇవ్వాలని చమత్కరించారు.



# స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన సీఎంఓ

**పొన్నూరు, ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థినీ విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం సీఎంఓ డి.అనీల్ తెలిపారు. ఈ పథకం ద్వారా ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, బ్యాగ్, షూ, బెల్ట్, నోటు పుస్తకాలు, నిఘంటువులు ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటికి సంబంధించిన వస్తువులను భద్రపరిచేందుకు నిడుబ్రోలు జిల్లా



పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్‌నే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ స్టాక్ పాయింట్‌కు జిల్లా నుంచి మెటీరియల్‌ను తరలిస్తారన్నారు. ఇక్కడ నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు కేటాయించిన విధంగా వీటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ స్టాక్ పాయింట్ సక్రమంగా ఉంటుందా..? ఉండదా..? అనే విషయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు జె.శివలక్ష్మి, సిఆర్పీ దేవరపల్లి దాసు తదితరులున్నారు.

# ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**సత్తెనపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** సత్తెనపల్లి గ్రామీణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో లక్ష్మి చెన్నకేశవస్వామి 9వ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుండే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఆలయంతో పాటు దేవతామూర్తులను అలంకరించారు. పోలీస్‌స్టేషన్ ప్రతి నిత్యం వివిధ రకాల ఘర్షణలు, కేసులతో ఉంటుందన్నారు. అయితే నేరాలతో వచ్చేవారు కొంతవరికైనా ఆధ్యాత్మికత కలిగి ఉండాలని కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతి రోజూ పూజా కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలియజేశారు.



# వెంకటస్వామి కుటుంబాన్ని పరామర్శించిన కొమ్మాలపాటి

**అమరావతి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** మండలంలోని ఎండ్రాయి గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి నందూరి వెంకటస్వామి రాజు ఇటీవల కనుమూశారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న టిడిపి జిల్లా ఇన్‌ఛార్జి కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఆయన నివాసానికి వెళ్ళి వారి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

## -మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు

**పొన్నూరు, ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** అన్ని వసతులతో సిద్ధంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు కోరారు. చేబ్రోలు మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామంలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఈ ఏడాది సుద్దపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్పు చేయడం జరిగిందన్నారు. పదవ తరగతి వరకు ఇక్కడే విద్యను అభ్యసించవచ్చన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో విశాలమైన భవనాలను పిల్లల కోసం నిర్మించి నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. ప్రతి పిల్లవానికి




ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూ తదితరాలను అందజేస్తుందన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన జరిగే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలు మక్కువ చూపాలన్నారు. అనంతరం గ్రామంలో బడి బాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఏసుబాబు, షమీమున్నీసాబేగం, షేక్ కరీముల్లా, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్గీకరణపై తెదేపా నాయకులు హర్షం

**సత్తెనపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** రాష్ట్ర క్యాబినెట్ ఎస్సీ వర్గీకరణపై ఆమోదం తెలపడం పట్ల టిడిపి ఎస్సీ సెల్ నాయకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు ప్రత్యేక



కార్యక్రమాన్ని కార్యాలయంలో ఏర్పాటు చేశారు. బాబు జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంగారు నాగరాజు అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ మాదిగలకు తెలుగుదేశంపార్టీ ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. రిజర్వేషన్ ఆర్డినెన్స్‌ను ఇవ్వడం సంతోషమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఎప్పుడూ రుణపడి ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.నరసింహారావు, బొజ్జా కాంతారావు, వర్ల శ్రీను, సుశీల, చంటి, డానియేల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# అగ్నిమాపక వారోత్సవాలు

**సత్తెనపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** అగ్నిమాపక వారోత్సవాలను గురువారం పట్టణంలో నిర్వహించారు. అగ్నిమాపకశాఖ అధికారి ఎం.వి.సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భవిష్య పాఠశాల నందు



విద్యార్థులకు వివిధ అంశాలను తెలియజేశారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, ఫైర్ మెన్ శ్రీనివాసరావు, డ్రైవర్ సి.హెచ్.సాగర్‌బాబు, మోహన్‌బాబు, నాగేశ్వరరావు, బాజ్జీ పాల్గొన్నారు.

# పౌష్టికాహారం తయారీపై దృష్టి పెట్టాలి

## -అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ హరిణి

**పొన్నూరు, ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తయారీపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ డి.హరిణి సూచించారు. గురువారం యానాది కాలనీలో జరిగిన



పౌష్టికాహారంపై జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం స్వీకరిస్తే రోగాల బారి నుంచి బయట పడవచ్చన్నారు.రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని స్వీకరించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారాన్ని ఏ విధంగా తయారు చేసుకోవచ్చునో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో వి.సువార్త కుమారి, ఎఎన్ఎం ఎస్.రత్నకుమారి, ఆశావర్కర్, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రములను సందర్శించిన సిడిపిఓ

**తెనాలి, ఏఫ్రియల్ 17 (ప్రభాతవార్త) :** 7వ పౌష్టికాహార పక్షోత్సవములో భాగంగా సిడిపిఓ డాక్టర్ ఎం.సునీత, తేలప్రోలు గ్రామంలో ఉన్న నాలుగు అంగన్‌వాడీ కేంద్రములను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహార లోపంతో ఉన్న పిల్లలకు ఎతు_, బరువులు తీసి వారి తల్లిదండ్రులతో పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చేటువంటి ఆహారంతో పాటు అదనంగా ఇంటి వద్ద తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్నటువంటి పోషకాహారము ఇవ్వవలసిన ప్రాముఖ్యత గురించి వివరించారు. అదే విధంగా పోషకాహార లోపంతో ఉన్న పిల్లలు సాధారణ స్థాయికి వచ్చే వరకు అంగన్‌వాడీ కార్యకర్త గృహ సందర్శన ద్వారా పిల్లలకు ఫాల్‌అప్ చేస్తూ పర్యవేక్షించవలసిన బాధ్యత ఉందని, అవసరమైనచో వైద్య పరీక్షల కొరకు ఆరోగ్య కేంద్రమునకు పంపవలసిన ఆవశ్యకత గురించి సిడిపిఓ వివరించారు. కార్యక్రమంలో సెకాటర్ సూపర్‌వైజర్ వై.యానాదమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



# ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి : బాపట్ల జిల్లా కలెక్టరు

**బాపట్ల,ఏప్రిల్17,ప్రభాతవార్త:** పరిశ్రమల స్థాపనకు అన్ని వనరులు, అనుమతులు సమకూర్చాలని,ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. పరిశ్రమల ప్రోత్సాహక జిల్లాస్థాయి కమిటీ సమావేశం గురువారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలతో ఉత్పాదకత, ఉపాధి అవకాశాలు, ఆదాయ వనరులు పెరుగుతాయన్నారు. పరిశ్రమలు స్థాపించడానికి ముందుకువచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలన్నారు. అవసరమైన వనరులు సమకూర్చడం, అనుమతులకు సహకరించాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన పలు సూచనలు చేశారు. పరిశ్రమల స్థాపనకు ఇటీవల



సింగిల్ డెస్క్ విధానంలో 189 దరఖాస్తులురాగా, అందులో 171 దరఖాస్తులు అనుమతులు పొందాయన్నారు. పి ఎం ఈ జిపి పథకం కింద 56 యూనిట్లు స్థాపించాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. రూ.1.53 కోట్ల నిధులతో యూనిట్ల స్థాపన లక్ష్యం కాగా 65 యూనిట్లను ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు.లక్ష్యానికి మించి రుణాలు ఇచ్చామని, రూ.2.13 కోట్ల నిధులు వెచ్చించినట్లు తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకానికి జిల్లా నుంచి 38 వేల 446 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించిన తదుపరి అందులో 4,765 దరఖాస్తులను కేంద్రానికి పంపామన్నారు. 2,916 దరఖాస్తులకు అనుమతులు లభించాయన్నారు. గతంలో పరిశ్రమల స్థాపించి మనుగడ సాగిస్తున్న 41 మంది లబ్ధిదారులకు వివిధ పథకాల కింద రూ.3.0 కోట్ల నిధులు రాయితీ కల్పించాలని ప్రతిపాదిస్తూ జిల్లా కలెక్టర్ ఆమోద ముద్ర వేశారన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, కమిటీ కన్వీనర్ జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వై రామకృష్ణ, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఫ్యాప్సి కార్యదర్శి భక్తవత్సలం, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించడమే సంస్థ ధ్యేయం

## -విద్యుత్తు వినియోగదారుల అదాలత్ అధ్యక్షులు ఎన్.విక్టర్ ఇమ్మానియేలు

**పొన్నూరు, ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు ఎంతగానో దోహదపడుతుందని అదాలత్ అధ్యక్షులు ఎన్.విక్టర్ ఇమ్మానియేలు అన్నారు. స్థానిక జీబిసి రోడ్డులోని గోవాడ చౌదరి ఫంక్షన్ హాలులో గురువారం జరిగిన అదాలత్‌లో



ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక-విజయవాడ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల అలసత్వం, లోపాలు, వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీటీఆర్ఎఫ్ 2016లో స్థాపించడం జరిగిందన్నార. రాష్ట్ర విభజన జరిగాక 2020లో విజయవాడలోని గుణదల నుంచి ఈ సంస్థ అదాలత్ కార్యక్రమాలను నిర్వహిస్తూ వినియోగదారుల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తూ ముందుకు సాగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడమే అదాలత్ ముఖ్య ఉద్దేశమన్నారు. నూతన మీటర్లు అమర్చడం, బిల్లుల్లో వస్తున్న తేడాలు, లోవోల్టేజి సమస్యలు, తదితర అనేక విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రం మొత్తం మీద మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోనే సమస్యల పరిష్కారం వేగవంతంగా ఉందన్నారు. వచ్చిన సమస్యలను వచ్చినట్లుగా తమ పరిధిలోవి అక్కడిక్కడే పరిష్కరిస్తూ, తమ పరిధి దాటిన వాటిని సంబంధిత విద్యుత్ పంపిణీ సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్తూ పరిష్కరిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు కూడా అదాలత్ సభ్యులకు సహకరిస్తే మరిన్ని సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు వారికి సంబంధించిన పరిష్కారం కానటువంటి సమస్యలను వ్రాతపూర్వకంగా ఫిర్యాదు ద్వారా తెలియజేయాలన్నారు. ప్రస్తుతం జరిగిన అదాలత్‌లో విద్యుత్ స్థంబాలు, అడిషనల్ లోడు, లోఓల్టేజి సమస్య, బిల్లులల్లో వ్యత్యాసాలు వంటివి వచ్చాయన్నారు. అదాలత్ పరిధిలో వాటిని తక్షణమే పరిష్కరించడం జరిగిందన్నారు. అదాలత్‌లో 15అర్జీలు వచ్చాయని, వాటిలో 10 సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించామన్నారు. అదాలత్ కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు ఎస్. శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు ఆర్‌సిహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు ఎ.సునీత, జి.ఆంజనేయులు, స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదవాడి సొంతింటి కల నెరవేరాలి

## -సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ

**పొన్నూరు, ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** పేదవాడి సొంతింటి కల నెరవేరాలని, అందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక




తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సిపిఐ ఆధ్వర్యంలో అర్జీలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు స్థలాలు కేటాయించాలన్నారు. అదేవిధంగా ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్థలంతోపాటు నాలుగు లక్షలు ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఇటీవల జరిగిన మంత్రి వర్గంలో జీవో జారీ చేసిందన్నారు. జారీ చేసిన జీవో ప్రకారం అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు కోరుతూ అర్జీలను ఇవ్వడం జరిగిందన్నారు. పేదవాడి కోసం ఎర్రజెండా పోరాడుతూనే ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా భూమిలేని నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు, రైతులకు సాగుభూములు పంచిపెట్టిన ఘనత సిపిఐకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ శ్రీనివాస్, ఎల్లమ్మ, శారద, మదీనా, షకీల, యశోద, సారమ్మ, పద్మావతి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కోన ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదు : తెదేపా నాయకులు

**బాపట్ల,ఏప్రిల్17,ప్రభాతవార్త:** మైకు చేతిలో ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కావూరి శ్రీనివాసరెడ్డి మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతిని హెచ్చరించారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల




నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పై విమర్శిలు చేయడం మానుకొని మీ పార్టీకి దూరమైన ఓటర్లను దగ్గర చేసుకునేందుకు ప్రయత్నించి పార్టీని బలోపేతం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.దేశం కోసం అసువులు బాసిన జస్వంత్ రెడ్డి విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేయనీయకుండా అడ్డుకున్న ఘనత మీకే దక్కుతుందని అన్నారు. రెడ్డి సామాజిక వర్గాన్ని నియోజకవర్గంలో అణచివేయడానికి పాల్పడింది మీరు కాదా అని ప్రశ్నించారు. బాపట్ల మండలం ఓసి అయితే ఎస్టీ చేయించింది మీరు కాదా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ విజయం కోసం 9 సంవత్సరాలు కష్టపడి పని చేశారని అటువంటి వ్యక్తికి ప్రజలు పట్టం కట్టారని ఈ విజయం కూటమి విజయమని అన్నారు. ఓడిపోయ నామని ఈర్షతో ఏదేదో మాట్లాడితే కుదరదని అన్నారు. మైక్ ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే చప్పట్లు వస్తున్నాయని అనుకుంటే సరికాదని తమ వద్ద కూడా మాట్లాడే వక్తలు ఉన్నారన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని పేర్కొన్నారు. ఎండిఓ కార్యాలయాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే కూలదోసి ఇప్పటివరకు కూడా నిర్మించలేదన్న విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పై ఆరోపణలు చేయడం మానుకోవాలని ప్రెస్మీట్ పెట్టీ మాట్లాడటం కార్యకర్తలతో మాట్లాడించడం చేస్తే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తానికొండ దయా బాబు,బడుగు నాగభూషణం, పసుమర్తి యలమంద, శీలం శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## స్కోడా ఆటో సిల్వర్ జుబ్లీ వేడుకలు

**విజయవాడ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** తాము 25 సంవత్సరాల చరిత్ర సిల్వర్ జుబ్లీ వేడుకలు జరుపుతున్నామని స్కోడా ఆటో ఇండియా ప్రతినిధులు వెల్లడించారు. మార్చి 2025 లో 7,422 యూనిట్ల అమ్మకాలు సాధించామన్నారు. రణవీర్‌సింగ్ మొదటి బ్రాండ్ అంబాసిడర్‌గా ఈ విజయానికి సహకరించారన్నారు.

# ప్రమాదాల నివారణకు అవగాహనే ముఖ్యం

## -అగ్నిమాపకశాఖాధికారి ప్రసాదరావు

**పొన్నూరు, ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** ప్రమాదాల నివారణలో అవగాహనే ముఖ్యమని అగ్నిమాపకశాఖాధికారి కె.ప్రసాదరావు సూచించారు. స్థానిక శ్రీ వేద



హైస్కూల్‌లో అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అతి జాగ్రత్త వల్ల, అజాగ్రత్త వల్ల జరిగే అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులకు డెమో ద్వారా ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా స్పందించాలి....ప్రమాదాలను ఏ విధంగా నివారించాలన్న విషయాలపై తర్ఫీదు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వేద హైస్కూల్ డైరెక్టర్ అంబటి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ అంబటి ఏడుకొండలు తదితరులున్నారు.

# శేషారావును ఆదర్శంగా తీసుకోవాలి

**పెదకూరపాడు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** రాష్ట్ర అభ్యుదయ రైతు అవార్డు గ్రహీత దర్శి శేషారావును ప్రకృతి వ్యవసాయంలో రైతులందరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అదనపు మేనేజర్ ప్రేమ్ రాజ్ కోరారు. గురువారం పెదకూరపాడులోని రైతు సేవా కేంద్రంలో మండలస్థాయి వ్యవసాయ శాఖ,



అనుబంధశాఖలు, సెర్ప్ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయశాఖలతో మండలం లెవెల్ కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ప్రకృతి వ్యవసాయంలో గత నాలుగు సంవత్సరాలు పైబడి నవధాన్య సాగు చేసి ఉత్తమ ఫలితాలు సాధించిన రాష్ట్ర అభివృద్ధి అవార్డు గ్రహీత దర్శి శేషారావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి శాంతి, ఏపీఎం సునీత, మండల సిసిలు శ్రీనివాసరావు, ప్రసాద్, మండల సమైక్య అధ్యక్షురాలు శివ రంజని, విఓఏలు, విఏఏలు, జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వైపీ స్వాతి, ఎన్ఎఫ్ఏ నందకుమార్, బి.అప్పలరాజు, డివిజన్ మాస్టర్ ట్రైనర్ మధుబాబు, యూనిట్ ఇన్‌ఛార్జి అమూల్య పాల్గొన్నారు.

# విద్యార్థులకు అగ్నిమాపక నివారణ పద్ధతులపై అవగాహన

**బాపట్ల,ఏప్రిల్17,ప్రభాతవార్త:** అగ్నిప్రమాదం జరిగినప్పుడు విద్యార్థులు సమయస్ఫూర్తితో ఆలోచించి వాటి బారిన పడకుండా ఎలా జాగ్రత్త పడాలో విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని అగ్నిమాపక కేంద్రం అధికారి వై వెంకటేశ్వరరావు



అన్నారు.గురువారం జాతీయ అగ్నిమాపక వారోత్సవాల లో భాగంగా పట్టణంలోని పబ్లిక్ స్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్‌లో జరిగే అగ్నిప్రమాదాలు,పాఠశాల యాజమాన్యంకు అగ్నిప్రమాదా నివారణ పద్ధతులపై అవగాహన కల్పించామన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వాటర్ డేమో చూపించి వాటి నివారణ పద్ధతులను వివరించామన్నారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాసక సిబ్బంది,విద్యార్థులు,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# రెంటచింతల నూతన తహాశీల్దారుగా మేరీకనకం

**రెంటచింతల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** రెంటచింతల మండలం నూతన తహాశీల్దారుగా మేరీ కనకంను నియమిస్తూ జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు నియామక ఆదేశాలు జారీ చేశారు. ఆమె గురువారం కార్యాలయంలో



బాధ్యతలు చేపట్టారు. గతంలో మిట్టగుడిపాడు వీఆర్వోగా, ఆ తర్వాత మండల డిప్యూటీ తహాశీల్దారుగా ఇక్కడ పనిచేసిన మేరీకనకం ప్రస్తుతం గురజాల ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. నిబద్ధతతో, నిజాయితీగా ఇక్కడ విధులు నిర్వర్తించిన ఆమె నియామకం పట్ల పలువురు రాజకీయ ప్రతినిధులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తహాశీల్దారుగా బాధ్యతలు చేపట్టిన ఆమెను రెవెన్యూ సిబ్బంది. పలువురు నేతలు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

# రైతుల వెన్ను విరిచిన దుర్మార్గ పాలకుడు జగన్ : ఎమ్మెల్యే జూలకంటి

**దుర్గి (మాచర్ల), ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** అయిదేళ్ల వైకాపా పాలనలో అన్నివిధాలుగా రైతుల వెన్ను విరిచిన దుర్మార్గ పాలకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దుయ్యబట్టారు. గురువారం నియోజకవర్గ



పరిధిలోని దుర్గి ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని, రైతులకు పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని కూల్చి, రైతాంగాన్ని దగా చేసి హరితంధ్రను ఎడారిగా మార్చారని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సున్న వడ్డీతో రుణాలకు మంగళం పాడి, ధరల స్థిరీకరణ, ప్రకృతి విపత్తులకు నిధులు కేటాయించకుండా రైతులను దారుణంగా మోసం చేశాడని ధ్వజమెత్తారు. 2014-2019 వరకు తెదేపా హయాంలో హార్టికల్చర్, సెరి కల్చర్, ఆక్వా కల్చర్ వంటి వ్యవసాయ అనుబధ రంగాలన్నీ ఘననీయంగా వృద్ధిని పుంజుకున్నాయని చెప్పారు. జగన్‌రెడ్డి గద్దెనెక్కిన తర్వాత వాటిని గాలికొదిలేసి రైతులను సర్వనాశనం చేశారన్నారు. వెలిగొండ, పోలవరం వంటి బహుళార్థక సాధక ప్రాజెక్టులన్నింటినీ అటకెక్కించి చోద్యం చూశారని విమర్శించారు. తొడలు కొట్టి, మీసాలు దువ్విన ఇరిగేషన్ శాఖ మాజీ మంత్రి అనిల్ కుమార్ ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో తెలియని పరిస్థితి అని ఎద్దేవ చేశారు. పల్నాడు రైతులు సంప్రదాయ వ్యవసాయానికి స్వస్థి చెప్పి, సెరీకల్చర్, హార్టికల్చర్ రంగాలవైపు మొగ్గు చూపాలని ఎమ్మెల్యే జూలకంటి కోరారు. ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేసేలా వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఒకదానిని పైలట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేసి, నియోజకవర్గ రైతాంగానికి అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. పత్తి, మిరప పంటలను తగ్గించి, పట్టు ఉత్పత్తి వ్యవసాయంవైపు అడుగులు వేయాలని కోరారు. అనంతరం సబ్సిడీపై 35 మంది రైతులకు మంజూరైన 41 లక్షల విలువ చేసే వ్యవసాయ యంత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ జగదీశ్వర్‌రెడ్డి, రెంటచింతల, వెల్దుర్తి, దుర్గి, మాచర్ల మండలాల వ్యవసాయాధికారులు బ్రహ్మారెడ్డి, పుల్లారెడ్డి, అమీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆయా మండలాల వ్యవసాయశాఖ ఏఓలు, రైతులు పాల్గొన్నారు.

## లౌకిక వాదాన్ని రక్షించిన సుప్రీంకోరు

### -జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి



**గుంటూరుతూర్పు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వక్ఫ్ సవరణ బిల్లుపై వచ్చిన 75 పిటిషన్లు పరిశీలించి మే 5వ తేదీ వరకు వక్ఫ్ సవరణ బిల్లును అమలు చేయవద్దని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ కన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి. విశ్వనాథన్ లతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పును జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి స్వాగతించారు. రాజ్యాంగం పేర్కొన్న లౌకికవాదాన్ని ఈ తీర్పు రక్షిస్తుందన్నారు. అధికార పార్టీలకు కీలుబొమ్మలుగా మారిన అధికార యంత్రాంగం చేతులో వక్ఫ్ ఆస్తులు పెట్టడం దారుణం అన్నారు. వక్ఫ్ బోర్డులో కేంద్రంలో గాని, రాష్ట్రంలో గాని నూతన నియామకాలను చేపట్టారాదని సుప్రీంకోర్టు పేర్కొనడం అభినందనీయమన్నారు. తదుపరి విచారణ చేపట్టే వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయరాదని తెలపటం సముచిత నిర్ణయం అన్నారు. వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిమేతరులను నియమించాలనే భావన లౌకికవాదానికి పెను ప్రమాదం అన్నారు. ఆఘ మేఘాల మీద లోక్ సభలో 56 ఓట్ల మెజారిటీతో, రాజ్యసభలో 33 ఓట్ల మెజారిటీతో వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదింప చేసుకొని కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 5న రాష్ట్రపతి ఆమోద ముద్ర పొంది త్వరలో వెంటనే అమల్లోకి తీసుకు రావాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు సుప్రీంకోర్టు తీర్పు చెంపపట్టు అని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## రియల్ టైమ్ గవర్నెన్స్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** రియల్ టైమ్ గవర్నెన్స్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు గురువారం పరిశీలించారు. సిఎంఓ లో ప్రత్యేకంగా రియల్‌టైమ్ గవర్నెన్స్ పనితీరును ప్రత్యక్షంగా తిలకించారు. వాతావరణ పరిస్థితులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా ప్రజలకు అందించ



డం జరుగుతుందో పూర్తిగా ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుందన్నారు. సి.సి.కెమేరాల పర్యవేక్షణ గురించి ఆర్టీజి సిఈవోను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన మొత్తం సాంకేతిక పద్ధతుల్లో అమలు, పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలిపారు.

**ఇంటర్ విద్యార్థులకు ఎమ్మెల్యే చదలవాడ అభినందన...**

ఇంటర్మీడియట్ విద్యార్థులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు గురువారం అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన ఇంటర్ కళాశాల విద్యార్థులు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థులకు వచ్చిన మార్కులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద్‌బాబు అడిగి తెలుసుకున్నారు.

# సంబరంగా వర్సిటీ కళాశాలల వార్షికోత్సవ వేడుకలు


**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** వర్సిటీలోని ఆర్ట్స్ సైన్స్ ఫార్మసీ కళాశాలల వార్షికోత్స వేడుకలు గురువారం వైభవోపేతంగా జరిగాయి.ఈ వేడుకలకు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైదరాబాదులోని ఐఏఎస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు ఎం.బాలలత విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం అందించారు.వ్యక్తి తలచుకుంటేనే వ్యవస్థనే మార్పుచేసే అవకాశం ఉంటుందని గుర్తుచేశారు.ప్రతి ఒక్కరికి విల్ పవర్ ఉంటే ఎంతటి కష్టాన్నైనా విజయంగా మలచుకుంటారని పేర్కొన్నారు.విద్యార్థులకు వచ్చినమార్కులు విద్యార్థితోపాటు విశ్వవిద్యాలయానికి అందులో పనిచేస్తున్న అధ్యాపకులకు మాత్రమే సంతోషాన్ని ఇస్తాయనికానీ విశ్వవిద్యాలయం నుంచి విద్యను ఇచ్చిన ఒక విద్యార్థి నుంచి సమాజం ఏం కోరుకుంటుందో దాన్ని చేయగలిగినప్పుడే పరిపూర్ణ ఆనందం కలుగుతుందన్నారు.నేడు యువతలో స్థిరత్వం లోపించిందని గుర్తుచేశారు.ఈ క్రమంలో టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్‌ను ఉదహరించారు.ఆయన కసిగా పనిచేశారని వృత్తిని దైవంగా భావించారని పేర్కొన్నారు.లక్ష్యంవైపు అడుగులు వేస్తున్నట్లయితే అన్ని శక్తులు మనకు తోడుగా వస్తాయని అందుకు బలమైన ఉదాహరణలు రాష్ట్రానికి చెందిన పలువురు ఐఏఎస్ అధికారుల జీవిత గమ్యాలు ఒక ఉదాహరణ అన్నారు.భారత యువతి సునీత విలియమ్స్ అంతరిక్షంలో గడిపిన రోజులను గుర్తుచేశారు.మరో అతిథి సీఎంఓ కార్యాలయం గ్రీవెన్స్ ఆఫీసర్ చిన్నారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అపజయాన్ని చూసి భయపడుతుంటారని అపజయాన్ని విజయంగా మార్చుకుంటేనే జీవితం సార్థకమవుతుందన్నారు. వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన క్రీడా సాంస్కృతిక సాహిత్య పోటీల్లో విజేతలకు అతిథులతోపాటు ఇన్‌చార్జి విసి



ఆచార్య గంగాధరరావు, ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య రత్న షీలా మణి,ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.ప్రమీలారాణిని వార్షికోత్సవాల కన్వీనర్ ఆచార్య ఎం.త్రిమూర్తి రావు ఇన్‌చార్జి ఓఎస్డీ రవికుమార్ తదితరులు బహుమతులను అందజేశారు.ముందుగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రేలా రే రేలా నుంచి జానపద గాయక రత్న నంది అవార్డులను సాధించిన దామోదర గణపతిరావు ఆధ్వర్యంలో సంగీత విభావరి జరిగింది.ఇందులో విభిన్న ప్రతిభావంతులు తమ ప్రతిభా పాటవాలతో పాటలతో ప్రతి ఒక్కరి హర్షధ్వానాలు పొందారు.ఈ వేడుకల విజయవంతానికి నియమించిన కమిటీల నుంచి ఆచార్య సిహెచ్ లింగరాజు ఆచార్య దివ్యతేజో మూర్తి డాక్టర్ రవిశంకర్‌రెడ్డి,కమిటీ సభ్యులు తదితరులు పర్యవేక్షించారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి : ఎంపీడీఓ

**కొల్లిపర,ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ విజయలక్ష్మీ అన్నారు.గురువారం మండలంలోని పిడపర్రు,కొల్లిపర,అత్తోట సచివాలయాలను ఆమె తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు,సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ





సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు.కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజల ఆహ్లాదానికి ఎగ్జిబిషన్లు దోహదపడతాయి

### -ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు

గుంటూరు విద్య,ఏప్రిల్ 17,ప్రభాతవార్త : నగర ప్రజల ఆహ్లాదానికి ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పేర్కొన్నారు.స్థానిక గుంటగ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన జీవన్ సాగర్ ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమంలో నక్కా ఆనంద్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎగ్జిబిషన్ ప్రారంభించారు.అనంతరం ఎగ్జిబిషన్ నిర్వాహకులు మోహన్‌రావు,జుబేర్,అచ్చయ్యలు మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్‌లో కాశ్మీరు అందాలు,జలకన్యల



విన్యాసాలతో జీవన్‌సాగర్ ఎగ్జిబిషన్ వీక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. ఎగ్జిబిషన్‌లో మొట్టమొదటిసారి అతిపెద్ద కాశ్మీర్ సెట్టింగులతో మన గుంటూరు ప్రజలను ఆనందపు జల్లులతో ముంచడానికి,విదేశీ యువతులతో జలకన్య విన్యాసాలు అన్నిరకాల ఎమ్యూజ్‌మెంట్ రైట్స్ తో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పోతురాజు సమత జీవన్‌సాగర్ ఎగ్జిబిషన్ మేనేజ్‌మెంట్ తదితరులు పాల్గొన్నారు.నగర ప్రజలు ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## కృష్ణజలాల పంపిణీలో రాష్ట్రానికి అన్యాయం

**గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** కృష్ణా జలాల పంపకం వివాద విషయంలో రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానం ఆందోళన కలిగిస్తుందని మిగులు జలాల వాడకం విషయంలో ఉన్న హక్కుపై ప్రభుత్వం గట్టి వాదనలు వినిపించలేక పోతుందని అవగాహన సంస్థ నిర్వహించిన సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు.విశ్లేషకులు ఇ.చంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రం చేపట్టే ప్రతి ప్రాజెక్టు పై ఎగువన ఉన్న తెలంగాణా ప్రభుత్వం కెఆర్ఎంబి లోనూ,బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యూనల్ ముందు ఫిర్యాదుల చేస్తూనే ఉందన్నారు.

## విద్యావ్యవస్థలో సమూల మార్పులు కూటమి ప్రభుత్వానికే సాధ్యం

### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తెచ్చిన ఘనత కూటమి ప్రభుత్వంలోని విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కే సాధ్యమైందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలు సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన



పథకం ప్రారంభించడంతో ఎంతో మంది పేద విద్యార్థులకు మేలు చేకూరిందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు శిక్షణా తరగతులు నిర్వహించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందన్నారు. విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదివి మంచి భవిష్యత్తుతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇంటర్‌లో మంచి ఫలితాలు వచ్చేందుకు అధ్యాపకులు, సిబ్బంది చేసిన కృషిని నరేంద్రకుమార్ అభినందించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను దుశ్శాలువాలతో, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, మండల ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ, జనసేన మండలాధ్యక్షుడు చందు శ్రీరాములు, పొన్నూరు పట్టణాభివృద్ధి కమిటి కన్వీనర్ షేక్ యాసిన్‌బాబా, కళాశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేత

**నరసరావుపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థికి రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గురువారం వివరాలను జిల్లా అధ్యక్షులు అత్తులూరి సుబ్బారావు తెలియజేశారు. భీమవరం కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న చిన్న నరసింహారావు ఫ్రీ సీటును సాధించారని తెలిపారు. మూడు సంవత్సరాల బిటెక్ పూర్తి చేసుకున్నారని తెలిపారు. అయితే కళాశాలలో కొంత ఫీజు పెండింగ్ ఉండటంతో ఆర్యవైశ్య సంఘాన్ని సంప్రదించారని తెలియజేశారు. అదే విధంగా ఇంటర్వ్యూలకు వెళ్లేందుకు సరైన బట్టలు సైతం లేకపోవడంతో తమ ఆర్యవైశ్య సంఘం ఆదుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తాడువాయి రామకృష్ణ, గౌరు శ్రీనివాసరావు, విజయ్, మురళీ, మస్తాన్, కృష్ణ, సురేంద్ర, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ సాగులో దిట్ట..శారీరక సమస్యను లెక్కచేయని దిట్ట

**-ఆత్మ విశ్వాసంతో పనిచేస్తే అంగవైకల్యం అడ్డురాదు**
**-వివిధ రకాల పంటలను ప్రకృతి విధానంలో సాగుచేస్తున్న వైనం**
**-గతం కంటే నేడు పంటలకు మంచి ఆదరణ ఉంది**
**-సాయం అందించితే సాగు శాతం పెంచుతానంటున్న మహిళా రైతు**
**-ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని స్థానికుల కోరిక.**



**యడ్లపాడు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** నేడు వ్యవసాయం చేయాలంటే కత్తిమీద సాములాగ తయారు అయిన పరిస్తితులు ఉన్నాయి. ఒక ప్రక్క ప్రకృతి సమతుల్యత లేక ఎప్పుడు పడితే అప్పుడు వర్షాలు, చీడపీడల సమస్యలు, కూలీల సమస్యలు ఇటువంటి అనేక సమస్యలతో రైతాంగం ఇబ్బందులు పడుతుంటారు. అయితే ప్రకృతి వ్యసాయం అంటే మక్కువతో అంగవైకల్యాన్ని సైతం లెక్కచేయ కుండా అహర్నిశలు కష్టపడుతూ భర్త సహాయ సహకారాలతో స్వంతంగా జీవామృతాల ఎరువుల తయారి చేసుకుంటే పంటలను విషతుల్యాలకు బారిన పడకుండా నాణ్యమైన పంటల దిగుబడిని తీస్తున్న విధానం అందరినీ అశ్చర్యం కలుగజేయక తప్పదు..!

**ప్రకృతి వ్యసాయం :** సేంద్రియ వ్యవసాయాన్ని ప్రకృతి సిద్ధమైన పర్యావరణ అనుకూలమైన జీవాధారిత వ్యవసాయంగా వర్ణించవచ్చు. సేంద్రియ వ్యవసాయం జీవుల వైవిద్యాన్ని, జీవుల వివిధ దశలను, నేలలో గల సూక్ష్మజీవుల పనితనాన్ని వృద్ధి పరుస్తుంది. ముఖ్యంగా ప్రాంతీయంగా లభించే వనరులతో వ్యవసాయం చేయుటకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ, హానికర రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని విస్మరిస్తూ సేద్య, జీవసంబంధ, యా ంత్రియ పద్ధతులతో వ్యసాయం చేయుటకు అవకాశం కల్పిస్తుంది.

**ప్రకృతి వ్యవసాయం మూడు పద్ధతులుగా చేయవచ్చు :** మొదటి పద్ధతిలో కేవలం ప్రకృతి సిద్ధమైన ఎరువులు, అనగా ఎండిన అవు,గెద పేడ, అకు తుక్కు, వర్మీ కంపోస్టు(వానపాముల), వేప పిండి వంటి పదార్థాలు వాడి పంటలు పండించడం జరుగుతుంది. ఇది సాధారణ పద్ధతి. ఈ పద్ధతి కేరళ, ఈశాన్య రాష్ట్రాల్లో కొనసాగుతున్నది. సేంద్రీయ వ్యవసాయంలో సిక్కిం ముందు స్థానంలో ఉంది.

రెండవ పద్ధతిని గో ఆధారిత పద్ధతి, సుభాష్ పాలేకర్ పద్ధతి అని కూడా అంటారు. ఈ పద్ధతిలో సేంద్రీయ వ్యవసాయం జీవామృతం అను సహజ రసాయనంతో సాగు అవుతుంది. ఇక కీటక నాశానులుగా నీమా స్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం అను సహజ రసాయనాలు వాడతారు.

మూడో పద్ధతిని గో ఆధారిత బహుళ అంచెల వ్యవసాయం. శాస్త్రీయంగా ఒక సమగ్ర వ్యవసాయ వ్యవస్థగా నిర్వచించవచ్చు. దీనిలో మనం ఒకే భూమిలో 4నుండి5 వివిధ రకాలైన పంటలను అదే సమయంలో వేర్వేరు ఎత్తుల్లో, వేర్వేరు సమయాల్లో పరిపక్వం చెందుతాయి.

**పి కోటేశ్వరమ్మ, భర్త వెంకటేశ్వరరావు :** మండల పరిధిలోని ఉన్నవ గ్రామంలో నివాసం ఉంటుంది. వ్యవసాయం పై మక్కువతో గత అరు సంవత్సరాల నుండి ప్రకృతి వ్యవసయాన్ని క్రమం తప్పకుండా



సాగు చేస్తుంది. అయితే విధి విచిత్రంలో భాగంగా గత కరోనా సమయంలో జరిగిన ప్రమాదంలో ఒక కాలు దెబ్బతగిలి సకాలంలో వ్యయప్రయాసలు ఒడ్చి చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. అయిన తన పట్టుదలను విడవ కుండా భర్త వెంకటేశ్వరరావు సహాయంతో గ్రామంలోని ఒక రైతు నుండి అరు ఎకరాలను కౌలుకు తీసుకొని ప్రకృతి విధానంలో వివిధ రకాల పంటలను సాగుచేస్తుంది. ప్రకృతి వైపరిత్యాల కారణంగా ఒక ఏడాది ఇబ్బంది పడినా మరో ఏడాది సరిదిద్దుతుందిలే అనే అశతో సాగు చేస్తూనే ఉంది. ఈ పట్టుదల ప్రకృతి వ్యసాయం చేస్తున్న విధానాలను నచ్చిన కోందరు అహుతాస్విహిక గృహ వినయోగ దారులు అమెకు అండగా ఉంటామని, వివిధ పట్టణాలకు చెందిన సుమారు 19మంది వరకు అమె పండించిన పంటలను వారే స్వయంగా కొనుగోలు చేస్తున్నారు. వారు అమె పండించే పంటకు ముందుగా తమ వంతు కొంత అర్ధిక సహాయాన్ని అందించటం చేస్తున్నారు. తదుపరి పంట చేతికి వచ్చిన తదుపరి అప్పటి వరకు అయిన ఖర్చులు అధారంగా అమెకు ఎటువంటి ఇబ్బంది కలుగ కుండా మార్కెట్ రేటు పది శాతం ఎక్కువతోనే వారు కొనుగోలు చేస్తున్నారు. ఈమె స్వయంగా దగ్గరుండి పనులు చేసుకుంటూ కూలీల ద్వారా చేయించుతూ నాణ్యమైన పంటలను పండించుతున్నారు. అన్నీ ఉన్నా వ్యవసాయం చేయలేని ప్రస్తుత పరిస్తితులలో అంగవైకల్యం వల్ల ఇబ్బందులు ఉన్నా తన పట్టుదల చూస్తే ఎవరికైనా అశ్చర్యాన్ని కలుగక మానదు. కొంత ప్రోత్సాహకం ఉంటే ఇంకా ఎక్కువ భూమిని తీసుకొని సాగుచేస్తానని అంటున్నారు. ఈ మె పండించే పంటలు రసాయన ఎరువులు, పురుగుల మందులు, కలుపు మందులు అవసరం లేకుండా బీజామృతం, జీవామృతం, అచ్చాదన, వాఫ్స వంటివి, ద్రవ జీవామృతం, ఘన జీవామృతం వంటి సేంద్రీయ ఎరువులు బాజీమృతం వంటి విత్తన శుద్ద రసాయనాల ద్వారా నేడు స్వయంగా తయారు చేసుకుంటూ సాగుచేస్తున్నారు. ఈమె పండించే పంటలు మిరప, కంది, శనగలు, ఉల్లిపాయలు, వివిధ రకాల అకు కూరలు, పూలతోటలు చేస్తున్నారు. పండించిన పంటలను వివిధ ప్రాంతాలలో నిర్వహించే స్టాల్స్‌లోకూడా పెడతూ పది మందికి అదర్శంగా నిలుస్తున్నారు. ప్రకృతి వ్యసాయంలో దిట్ట..కానీ శారీరకంగా ఇబ్బందులు ఉన్నా వాటిని సైతం లెక్కచేయని దిట్టగా కనపడతారు. వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన కొందరు అహుత్సాకులు అమె పండించే పంటలు తీసుకుంటూ సాగుకు ముందుగానే తమ సహాయ సహకారాలు అందించుతూ వారు అమె ఉత్సాహాన్ని మరింతగా పెంపోందించే విధంగా సహకారం అందిస్తున్నారు. పలువురి ప్రసంశలు అందుకుంటున్నారు పి కోటేశ్వరమ్మ, భర్త వెంకటేశ్వరరావు. వీరికి ప్రభుత్వం నుండి ఎంతో కొంత సహాయ సహకారాలు అందితే మరింత ఎక్కువ ప్రకృతి వ్యసాయ దిగుబడులు అందించటానికి సిద్ధంగా ఉన్నాను అంటున్నారు వారు. వారి అశలు, అశయాలకు బీజం పడాలని, వారి తపన ఎందరికో స్ఫూర్తిని కలగాలని పలువురు అశాబావం వ్యక్త పరుస్తున్నారు.

## ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగు వేయాల్సిన అవసరం ఉంది

**కొల్లూరు, ఏఫ్రియల్ 17 (ప్రభాతవార్త :** ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగు వేయాల్సిన అవసరం ఉందని, బాపట్ల జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన కొల్లూరులోని మండల పరిషత్ కార్యాలయంలో సేంద్రీయ వ్యవసాయం సాగు చేసే విధానంపై సమావేశం



నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి కొల్లూరు మండలం వ్యవసాయశాఖ అధికారి ఆర్.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డిఏఓ రామకృష్ణ మాట్లాడుతూ మహిళా సంఘాలు ఈ ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకు వెళ్ళడంలో ప్రధాన భూమిక పోషించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ప్రజలకు ఎంతో ఆరోగ్యరీత్యా ఉపయోగం ఉందన్నారు. డిపిఎం వాణిశ్రీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన లాభాలు అధికంగా వస్తాయన్నారు. ఏడిఏ విజయబాబు మాట్లాడుతూ రైతులందరూ తమ సొంత భూమిలో కొంత భాగం అయిన రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా సండించాలని కుటుంబ సభ్యులందరూ ఆరోగ్యంగా ఉందించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిపిఎం వాణిశ్రీ, ఏడిఏ విజయ్‌బాబు, ఏవో ఆర్.వెంకటేశ్వరరావు, ఏపిఎం గాలి రాము, ఆదర్శ రైతు నిమ్మగడ్డ రామచంద్ర, సతీష్‌బాబు, జి.విక్రిష, వరదానమ్మ, సిసి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## భూమన కరుణాకర్ రెడ్డి అసత్య ప్రచారాలు మానుకోవాలి

**బాపట్ల,ఏప్రిల్17,ప్రభాతవార్త:** తిరుమల తిరుపతి దేవస్థానంలో చనిపోయినటువంటి ఆవుల సంఖ్యను గురించి బూమన కరుణాకర్ రెడ్డి అబూత కల్పనలు చెబుతూ అసత్య ప్రచారం చేస్తున్నారని బాపట్ల జిల్లా అధ్యక్షులు, బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్ బాబు అన్నారు.గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత, కుల రంగును అంటగట్టే దాని కొరకు ఒక దుర్మార్గమైనటువంటి ప్రయత్నం



కరుణాకర్ రెడ్డి చేస్తున్నారన్నారు. వాస్తవానికి నాస్తికుడని ప్రకటించుకున్నటువంటి భూమన కరుణాకర్ రెడ్డిని గత వైసిపి ప్రభుత్వం టిటిడి ఛైర్మన్ గా నియమించడమే ఒక పెద్ద నేరం పాపం అని అన్నారు.వెంకటేశ్వర స్వామి మీద నమ్మకం లేని నాస్తికుడు అయినటువంటి భూమన కరుణాకర్ రెడ్డి నాయకుడి మెప్పు పొందడం కోసం ఆయనతో శభాష్ జరిపించుకో దానికోసం రాత్రికిరాత్రే భక్తుడు అయిపోయి కుల మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం కట్టుకోవడానికి చేసేటువంటి ప్రయత్నాన్ని మనస్ఫూర్తిగా ఖండిస్తూన్నామన్నారు.ఇప్పటికైనా ఇటువంటి దుర్మార్గం అయినటువంటి ఆలోచనలను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాసరావు,తెలుగుదేశం పార్టీ నాయకులు తానికొండ దయా బాబు,ఫరీద్ మస్తాన్,మదపాటి ఆంద్రెయ,గుడిపల్లి సాంబశివరావు, యలమంద, పరిస రమేష్ గౌడ్, నాగరాజు, రాఘవేంద్ర, ప్రసాద్, శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

## కెరిడ్జ్ పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**నరసరావుపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** కెరిడ్జ్ పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలను గురువారం నిర్వహించారు. వివరాలను కళాశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలియజేశారు. ప్రీప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకల సందర్భంగా గ్రాడ్యుయేషన్ దుస్తులు, టోపీలు ధరించి వేదికపై చిన్నారులు సందడి చేశారు. ప్రిన్సిపాల్ జి.బర్నబాస్ అధ్యక్షత వహించారు. ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. చిన్న పిల్లలకు మాత్రమే



కాకుండా తల్లిదండ్రులకు ఇది సంతోషకరమైన రోజు అన్నారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు

**నరసరావుపేట క్రైం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో గురువారం వారోత్సవాలను నిర్వహించారు. ఫైర్ ఆఫీసర్ ఎం.వి.సుబ్బారావు ఈ సందర్భంగా మాట్లాడారు. వారోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు ఇండియన్ క్రిష్టియన్ స్కూల్‌లో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. వరుసగా వారోత్సవాలలో అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల భవనాలలో అగ్ని ప్రమాదాల నివారణకు



తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశామన్నారు. మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### - ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక

**కొల్లిపర,ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** చిన్నారుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు.గురువారం మండల పరిధిలోని తూములూరు సెక్టారులో అత్తోట అంగన్‌వాడీ



కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు.ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ మంచి ఆహారం తీసుకోవాలన్నారు.గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవటం వలన పుట్టబోమే శిశువు ఆరోగ్యంగా ఉంటారన్నారు.అదేవిధంగా మండలంలో చక్రాయపాలెం, తూములూరు, అత్తోట తదితర గ్రామాల్లో ఐసీడీఎస్ అధికారులు పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ వెంకటలక్ష్మి,అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఫేర్‌వెల్ వేడుకలు

**నరసరావుపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఫేర్‌వెల్



వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి - శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు ఉత్తమ భవిష్యత్తు కోసం లక్ష్యాలను నిర్దేశించుకొని గొప్ప విజయాలను సాధించాలని వారు ఆకాంక్షించారు. అదే విధంగా కళాశాలలో విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసిన మౌలిక వసతులను తెలియజేశారు. విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తును అందించేందుకు కళాశాల ఉత్తమ బోధన అందిస్తుందని కార్యదర్శి అట్లూరి శాంతి - శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. విద్యార్థులు ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. అదే విధంగా క్రికెట్, వాలీబాల్, త్రోబాల్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను కార్యదర్శి అట్లూరి శాంతి - శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.హెచ్.మల్లికార్జున, కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ సిఐగా నాగమల్లేశ్వరరావు



సత్తెనపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : సత్తెనపల్లి పట్టణ సి.ఐ.గా ఎన్.నాగమల్లేశ్వరరావు గురువారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ ఎస్.ఐ.లు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. సి.ఐ. మాట్లాడుతూ పట్టణంలో నేరాల నియంత్రణకు కృషి చేస్తానన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూడటమే తమ కర్తవ్యమని సి.ఐ. నాగమల్లేశ్వరరావు తెలియజేశారు.

18-4Pg5.qxd:18-4Pg5.qxd 18/04/25 11:47 PM Page 1



## రాష్ట్రపతికి ఆదేశాలిచ్చే అధికారం

# సుప్రీంకోర్టుకు లేదు!

### సుప్రీం వ్యాఖ్యలు తప్పుపట్టిన ఉపరాష్ట్రపతి



**న్యూఢిల్లీ:** రాష్ట్రపతి, గవర్నర్లను ఉద్దేశిస్తూ ఇటీవల అత్యున్నత న్యాయస్థానం కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పంపే బిల్లులను డెడ్‌లైన్‌లోగా క్లియర్ చేయాలని రాష్ట్రపతి, గవర్నర్లకు ఇటీవల సుప్రీంకోర్టు సూచించింది. సుప్రీంకోర్టు చేసిన ఆ వ్యాఖ్యలను ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ తప్పుపట్టారు. న్యాయ వ్యవస్థ వ్యవహరించిన తీరును ఆయన ఖండించారు. రాష్ట్రపతికి ఆదేశాలు ఇచ్చే అధికారం కోర్టులకు లేదని ఆయన అన్నారు. రాజ్యాంగంలోని 142వ అధికరణ ద్వారా సుప్రీంకోర్టు ప్రత్యేక అధికారాలు వర్తిస్తాయని, అయితే ఆ అధికరణను ప్రజాస్వామ్య వ్యవస్థలపై ఓ న్యూక్లియర్ మిస్సైల్ తరహా వాడుతున్నట్లు ఆరోపించారు.

ఇవాళ ఢిల్లీలోని వైస్ ప్రెసిడెంట్ ఎంక్లేవ్‌లో జరిగిన 6వ రాజ్యసభ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. భారత రాష్ట్రపతి పదవి చాలా అత్యున్నత మైందని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు శపథం చేసి బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. ఇటీవల ఓ తీర్పులో రాష్ట్ర పతికి సూచన చేశారని, ఇంతకీ మనం ఎక్కడికి వెళ్తున్నామని, దేశంలో ఏం జరుగుతోందని, సున్నితమైన అంశాల్లో మనం చాలా జాగ్రత్తగా వ్యవహరించా లన్నారు. ఇలాంటి అంశాలపై కేసు ఫైల్ చేయాలా వద్దా అన్న అంశం సరికాద న్నారు. ఇలాంటి ప్రజాస్వామ్యం కోసం మనం వేడుకో లేదన్నారు. డెడ్‌లైన్ ప్రకారం పనిచేయాలని రాష్ట్రపతిని ఆదేశించడం సరికాద న్నారు. సుప్రీం వ్యాఖ్యలను పరిశీలిస్తే జడ్జీలే శాసన వ్యవహా రాలు చూస్తున్నట్లు ఉందన్నారు. ఎగ్జిక్యూటి ఆదేశాలు అమలు చేస్తున్నట్లు ఉంద న్నారు. సూపర్ పార్లమెంట్‌ను జడ్జీలు నడిపిస్తు న్నట్లు ఉందన్నారు. దేనికీ బాధ్యత లేనట్లుగా వ్యవహ రిస్తున్నారని, ఇది ఈ నేల విధానాలకు వర్తిం చదు అని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రపతిని ఆదేశించే పరిస్థితి సరికాదు అని, అసలు ఏ ఆధారంగా అలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 145(3) ప్రకారం మాత్రమే రాజ్యాంగాన్ని ప్రశ్నించే హక్కు ఉందన్నారు. దానికి కూడా అయిదుగురు లేదా అంతకన్నా ఎక్కువ మంది జడ్జీలతో ధర్మాసనం ఏర్పాటు చేయాలన్నారు. న్యాయ వ్యవస్థకు ప్రజాస్వామ్య దళాల పట్ల ఆర్టికల్ 142 ఓ న్యూక్లియర్ మిస్సైల్‌గా మారిం దన్నారు.



## అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ భారత్ పర్యటన ఖరారు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారతదేశ పర్యటన ఖరారైంది. సతీమణి ఉషా వాన్స్‌తో కలిసి ఇటలీ, భారత్ లను సందర్శించనున్నారు. ఏప్రిల్ 18 నుంచి 24 వరకు ఈ పర్యటన కొనసాగనున్నట్లు అమెరికా ఉపాధ్యక్ష కార్యాలయం ప్రకటించింది. అమెరికా వైస్ ప్రెసిడెంట్ అయిన తర్వాత జెడి వాన్స్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. ఆయన సతీమణి ఉషా వాన్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారనే విషయం తెలిసిందే. ఇటలీ, భారత్ పర్యటనలో భాగంగా ఆయా దేశాల నేత లతో వాణిజ్య, భౌగోళిక రాజకీయ అంశాలపై జెడి వాన్స్ చర్చలు జరుపుతారని అమెరికా వైస్ ప్రెసిడెంట్ కార్యాలయం వెల్లడించింది. భారత పర్యటనలో భాగంగా వాన్స్ కుటుంబం ఢిల్లీ, జైపూర్, ఆగ్రాలను సందర్శించనుంది. ఆప్రాంతా ల్లోని చారిత్రక ప్రదేశాల్లో నిర్వహించే కార్యక్ర మాల్లో పాల్గొననుంది. మరోవైపు, ప్రధాని నరేంద్ర మోడీతో జేడీ వాన్స్ భేటీ కానున్నారు. భారత్ అమెరికా వాణిజ్య చర్చల వేళ జేడీ వాన్స్ పర్యటనకు ప్రాధాన్యత సంతరించు కుంది. డొనాల్డ్ ట్రంప్ సర్కారు భారత్ సహా అన్ని దేశాలపై సుంకాలు పెంచిన విషయం తెలిసిందే. వాన్స్ సతీమణి ఉషా చిలుకూరి అమెరికాలోనే పుట్టి పెరిగిన తెలుగు అమ్మాయి. ఆమె పూర్వీకులది ఏపీలోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. ఆమె తల్లి దండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1970ల్లోనే అమెరి కాకు వలస వెళ్లారు. వీరి ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. యేల్ లా స్కూల్‌లో జేడీ వాన్స్, ఉషా తొలిసారి కలుసుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరినొకరు ఇష్టపడి.. 2014లో హిందూ సంప్ర దాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం. జేడీవాన్స్ ఉపాధ్యక్ష ఎన్ని కల్లో గెలిచేందుకు ఉష కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు అమెరికా సెకండ్ లేడీ హోదాలో ఉషా వాన్స్ తమ పూర్వీకుల దేశమైన భారత్ రావడం ఆసక్తిగా మారింది. ఈ పర్యటనలో వారి తల్లి దండ్రులకు సంబంధించిన పూర్వీకులను కూడా కలిసే అవకశం ఉన్నట్లు తెలుస్తోంది.

## దంపతులిద్దరూ కూర్చుని మాట్లాడుకోండి!

### సిఎం ఓమర్ అబ్దుల్లా విడాకుల కేసులో సుప్రీం సూచన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** నేషనల్ కాన్ఫరెన్స్ నేత, జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విడాకుల కేసుపై సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. భార్య పాయల్ అబ్దుల్లాతో విడాకులు కోరుతూ జమ్మూకశ్మీర్ సీఎం అబ్దుల్లా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఏప్రిల్ 15న విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం ఒమర్ అబ్దుల్లా దంపతులిద్దరూ కూర్చొని మాట్లాడుకోవాలని సూచించింది. తమ మధ్య ఉన్న వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలని న్యాయ స్థానంపేర్కొంది. ఈకేసులో కౌన్సిలింగ్ ప్రక్రియ విఫలమైంది. దంపతులకు మరో ఛాన్స్ ఇవ్వా లనిభావిస్తున్నాం. తమమధ్య విబేధాలకు కారణ మైన అంశాలపై శాంతియుతంగా చర్చించుకో వాలి. ఈ ప్రక్రియ మూడు వారాల్లోగా పూర్తి కావాలి" అని జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది.

## చోక్సీని భారత్‌కు తరలించేందుకు కసరత్తు

### విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** పారిపోయిన వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ అరెస్టుపై విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. తమ అభ్యర్థన మేరకే అక్కడి పోలీసులు అరెస్టు చేశారని విదే శాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఇందులో భాగంగా భారత్ నుంచి పారిపోయిన చోక్సీ కోసం దర్యాప్తు సంస్థలు భారత్‌కు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. అప్పగింత విషయంలో బెల్జి యంతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. రూ. 13,500 కోట్ల బ్యాంకు రుణం మోసం కేసును దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. చోక్సీ అప్పగింతపై విదేశాంగ శాఖ చర్చలు జరిపిందని.. బెల్జియంతో భారత్ సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించారు.

మరో వైపు 26/11 ముంబై ఉగ్రదాడి నిందితుడు తహవ్వూర్ రాణాను భారత్‌కు అప్పగించే విష యంపై ఓ ప్రశ్నకు స్పందిస్తూ.. పాక్ ఎంత ప్రయత్నించినా.. ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్రమే ఖ్యాతి తగ్గదన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ భారత్ పర్యటనలో ప్రధాని మోడీతో సమావేశమవుతారని.. ఇద్దరు నేతలు ద్వైపాక్షిక సమస్యలపై చర్చిస్తారన్నారు. అమెరికా సుంకా లపై మాట్లాడుతూ.. వాణిజ్య ఒప్పందం కుదు ర్చుకునేందుకు చర్చలు జరుపుతున్నామన్నారు. ప్రధాని నరేంద్రమోడీకి రష్యా నుంచి ఆహ్వానం అందిందని.. విక్టరీ డే వేడుకల్లో భాగస్వామ్యాన్ని ప్రకటించనున్నట్లు తెలిపారు. మరోవైపు కైలాస్ మానస సరోవర్‌యాత్ర గురించి మాట్లాడుతూ.. యాత్ర విషయంలోనే త్వరలో ప్రకటన జారీ చేస్తామని.. త్వరలోనే తిరిగి యాత్ర ప్రారంభమ వుతుదన్నారు. భారత్-చైనా మధ్య ప్రత్యక్ష విమానసేవలపై మాట్లాడుతూ.. సూత్రప్రా యంగా విమాన కార్యకలాపాలు ప్రారంభమవు తాయని.. ఇందుకు రెండు దేశాలు అంగీకరించి నట్లు తెలిపారు. ఇరువైపులా సాంకేతిక ఏర్పా ట్లపై పౌర విమానాయాన అధికారులతో సమా వేశం జరిగిందని.. ఫ్రేమ్‌వర్క్‌తో సహా సంబం ధిత పద్ధతులపై చర్చిస్తున్నట్లు తెలిపారు. ఇక వక్ఫ్ సవరణ చట్టంపై ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ చట్టంలోని అన్ని అంశాలు భారత్ అంత ర్గత విషయమన్నారు. క్వాడ్ భవిష్యత్ ఉజ్వ లంగా ఉందని.. త్వరలోనే క్వాడ్ శిఖరాగ్ర సమా వేశం తేదీలను ప్రకటిస్తారన్నారు. యుఎస్-ఇరాన్ చర్చలను సానుకూల పరిణామంగా తెలిపారు. భారత్-బంగ్లాదేశ్ సంబంధాలపై మాట్లాడుతూ బంగ్లాతో భారత్ సానుకూల, నిర్మాణాత్మక సంబంధాలను ఏర్పాటు చేసుకో వాలని భావిస్తుందన్నారు. వాణిజ్య సమస్యల విషయానికి వస్తే.. గత వారం ట్రాన్స్‌షిప్‌మెంట్ సౌకర్యంపై ప్రకటించామన్నారు.

## మస్క్‌ను పొగడ్తలతో ముంచెత్తిన పుతిన్



**మాస్కో, ఏప్రిల్ 17:** టెస్లా బాస్, డోజ్ సారథి ఎలాన్ మస్క్‌ను రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ పొగడ్తలతో ముంచెత్తారు. గతంలో సోవియట్ కాలంనాటి రాకెట్ శాస్త్రవేత్త సెర్గీకొ రొలోవ్‌తో ఆయనను పోల్చారు. మాస్కోలోని బౌమన్ యూనివర్సిటీలో విద్యార్థులను ఉద్దేశించి పుతిన్ ప్రసంగించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ మస్క్ వంటి వ్యక్తులు చాలా అరుదుగా కనిపిస్తారన్నారు. 'మీకు తెలుసా.. అమెరికాలో మస్క్‌అనే వ్యక్తి ఉన్నాడు. అతడు అంగారక గ్రహం గురించిన కలలను గొప్పగాచెబుతుంటాడు. మానవ జాతిలో ఇలాంటి వారు చాలా అరుదు. అతడి కలలు కొంతకాలం తర్వాత వాస్తవరూపం ధరిస్తాయి. అలాంటి వ్యక్తులు చాలా అరుదుగా కనిపిస్తారు. ఈ రోజున నాకు నమ్మశక్యం కానివి భవిష్యత్తులో నిజాలాఅవుతాయి' అనిపుతిన్ అన్నారు. అంతకు ముందు జర్నలిస్ట్ టకర్‌కార్ల్‌సన్‌తో మాట్లాడుతూ 'ఎలాన్ మస్క్‌కు ఎదురులేదు' అని పుతిన్ వ్యాఖ్యానించారు. 2023 ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్‌లో పుతిన్ మాట్లాడుతూ ఎలాన్ ఓ అసాధారణ వ్యక్తి.. ప్రతిభావంతుడైన వ్యాపార వేత్త. ఈ విషయాన్ని ప్రపంచం మొత్తం గుర్తించిందని పుతిన్ పేర్కొన్నసంగతి తెలిసిందే.

**స్టార్‌లింక్‌కు రష్యా నుంచి ముప్పు..**

ఓవైపు పుతిన్ మస్క్‌ను పొగుడుతున్నా.. మరోవైపు స్టార్‌లింక్ ప్రాజెక్టుకు రష్యా నుంచి ముప్పు పొంచి ఉందని సెక్యూర్ వరల్డ్ ఫౌండే షన్ సంస్థ విడుదల చేసిన రిపోర్టులో పేర్కొంది. 316 పేజీల ఈ నివేదికలో పలు అంశాలను ప్రస్తావించింది. ఉపగ్రహాలను కూల్చే సామర్థ్యం మొత్తం 12 దేశాలకు ఉన్నట్లు వెల్లడించింది. ఉక్రెయిన్ యుద్ధంలో 2022 నుంచి స్టార్‌లింక్ వినియోగం మొదలుపెట్టినా..2024లో మాత్రం కొన్ని సమస్యలు ఎదురయ్యాయని వెల్లడిం చింది. రష్యా పరీక్షిస్తున్న ఎలక్ట్రానిక్ వార్ఫేర్ వ్యవస్థల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తినట్లు వెల్ల డించింది.

## 21,22 తేదీల్లో రాహుల్ అమెరికా పర్యటన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** కాంగ్రెస్ అగ్రనాయకుడు లోక్‌సభలోప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు సంబంధించిన షెడ్యూలు ఖరారైంది. రాహుల్ ఈనెల 21,22 తేదీల్లో అమెరికాలోపర్యటించనున్నారు. ఆ పార్టీనాయ కులు పవన్‌ఖేరా గురువారం వెల్లడించారు. ఆయన రోడ్‌ఐలాండ్‌లోని బ్రౌన్ యూనివర్సిటీని సందర్శిస్తారు. ఆవర్సిటీలోని విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడతారని తెలిపారు. అంతకుముందు ఆయన ఎన్నారై సంఘ సభ్యు లతో పాటు ఇండియా ఓవర్సీస్‌కాంగ్రెస్ సభ్యుల తోను సమావేశం అవుతారని తెలిపారు. గత ఏడాది సెప్టెంబరులో రాహుల్ మూడు రోజులు యూఎస్‌లోపర్యటించారు. ఈ పర్యటన సమ యంలో ఆయన పలుకార్యక్రమాల్లో పాల్గొ న్నారు. ఆకార్యక్రమాల్లో రాహుల్ రిజర్వే షన్లు భారత్‌లో మతస్వేచ్ఛ వంటి అంశాలపై మాట్లా డారు. ఈవ్యాఖ్యలు దేశీయంగా తీవ్ర దుమారం రేపాయి. సిక్కులను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు వివాదానికిదారితీసాయి. బిజెపి ఆయన మాటల నుఖండించింది. విదేశాల్లో భారత్ పరువుతీస్తు న్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది.

## టైమ్స్ జాబితాలో భారతీయులకు దక్కనిచోటు!



**న్యూయార్క్, ఏప్రిల్ 17:** ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో అత్యంత ప్రభావవంతమైన 100 మంది వ్యక్తుల జాబితాను ప్రఖ్యాత మ్యాగజైన్ టైమ్స్ విడుదల చేసింది. అందులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. కానీ ఆ జాబితాలో భారతీయులెవరికీ కూడా చోటుదక్కకపోవడం గమనార్హం. తాజాగా వెల్లడించిన జాబితాలో లీడర్స్, ఐకాన్స్, టైటాన్స్, ఆర్టిస్ట్స్, ఇన్నో వేటర్స్ ఇలా పలు కేటగిరీలుగా విభజించింది. టైమ్స్ మ్యాగజైన్ లో ప్రకటించిన పేర్లలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వా ధినేత మహమ్మద్ యూనస్, సిరియా నూతన అధిపతి అహ్మద్ అల్‌షారా, ప్రపంచ ఆరోగ్య సంస్థ టెడ్రోస్ తదితరులు ఉన్నారు.

నటి డెమి మూర్, అమెరికన్ రాపర్ స్నూప్ డాగ్, మాజీ టెన్నిస్ ఛాంపియన్ సెరెనా విలియమ్స్, పాప్ సింగర్ ఎడ్ షీరన్, గూగుల్ డీప్‌మైండ్ సహ వ్యవస్థాపకుడు హస్సాబిస్ పేర్లు ఉన్నాయి. భారతీయులు లేరు. టైమ్ ప్రకటించే ప్రభావశీలుర జాబితాలో ఈ మధ్య కాలంలో భారతీయులు లేకపోవడం ఇదే తొలిసారి. ఇక గతేడాదిలో బాలీవుడ్ నటి అలియా భట్, ఒలిం పిక్ పతక విజేత రెజ్లర్ సాక్షిమలిక్ ప్రభావ వంతమైన వ్యక్తులుగా నిలిచారు.

అంతకు ముందు ఏడాదిలో తెలుగు దర్శకుడు రాజమౌళి, బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌కు స్థానం దక్కింది. ఈసారి జాబితాలో భారత్ నుంచి ఏ ఒక్కరికీ చోటు దక్కకపోవడం గమనార్హం.

అయితే టైమ్ జాబితాలో ఇండియాన్స్ పేర్లు లేకపోయినా భారత సంతతికి చెందిన రేష్మ కెవల్‌రామణి చోటు దక్కింది. ప్రస్తుతం ఆమె వర్టెక్స్ ఫార్మా సీఈఓగా వ్యవహరిస్తున్నారు.

రేష్మ ముంబయిలో జన్మించారు. 11 ఏళ్ల వయసులోనే ఆమె కుటుంబం అమెరికాకు వలస వెళ్లి అక్కడే స్థిరపడింది. ఫార్మా రంగంలో రాణించిన రేష్మ, అమెరికా అతిపెద్ద బయో టెక్నాలజీకి తొలి మహిళా సీఈఓగా అరుదైన ఘనత అందుకున్నారు.

## 1000 కిలోల బంగారం కరిగించి బ్యాంకుల్లో డిపాజిట్

### యేటా వచ్చే రూ. 17.81 కోట్ల వడ్డీతో ఆలయాల అభివృద్ధి

**చెన్నై, ఏప్రిల్ 17:** తమిళనాడులోని 21 ఆలయాలకు భక్తులు సమర్పించిన నిరుపయో గంగా ఉన్న వెయ్యికిలోలకుపైగా ఉన్న బంగారు వస్తువులను కరిగించినట్లు తమిళనాడు సర్కారు ప్రకటించింది. వాటిని 24కేరట్ల కడ్డీలుగా మార్చి బ్యాంకులో డిపాజిట్‌చేసామని దీనివల్ల ఏటా రూ.17.81 కోట్లు వడ్డీరూపంలో ఆదాయం వస్తుందని సర్కారు వివరించింది. ఈ బంగారం పెట్టుబడిద్వారా వచ్చే వడ్డీ ఆ ఆలయాల అభి వృద్ధికే వినియోగిస్తామని స్టాలిన్ సర్కారు వెల్ల డించింది. హిందూ మత దేవాదాయశాఖకు సంబంధించిన ఒక విధానపర పత్రాన్ని మంత్రి శేఖర్‌బాబు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ పథకం అమలును పర్యవేక్షించేందుకు రాష్ట్రంలో మూడు ప్రాంతాలకు ఒకరుచొప్పున ముగ్గురు రిటైర్డ్ న్యాయమూర్తులతో కమిటీలను ఏర్పాటు చేసామన్నారు. తిరుచ్చిరాపల్లి జిల్లాలోనిమ రియమ్మన్ ఆలయంనుంచి అత్యంత భారీగా అంటే 424 కిలోలబంగారం వచ్చింది. హెచ్‌ఆర్ అండ్‌సిఇ శాఖ నియంత్రణలో ఉన్న ఆలయాల్లో నిరుపయోగంగా ఉన్న వెండి వస్తువులను కూడా కరిగించేందుకు అనుమతి ఇచ్చామని తెలిపింది.

## బెంగాల్ 25వేలమంది టీచర్లకు సుప్రీం ఊరట

### కొత్త టీచర్లు నియమించేవరకూ కొనసాగవచ్చని ఆదేశం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** పశ్చిమ్ బెంగాల్‌లో ఉద్యో గాల నుంచి తొలగించిన 25 వేల మంది టీచర్లకు సుప్రీంకోర్టు భారీగా ఊరట కలిగించింది. కొత్త రిక్రూట్‌మెంట్ పూర్తయి.. కొత్తవారు ఉద్యోగాల్లో చేరే వరకూ వారిని కొనసాగించడానికి అనుమతించింది. విద్యార్థులు ఇబ్బంది పడకూడదని, వారిభవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. బెంగాల్‌లో వెలుగుచూసిన ఉపా ధ్యాయ ఉద్యోగాల భర్తీ కుంభకోణం ఆ రాష్ట్రం లోనే కాకుండా దేశవ్యాప్తంగా తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. టీచర్ల నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ గుర్తించిన సుప్రీంకోర్టు.. ఆ 25 వేల మంది టీచర్లను ఉద్యోగాల నుంచి తొలగిం చాలని ఇటీవల సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే, బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌కు మాత్రం ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం డెడ్‌లైన్ విధించింది. కొత్త రిక్రూట్‌మెంట్‌కు నోటిఫి కేషన్‌ను మే 31లోగా విడుదల చేయాలని.. ఈ నియమాక ప్రక్రియ డిసెంబరు 31 నాటికి పూర్తిచేయాలని ఆదేశించింది. 9, 10, 11, 12 తరగతుల అసిస్టెంట్ టీచర్లకు సంబంధించిన మేరకు దాఖలైన అభ్యర్థనను మేము ఆమోదిం చామనే అభిప్రాయంలో ఉన్నాం. అయితే, కొన్ని షరతులకు లోబడే ఇది వర్తిస్తుంది.

కొత్త నియామకాల కోసం ప్రకటన మే 31వ తేదీ లోపల నోటిఫికేషన్ విడుదల చేయాలి.. పరీక్షతో సహా మొత్తం నియామక ప్రక్రియ డిసెం బర్ 31వ తేదీకి పూర్తికావాలి. రాష్ట్ర ప్రభుత్వం, కమిషన్ మే 31లోపు లేదా అంతకు ముందు ఒక అఫిడవిట్ దాఖలుచేయాలి. అందులో ప్రకటన కాపీతో పాటు షెడ్యూల్‌ను కూడా జతచే యాలి. తద్వారా డిసెంబర్ 31లోపు నియామక ప్రక్రియ పూర్తయినట్టు నిర్ధారణ అవుతుంది.. పై విధంగా ప్రకటన విడుదల చేయకపోతే కఠిన మైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది అని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. బెంగాల్ ప్రభుత్వం 201లో దాదాపు 25 వేల టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నియమాక ప్రక్రియ కోసం నిర్వహిం చిన పరీక్షలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై ఆరోపణలు రావడంతో దర్యాప్తు చేపట్టాలని కోర్టుల్లో భారీగా పిటిషన్లు దాఖలు అయ్యాయి. అర్హత లేని వారు, తక్కువ మార్కులు వచ్చిన వేలాది మంది అభ్యర్థులను టీచర్లుగా, నాన్ టీచింగ్ సిబ్బందిగా నియమించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అభ్యర్థుల నుంచి భారీగా లంచాలు తీసుకుని.. అర్హులైన, మెరిట్ అభ్యర్థు లను పక్కనపెట్టారని అభ్యర్థులు ఆరోపించారు. కలకత్తా హైకోర్టులో దాఖలైన పిటిషన్ల తర్వాత ఈ కుంభకోణం 2021లో వెలుగులోకి వచ్చింది. ఈ పరీక్షలో తక్కువ మార్కులు వచ్చిన అభ్య ర్థులు మెరిట్ జాబితాలో పైనఉండటం.. మెరిట్ జాబితాలోలేని వ్యక్తులకు ఆఫర్ లెటర్లు రావడం, ఖాళీ ఓఎమ్ఆర్ షీట్లు ఇచ్చిన వారికి కూడా ఉద్యోగాలు వచ్చాయని అభ్యర్థులు ఆరోపించారు. ఓఎంఆర్ షీట్లు తారుమారు, మోసపూరిత ర్యాంక్ జంప్‌లు, అక్రమ నియామకాల కోసం అదనపు పోస్టులు సృష్టించడం వంటివి జరిగాయని అధికారుల దర్యాప్తులో తేలాయి. ఈ కుంభకోణంలో వందల కోట్ల రూపాయల లావా దేవీలు జరిగినట్లు ఆధారాలులభించాయి. ఇప్పటి వరకు ఇడి అధికారులు రూ.365 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేశారు.

ఈ క్రమంలో అక్ర మాలను ఆధారాలతో సహా కోర్టులో నిరూపిత య్యాయి. దీంతో సుప్రీంకోర్టు ఏప్రిల్ మొదటి వారంలో తుది తీర్పు వెలువ రించింది. ఈ తీర్పుపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా స్పందంచారు. తన గుండె బండగా మారిందని, తాను ప్రాణాలతో ఉన్నంత కాలం ఏ ఒక్క అర్హుడు అయిన ఉపాధ్యాయుడి ఉద్యోగం పోదని వెల్లడించారు. ఇలా మాట్లాడు తున్నందుకు తనను జైల్లో వేసే అవకాశం కూడా ఉందని.. అయినా తానేమీ భయపడనంటూ వివరించారు.



## వక్ఫ్‌సవరణచట్టంపై గడువుకోరిన కేంద్రం

### వచ్చేనెల 5కు వాయిదావేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** వక్ఫ్ సవరణ చట్టంపై విచారణను సుప్రీం కోర్టు వచ్చేనెల 5కు వాయిదా వేసింది. అప్పటి వరకు యథాతథ పరిస్థితి కొనసాగించాలని ప్రభుత్వానికి సూచించింది. వక్ఫ్‌సవరణ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ కేవీ విశ్వ నాథన్‌తో కూడిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం రెండోరోజు విచారణ జరిపింది. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించిన నేపథ్యంలో కొన్ని దస్త్రాలు దాఖలు చేసేందుకు వారం రోజుల గడువు కావాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. అందుకు సమ్మతించిన ధర్మాసనం, ఈ సమయంలో సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డులో నియామకాలు జరపరాదని తెలిపింది. వక్ఫ్ ఆస్తులుగా కోర్టులు ప్రకటించిన వాటిని డి నోటిఫై చేయరాదని కూడా స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం తరఫున విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అందుకు అంగీకరించారు. దీంతో సుప్రీం కోర్టు తదుపరి విచారణను వచ్చేనెల 5కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. అంతకుందు ఇవే పిటిషన్లపై బుధ వారం సుప్రీంకోర్టులో వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా వక్ఫ్‌గా న్యాయస్థానాలు ప్రకటించిన ఆస్తులను ప్రస్తుతానికి వక్ఫ్ జాబితా నుంచి తొల గించకూడదని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ మండలిలో ఎక్స్‌అఫీషియో సభ్యులు మినహా మిగతా సభ్యులంతా కచ్చితంగా ముస్లింలే అయ్యుండాలనీ ప్రతిపాదించింది. మతంతో సంబంధం లేకుండా ఎక్స్‌అఫీషియో సభ్యులను నియమించొచ్చని చెప్పింది. ఈ మేరకు వక్ఫ్ (సవరణ) చట్టంలోని కొన్ని కీలక నిబంధనలపై స్టే విధించేందుకు ప్రతిపాదనలు చేసింది. ఇటీవలె పార్లమెంట్ ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం 2025 అమల్లోకి వచ్చింది. ఈ మేరకు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఏప్రిల్ 8 నుంచే ఈ చట్టం అమల్లోకి వచ్చినట్లు నోటిఫికేషన్ జారీ చేసింది. పార్లమెంట్ ఉభయ సభల నుంచి ఈ బిల్లు పాస్ అవ్వగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం ఆమోద ముద్ర వేశారు. దీంతో వక్ఫ్ (సవరణ) బిల్లు చట్టంగా మారింది.

18-4Pg6exHMNWJQE.qxd:18-4Pg6exHMNWJQE.qxd 18/04/25 12:57 AM Page 1



# నిర్మాణ రంగంలో అనుభవం లేని సంస్థల నుంచి ప్లాట్లు కొనుగోలు చేయవద్దు

## రెరా కార్యదర్శి

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** నగరంలో విశ్వ నగరంగా రూపు దిద్దుకుంటోంది. దీంతో నగరంలో పెద్ద ఎత్తన నిర్మాణ సంస్థలు పుట్టుకువస్తున్నాయి. వీటిలో అనేక సంస్థలు నిర్మాణ రంగంలో ఎటువంటి అనుభవం లేనివి ఉండగా, మరికొన్ని సంస్థలు ప్రీలాంచ్ పేరుతో, ఇంకొన్ని సంస్థలు ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ అంటూ జనాన్ని బురిడీ కొట్టిస్తున్నాయి. కనీసం స్థలాన్ని కొను గోలు చేయకుండానే మార్కెటింగ్ చేస్తూ రూ.కోట్లు మూటకట్టుకొని బోర్డులు తిప్పేస్తున్నాయి. ఇప్పటికే లెక్క లేనన్ని సంస్థలు రూ.వేల కోట్లు దండుకొని జెండా ఎత్తేశాయి. అలాగే మరికొన్ని దందాలు సాగిస్తూనే ఉన్నా యి. కనీసం వెంచర్, ప్రాజెక్టుకు అనుమతులు వచ్చా యా? లేదా? అన్న విషయాన్ని తెలుసుకోకుండా కొనుగోలుచేసే కస్టమర్లు ఉన్నన్ని రోజులు ఇలాంటి సంస్థల దోపిడీ సాగుతూనే ఉంటుంది.

తాజాగా మరో రెండు సంస్థలపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరి ఆథార్టీ విచారించి జరిమానా విధిం చడమే కాకుండా కస్టమర్లకు న్యాయం చేయాలని సదరు సంస్థలను ఆదేశించింది. ముందే వసూలు చేసిన కృతికృతిక ఇన్ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్, కృతిక ఇన్ఫ్రా డెవలపర్స్ అనే సంస్థ మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం మేడిపల్లి సర్వే నం. 215లో శేషాద్రి ఓక్ పేరిట ప్లాట్లను విక్రయిస్తున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారంతా డబ్బులు చెల్లిస్తున్నారు. కానీ ప్రమోటర్స్, డెవలపర్స్ మాత్రం సేల్‌డీడ్స్ చేయడం లేదు. ఈ సంస్థకు ఎండిగా డి.శ్రీకాంత్, ఎం.శశికాంత్, డి. గోపాల్, రాధాబూక్యాలు డబ్బులు తీసుకున్నారే తప్ప ప్లాట్లు రిజి స్ట్రేషన్ చేయకపోవడంతో రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ అథారిటీకి ఫిర్యాదు చేశారు. రెరాలో రిజిస్టర్ చేసు కోకుండా ఎలాంటి ప్రమోషన్ చేయరాదని, మార్కెటింగ్ చేయొద్దని, ప్లాట్లు బుకింగ్ గానీ అమ్మకాలు గానీ సాగించొద్దని రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) యాక్ట్, 2016 లోని సెక్షన్ 3(1) స్పష్టం చేస్తుంది.

శేషాద్రి సిల్వర్ ఓక్ పేరిట రెరాలో ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు. కనీసం అప్లికేషన్ కూడా లేదు. కనీసం స్థానిక సంస్థల నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండిఏలో కూడా చేయలేదు. దాంతో ఈ సంస్థకు రూ.9.96 లక్షల జరిమానా విధిం చారు. ఇక నుంచి ఎలాంటి ప్రచారం చేయొద్దని, వీరి నుంచి ఎవరూ ప్లాట్లు కొనుగోలు చేయొద్దని రెరా సెక్రటరీ ప్రజలకు సూచించారు. అదేవిధంగా హైదరాబాద్‌లో ఓ డెవలపర్ పైనా రెరా యాక్షన్ లోకి దిగింది. ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేసి కొనుగోలుదారులకు అప్పగిం చడంలో జాప్యం చేసినందుకు ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే కొనుగోలుదారులు చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని ఆదేశించింది.

శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలోని వెస్టన్ గెలాక్సీ అనే కమర్షియల్ ప్రాజెక్టుపై దాఖలైన తొమ్మిది వేర్వేరు కేసులను విచారించి ఈ మేరకు ఆదేశాలిచ్చింది. 11 శాతం వడ్డీతో ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాలని స్పష్టం చేసింది. గోపనపల్లిలో ఈ ప్రాజెక్టులో కమర్షియల్ యూనిట్లను పలువురు కొనుగోలు చేశారు. 2022 జనవరి 26న ఇందుకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. 2024 డిసెంబర్ నాటికి ప్రాజె క్టును పూర్తిచేసి అప్పగిస్తామని ఒప్పందంలో రాసు కున్నారు. ఒకవేళ ఏదైనా జాప్యం జరిగిన చదర అడుగుకు నెలకు రూ.75 చొప్పున అద్దె చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొనుగోలుదారుల పేర్ల మీద కొలెటరల్ ప్లాట్‌ను రిజిస్టర్ చేశారు. కమర్షియల్ యూనిట్ డెలివరీ చేసిన నాడు ఆ ఫ్లాట్ తిరిగి ఇవ్వాలని క్లాజ్ పెట్టుకున్నారు. అయితే, నిర్దేశిత సమయంలోగా సంస్థ ఆ ప్రాజెక్టును పూర్తి చేయ లేకపోయింది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కు చెందిన పలువురు కొనుగోలుదారులు తెలంగాణ రెరాను ఆశ్ర యించారు. దీనిపై విచారణ జరిపిన రెరా... 90 రోజుల్లోగా కొనుగోలుదారులు చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని రియల్టర్‌ను ఆదేశించింది. అదేవిధంగా ఆ మొత్తం అందుకున్న తర్వాత కొలెటరల్ షాట్‌ను కంపెనీకి తిరిగివ్వాలని కొనుగోలుదారులకు సూచించింది.

# కావలిలో పట్టపగలు నాలుగు ఇళ్లల్లో చోరీలు

## 43 లక్షల విలువైన బంగారు నగలు అపహరణ

## పోలీసులకు సవాళ్లు విసిరిన దుండగులు

**కావలి ( నెల్లూరు), ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** కావలి పట్టణ టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసులకు సవాళ్లు విసురుతూ పట్టపగలు తాళాలు వేసిన నాలుగు ఇళ్లల్లో దుండగులు ప్రవేశించి దాదాపు 43 లక్షల రూపాయల బంగారు నగలు, వెండి, నగదు చోరీచేశారు. గురువారం జరిగిన ఈ చోరీలు కావలిలో తీవ్రసంచలనం సృష్టించాయి. ఈ వార్త దావానలంలా వ్యాపించడంతో ప్రజలు భీతిల్లిపోతున్నారు. గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఒంటిగంటలోపు తాళాలు వేసిఉన్న నాలుగు ఇళ్లల్లో దుండగులు చోరీచేసి తీవ్ర భయానక వాతావరణం సృష్టించారు. ఈ నలుగురి ఇళ్లకు సంబంధించి ముగ్గురు టీచర్లు రోజుమాదిరిగా ఇంటికి తాళాలువేసి ఉద్యోగాలకు వెళ్లారు. టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని నార్త్ జనతాపేట, రామాలయం వీధి, కళ్యాణమండపం పక్కన వీధిల్లోని ఇళ్లల్లో ఈ దుండగులు చోరీచేశారు. లలితమ్మ నివాసంలో 50 సవర్లు తూకం కలిగిన బంగారు నగలు, దాదాపు 50వేల రూపాయల నగదు దుండగులు చోరీ చేశారు. టీచర్ లక్ష్మిప్రసన్న నివాసంలో దాదాపు 10 సవర్ల తూకం కలిగిన బంగారు నగలు చోరీకి గురయ్యాయి. టీచర్ అరుణ నివాసంలో 10వేల రూపాయల నగదు అపహరించారు. టీచర్ ఇందిర నివాసంలో దాదాపు కేజీ తూకం కలిగిన వెండిని దుండగులు చోరీచేశారు. అరుణ, ఇందిర నివాసాల్లో బంగారు నగలు గుడ్డల్లో పెట్టడంతో దొంగల కంటపడకపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నట్లయింది. నాలుగు ఇళ్లు ఒకే పద్ధతిలో చోరీ చేశారు. బీరువాల్లోని గుడ్డలు చిందరవందర చేసి కొన్నిచోట్ల చోరీ చేశారు.

నాలుగు ఇళ్లల్లో పట్టపగలు చోరీజరిగిన విషయాన్ని తెలుసుకుని కావలి డీఎస్పీ శ్రీధర్, వన్‌టౌన్ సిఐ ఫిరోజ్, టూటౌన్ సిబ్బంది సంఘటన ప్రదేశానికి తరలివెళ్లారు. బాధితులతో మాట్లాడారు.

క్లూస్‌టీమ్ వేలిముద్రలు సేకరించింది. కావలిలో ఏ నోటవిన్నా ఈ నాలుగుఇళ్ల చోరీ ప్రస్తుతం వినిపిస్తుంది.

# జూన్ 9న ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠ

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని విజయవాడ రోడ్ బైపాస్‌రోడ్డు కూడలి సమీపంలో జూన్ 9వ తేదీన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఆవిష్కరణ నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటి, కోర్ కమిటి ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు భువనేశ్వరి పీఠాధిపతి శ్రీకమలానంద భారతి స్వామి వారిని కలుసుకుని ఆహ్వాన పత్రిక అందజేసి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరినట్లు తెలిపారు. కోర్ కమిటి ప్రతినిధులు పి వెంగళరావు, పి నరేంద్ర, సంకా భాస్కర్, నోముల రఘు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

# చారిత్రక కట్టడాల వద్ద ఎటువంటి పనులు చేపట్టవద్దు

## పాతబస్తీ మెట్రో నిర్మాణంపై హైకోర్టు కీలక ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 17:** హైదరాబాద్‌లోని పాతబస్తీలో మెట్రో నిర్మాణ పనులపై తెలంగాణ హైకోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజన పిటీషన్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. యాక్ట్ ఫర్ పబ్లిక్ వెల్ఫేర్ అనే ఫౌండేషన్ హైకోర్టులో ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. దానిలో భాగంగా మెట్రో నిర్మాణం వల్ల పాతబస్తీలోని పలు చారిత్రక కట్టడాలు దెబ్బ తింటున్నాయని పిటిషన్‌లో పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ పురావస్తు శాఖ గుర్తించిన చారిత్రక కట్టడాలకు నష్టం లేకుండా చూస్తున్నామని, చారిత్రక కట్టడాలను కూలగొట్టడం లేదని కోర్టుకు తెలిపారు. పరిహారం చెల్లించాకే స్థలాలు సేకరించి నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయడానికి అదనపు అడ్వకేట్ జనరల్ న్యాయస్థానాన్ని కొంత సమయం కావాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ పాత బస్తీ లోని మెట్రో నిర్మాణ పనుల్లో భాగంగా చారిత్రక కట్టడాలకు ఎలాంటి నష్టం చేయకూడదని ప్రభుత్వానికి సూచించింది. పురావస్తు శాఖ గుర్తించిన చారిత్రక కట్టడాల వద్ద ఎలాంటి పనులు చేపట్టకూడదని న్యాయస్థానం ఆదేశించింది. ఈ నెల 22 లోగా కౌంటర్ దాఖలు చేయా లని ఆదేశించిన హైకోర్టు, పిటిషన్‌పై తదుపరి విచారణను అదేరోజుకు వాయిదా వేసింది.

# రూ. 4వేల కోట్ల ఫీజు బకాయిలు, హాస్టళ్ల మెస్ బిల్లులు చెల్లించాలి

## డిప్యూటీ సిఎం భట్టితో ఆర్.కృష్ణయ్య చర్చలు

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 20 లక్షల మంది ఇంజనీరింగ్, మెడిసిన్,పీజీ, డిగ్రీ విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటన్ విడుదల చేయాలని,బిసి కాలేజీ హాస్టళ్ల మెసి బిల్లులు,ఇంటి అద్దెలు,కరెంట్ బిల్లులు చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క్‌ను కలిసి చర్చలు జరిపారు. ఈ చర్చల్లో బిసి ప్రతినిధి వర్గంలో నీల వెంకటేష్, గొరిగి మల్లేశ్, సతీశ్, రాజేందర్, అనంతయ్య, ఉమేష్ తదితరులు పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య,భట్టి విక్రమార్యతో 'ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ విద్యార్థులకు ఫీజు మినహాయింపు స్కీమ్ ప్రవేశ పెట్టింది. అంటే కోర్సులలో అడ్మిషన్ల సమయంలో ఫీజులు వసూలు చెయ్యరాదని స్పష్టంగా ఉంది. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గత నాలుగేళ్లలో 4,000 కోట్ల బకాయిలు పేరుకపోయాయి. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నాడు. ఫీజులు ప్రభుత్వం సకా లంలో విడుదల చేయక పోవడంతో కాలేజీ యా జమాన్యాలు విద్యార్థులను ఫీజాలు ఇట్టాలని వత్తిడి చేస్తున్నారని అన్నారు. అలాగే నెలలుగా బీసీ హాస్టళ్ళ మెస్ బిల్లులు, కరెంట్ బిల్లులు చెల్లించడం లేదు. దీని వ ల్ల విద్యార్థులు తీవ్ర అల్బందులకు గురవుతున్నారు. కూర గాయలు, గుడ్ల బిల్లులు, నూనెలు ఇతర నిత్యావసర వస్తువుల బిల్లులు గత 5నెలలుగా చెల్లించడం లేదు. దీనితో హాస్టళ్లకు సరుకులు సరఫరా చేసే వ్యాపారస్తులు అప్పుల పాలయ్యారు. నిత్యావసర వస్తువులు సరఫరా నిలిపి వస్తామని అంటున్నారు. దీనిమూలంగా హాస్టళ్లు మూసివేసే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలోని మొత్తం బీసీ కాలేజీ హాస్టళ్ళు అద్దె భవనాల్లో ఉన్నాయి.అద్దెలు కూడా చెల్లించడం లేదు. యజమానులు భవనాలు ఖాళీ చేయమని ఒత్తిడి చేస్తున్నారు'అని డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్లారు.అందుకు స్పందించిన డిప్యూటీ సిఎం



హాస్టల్ మెస్ బిల్లులు,

అద్దె బకాయిలు మూడు నాలుగు రోజుల్లో విడుదల చేయాలని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణను ఆదేశించారు. బడ్జెట్ విడుదల చేయకపోతే హాస్టళ్లు ఎలా నడుస్తాయని, వెంటనే విడుదల చేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్లు న్యాయమైనవని త్వరగా పరిష్కరించాలని తెలిపారు.

# 97వ సారి రక్తదానం చేసిన ప్రధానోపాధ్యాయుడు నేలవెల్లి రమేష్‌బాబు

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** ప్రాణాపాయంలోవున్న వారికి అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ఆదుకోవటం ఆ ఉపాధ్యాయుడు తన జీవిత లక్ష్యంలో ప్రవృత్తిగా ఎంచుకుని ఆదర్శంగా నిలిచారు. ఎన్‌టిఆర్‌జిల్లా జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్నారు. చిల్లకల్లు గ్రామానికి చెందిన ఒక మహిళకు గురువారం అత్యవసరంగా గర్భసంచి తొలగించే శస్త్రచికిత్స చేయాల్సి ఉండగా ఏ పాజిటివ్ రక్తం అవసరమైంది. దీంతో జగ్గయ్యపేట బ్లడ్ డోనర్స్ సామాజిక మాధ్యమ గ్రూపు ద్వారా సమాచారం తెలుసుకున్న రమేష్‌బాబు వెంటనే వెళ్ళి రక్తదానం చేశారు. స్థానిక ఎంఎల్‌ఏ శ్రీరాం రాజగోపాల్ కాలేజీ చదువుతున్న రోజుల్లో అనేకమార్లు ఆయన రక్తదానం చేస్తుండటాన్ని గమనించి తాను కూడా ఆపదలోవున్న వారికి రక్తదానం చెయ్యాలని సంకల్పించానని ఇప్పటికి 97 సార్లు రక్తదానం చేశానని రమేష్‌బాబు తెలిపారు. అలాగే తన కుమారుడు నిఖిల్‌బాబు ట్రాన్స్‌కో ఏఇగా పనిచేస్తూ రక్తదానం యజ్ఞంలో భాగస్వామి అయ్యాడని, తన సోదరుడుఅప్పారావు కూడా ఇదే స్ఫూర్తితో ఆపదలోవున్న వారికి రక్తదానం చేస్తున్నాడని చెప్పారు. కాగా ఈసందర్భంగా రమేష్‌బాబును పలువురు అభినందించారు.

# యుజిసి నెట్-2025కు దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో జూనియర్ రీసెర్చ్‌ఫెలోషిప్(జేఆర్ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల భర్తీతోపాటు పిహెచ్‌డీ చేయడానికి అర్హత సాధించడం కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) దరఖాస్తుల స్వీకరణను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) ప్రారంభించింది. మే 7 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు ప్రకటించింది. మొత్తం 85 సబ్జెక్టులకు పరీక్షలను నిర్వహించనుంది. మే 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనుంది.

# ముగిసిన ఎస్‌ఎ-2 పరీక్షలు

## 24 నుంచి వేసవి సెలవులు

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 1వ తరగతి నుంచి 9వ వరగతి విద్యార్థులకు సమ్మెటివ్ అసెస్‌మెంట్(ఎస్ఏ)-2 పరీక్షలు గురువారంతో ముగి శాయి. ఈ నెల 9న ప్రారంభమైన ఎస్ఏ-2 పరీక్షలు గురువారంతో ముగిశాయి. శుక్రవారం గుడ్‌ఫ్రైడే కావడంతో పాఠశాలలకు సెలవు ఉంటుంది. 9వ తరగతి వరకు విద్యార్థులకు సంబంధించిన ఎస్ఏ-2 పరీక్షల మూల్యాంకనాన్ని 22లోపుగా పూర్తి చేయాలని పాఠశాల విద్య శాఖ అధికారులు డిఈవోలు, ఎంఈవోలు, హెడ్మాష్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

ఈ నెల 22 వరకు మూల్యాంకన పూర్తి చేసి .. ఈ నెల 23న నిర్వహించే పేరెంట్స్ టీచర్స్ మీటింగ్(పిటిఎం)లో విద్యార్థులకి సంబంధించిన ఫలితాలను విడుదల చేయాలని ఇప్పటికే పాఠశాల విద్య డైరక్టర్ నరసింహారెడ్డి అధికారులకు ఆదేశాలను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రతి పాఠశాలలో ఈనెల 20వ తేదీ లోపు సీసీఈ మార్క్స్ ఎంట్రీ పూర్తి చేయాలని సూచించారు.

## నేటి ప్రజావాణి 22వ తేదీకి వాయిదా

**హైదరాబాద్ (బేగంపేట), ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఏప్రిల్ 18(నేడు) జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమం గుడ్‌ఫ్రైడే కారణంగా 22వ తేదీ మంగళవారానికి వాయిదా వేసారు. దరఖాస్తుదారులు ఈ మార్పును గమనించి ఏప్రిల్ 18వ తేదీ శుక్రవారం కాకుండా ఏప్రిల్ 22న (మంగళవారం) జరిగే ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావాలని ప్రజావాణి అధికారులు ఒక ప్రకటనలో తెలియజేసారు.

# పిల్లలను చంపి.. మేడపై నుండి దూకి గృహిణి ఆత్మహత్య

## కుటుంబకలహాలు, ఆనారోగ్య సమస్యలే కారణమంటూ లేఖ

**హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), ఏప్రిల్ 17, ప్రభాత వార్త:** కుటుంబ కలహాలకు తోడు పిల్లలూ, తానూ ఆనారోగ్య సమస్యలతో సతమమవుతున్న ఓ గృహిణి తన ఇద్దరు కొడుకులను వేట కొడవలి తో నరికిచంపి తానూ ఆత్మహత్య చేసుకున్న సంఘటనతో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీ లేఅవుట్‌లో తీవ్రసంచలనం చోటు చేసుకుంది. బాలానగర్ డిప్యుటీ పోలీసు కమిషనర్ సురేశ్‌కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి, తేజశ్రీరెడ్డి(35) దంపతులు పన్నెండేళ్లక్రితం నగర శివారు జీడిమెట్ల పారిశ్రామికవాడకు వచ్చి గాజుల రామారం సమీపంలోని బాలాజీ లేఅవుట్ సహస్ర మహేశ్ హైట్స్ అపార్ట్‌మెంట్స్‌లో నివాస ముంటున్నారు. భర్త వెంకటేశ్వర్‌రెడ్డి జీడిమెట్ల పారిశ్రామికవాడలోని గ్రాన్యువల్స్ ఇండియా కెమికల్ కంపెనీలో ఉద్యోం చేస్తు కుటుంబాన్ని పోశిస్తున్నాడు. గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో తేజశ్రీరెడ్డి తన ఇద్దరు కుమారులైన హర్శిత్‌రెడ్డి(11)ని మొదటగా వేటకొడవలితో గొంతుకోసి చంపేసింది. అనంతరం చిన్న కుమారుడు ఆశీస్‌రెడ్డి(8)ని కూడా కత్తితో నరికిచంపిన తేజశ్రీ ఆమె నివసిస్తున్న అపార్ట్‌మెంట్ ఆరవ అంతస్థుపైకి వెళ్లి మేడపై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారంతో జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్, బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ హనుమంతరావు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని కొన ఊపిరితో ఉన్న ఆమె చిన్నకుమారుడు ఆశీష్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో మరణించాడు. అంతకుముందే ఆమె రాసిన నాలుగు పేజీల సూసైడ్ నోట్‌లో భర్త వేధింపులతోపాటు గతకొన్ని సంవత్సరాలుగా తనకు, తన పిల్లలకు తీవ్ర ఆనారోగ్య సమస్యలు ఉండటంతో పిల్లలను చంపి తానూ ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పేర్కొంది. దీనికితోటు కుటుంబకలహాల నేపథ్యం రాసి తనకు జీవితంపై విరక్తి చెందినట్లు పేర్కొన్నట్లు డిసిపి సురేశ్‌కుమార్ తెలిపారు.

పూర్తివివరాలను సేకరించి విచారణ చేస్తున్నట్లు ఆయన పేర్కొ న్నారు. తేజశ్రీరెడ్డి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పాటు వివిధ కోణాలలో శారీరక, మానసిక సమస్యలతో సతమ తమవుతున్నట్లు తెలుస్తుందని ఆయన తెలిపారు

# విద్యామంత్రిగా ఉండగా ఒక్క డిగ్రీకాలేజీ కూడా ఎందుకు రాలేదు?

## వందపడకల ఆస్పత్రి జిఒ ఇస్తే ఆపింది నీవుకాదా..?

## ఎమ్మెల్యే కడియంపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** రోజు రోజుకు రెండు నియోజకవర్గాలైన జనగామ - స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేల మధ్య మాటలయుద్ధ పెరిగిపోతుంది. ఈనేపథ్యంలోనే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని బస్టాండ్ వద్దగల ఓ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశానికి మాజీ ఎమ్మెల్యే రాజయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి శిష్యుడు కడియం శ్రీహరి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని, చుక్క నీరు తెచ్చిన మొఖమేనా నీది అని ప్రశ్నించారు. ఇరవై ఏళ్లు ఘన్‌పూర్ ప్రజలు కడియంను తిరస్కరించారని, తిరిగి మళ్లీ గులాబీ జెండాతోనే గెలిచాడన్నారు. మా కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గానికి వందపడకల ఆస్పత్రిని మంజూరు చేయించి జీవో ఇస్తే ఆపింది కడియం శ్రీహరి కాదా అని, రెండుసార్లు విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఒక్క డిగ్రీ కాలేజి ఎందుకు రాలేదని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. గులాబీ మాట నీ నోట ఎత్తినంత వరకు ప్రజలు నిన్ను చిత్తుగా ఓడించారని విమర్శించారు. ఒక్క ఎకరంకు ఒక్కకాలువకు ఒక్క చెరువుకు నీళ్లు తెచ్చిన మొఖమేనా నీదని అడుతున్నానని, టీడీపీ హయాంలో నీళ్ల చుక్కలేదు.. కాంగ్రెస్ హయాంలో నలభైవేల ఆయకట్టుకు ఇచ్చింది, కేసీఆర్ హయాంలో 5.25వేల ఎకరాల ఆయకట్టు నీరు ఇచ్చిందన్నారు. 119 నియోజక వర్గాలకంటే మేమే ఎక్కువగా తరలివస్తామన్న కార్యకర్తలకు ఈసందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# శృంగేరి పీఠం అనుమతులతోనే రాజన్న ఆలయ అభివృద్ధి

## ఆగమ, వాస్తు శాస్త్రాలకు విరుద్ధంగా ఎటువంటి పనులు చేయడం ఉండదు

## దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్



**వేములవాడ, ప్రభాతవార్త:** శృంగేరి పీఠం అనుమతులతోనే రాజన్న ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ తెలిపారు. గురువారం వేములవాడలో పర్యటించిన దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఆలయ పునఃనిర్మాణం సందర్భంగా చేపట్టనున్న పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ వేములవాడ ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణం పనులు చేపట్టేందుకు అవసరమైన టెండర్ ప్రక్రియ చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. వాస్తు ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, కాళ భైరవ స్వామి, దక్షిణామూర్తి, వీరభద్రస్వామి, ఆంజనేయ స్వామి, సూర్య భగవానుడు, జ్వాలా ముఖి వంటి 8 ఉప ఆలయాలపై తదుపరి పాటించాల్సిన మార్గం, శ్రీ రాజరాజేశ్వర స్వామి సేవలు, ఏకాంతంగా జరుగుతాయని, ఎటువంటి లోటు పాట్లు ఉండవని తెలుపుతూ అవసరమైన మార్గదర్శకాలు, అనుమతులను ఈ నెల 27వ తేదీన శృంగేరి పీఠం నుంచి పొందాలని అన్నారు. ఉప ఆలయాలకు ఎక్కడ కూడా అభివృద్ధి పనులలో భాగంగా మూల విగ్రహాలను కదపకుండా కాశి, జోగులాంబ దేవాలయ పరిధిలో ప్రతిపాదించిన మాదిరిగా ఎటువంటి దోషాలు లేకుండా మాత్రమే అభివృద్ధి అవుతుందని, శృంగేరి పీఠం నుంచి అనుమతులు పొంది, వారు సూచించిన మార్గాలను మాత్రమే అనుసరిస్తూ అభివృద్ధి పనులు జరుగుతాయని అన్నారు. ఆగమ, వాస్తు శాస్త్రాలకు విరుద్ధంగా ఎటువంటి పనులు చేయడం ఉండదని తెలిపారు. ప్రస్తుతం 76 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు భూసేకరణ పెండింగ్ లేదని తెలిపారు. ఆలయ నిర్మాణ పనుల మానిటరింగ్ కమిటీని జూన్ నెలలో ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ 27 నాడు శృంగేరి పీఠం మార్గదర్శకాల ప్రకారం అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఆలయ అభివృద్ధి పనులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. సమావేశంలో ధార్మిక సలహాదారులు గోవింద చారి, స్థపతి వల్లి నాయగం, ఆర్కిటెక్ సత్యనారాయణ, ఈఓ వినోద్, ఈఈ రాజేష్, డిఈ రఘునందన్, ఆర్అండ్‌బి సిఈ బిల్డింగ్స్ రాజేశ్వర్ రెడ్డి, సిఈ ఎలక్ట్రికల్ లింగారెడ్డి, ఎస్ఈ బి.లక్ష్మణ్, ఈఈ వెంకట రమణయ్య, ప్రధాన అర్చకులు ఉమేష్ శర్మ, ప్రధాన అర్చకులు నమిలికొండ రాజేశ్వర శర్మ, శరత్ శర్మ తదితరులున్నారు.

## కుక్కల దాడిలో గాయపడిన చిన్నారికి అండగా నిలిచిన సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 17:** వీధి కుక్కల దాడిలో గాయపడి కోమాలో ఉన్న నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నందికొండ మున్సిపల్ ప్రాంతానికి చెందిన చిన్నారి హారిక వైద్యానికి సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. సిఎం చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుక

# బిజెవైఎం వినూత్న నిరసన ప్రదర్శన




బిజెవైఎం కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** నేషనల్ హెరాల్డ్‌లో కేసులో అవినీతి అక్రమాలకు పాల్పడ్డ ఎఐసిసి నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను ఈడి చార్జి షీట్‌లో చేరి చ్చతే, దీన్ని వక్రీకరిస్తూ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆందోళ నలకు కౌంటర్‌గా బిజె వైఎం గురువారం ట్యాంక్ బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వ హించింది.

బిజె వైఎం ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో కార్య కర్తలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, రాబర్ట్ వాద్రా, ప్రియాంక గాంధీ ఖైదీ దుస్తుల వేష ధారణ లో ఉన్న ఫొటోలను వినూత్నంగా ప్రద ర్శించారు. కాంగ్రెస్ పార్టీకి, అగ్రనేతలకు వ్యతి రేకంగా కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ట్రాఫీక్‌కు పెద్దఎత్తున అంతరాయం ఏర్పడి, ఉద్రి క్తత పరిస్థితి వచ్చింది. దీంతో పోలీసులు కార్యకర్తలను బలవంతంగా అరెస్టు చేశారు. అరెస్టు సందర్భంగా కార్యకర్తలు, పోలీసుల మధ్య వాగ్వివాదం, తోక్కిసలాట జరిగింది. అంతకు ముందు బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ళ మహేందర్ మాట్లాడుతూ దేశంలోని ప్రజలను మధ్యపెట్టెందుకు కాంగ్రెస్ పార్టీ నిరసనలు తెలపడం సిగ్గు చేటని విమర్శించారు.

స్కాములు చేసిన దొంగలే పెద్ద మనుషులుగా సమాజంలో చెలామణి అవుతుంటే సమాజం సిగ్గుపడుతుం దన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గానికి చిత్తశుద్ధి ఉంటే తమ నిజాయితిని నిరూపించు కోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇడి రాజ్యాంగ బద్ధంగా తన పనిని చేసుకుపోతుంటే నిజాయితీపరులైన ఇడి అధికారులపై తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు.

11gnt.qxd:18-04pg7exHMNWJQE.qxd 18/04/25 12:52 AM Page 1



# మెట్రో రైలు రెండోదశ ప్రాజెక్టుకు రూ.11,693 కోట్లు రుణం

## అభివృద్ధి పనులకు నిధుల సమీకరణకు జైకాతో చర్చలు

## జైకా వైస్‌ప్రెసిడెంట్ షోహెయ్ హారాతో రేవంత్ బృందం సమావేశం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఏప్రిల్ 17:** రాష్ట్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు నిధులను సమీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం జైకాతో చర్చలు జరిపింది. జపాన్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సారధ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గురువారం జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ(జైకా) ఉన్నత యాజమాన్యంతో సమావేశమైంది. ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షోహేయ్ హరా, ఆ సంస్థ సీనియర్ మేనేజర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెట్రో రైలు రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానించే రేడియల్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు తగిన సాయం అందించాలని జైకాను కోరింది. పెట్టుబడిదారులను ఆకర్షించేలా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సానుకూల విధానాలు, ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా హైదరాబాద్ను అత్యంత ఆకర్షణీయమైన నగరంగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రి ఈ సమావేశంలో వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రూ.24,269 కోట్ల అంచనాలతో చేపట్టనున్న మెట్రో రైల్ రెండో దశ ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్రం తుది పరిశీలనలో ఉన్నాయని జైకా బృందానికి వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే వ్యయంలో 48 శాతం.. అంటే రూ.11,693 కోట్లు రుణం అందించి మద్దతు ఇవ్వాలని కోరారు. భారత ప్రభుత్వ విదేశీ రుణ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా పాటిస్తుందని చెప్పారు. మెట్రోతో పాటు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు, కొత్త రేడియల్ రోడ్లకు నిధులు సమకూర్చాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నగరాన్ని న్యూయార్క్, టోక్యో లాంటి ప్రపంచ నగరాలతో సమానంగా అభివృద్ధి చేయాలనే తన ఆలోచనలను ముఖ్యమంత్రి వారితో పంచుకున్నారు. జైకా, తెలంగాణతో ఎళ్లకేళ్లుగా సంబంధాలున్నాయని జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షోహేయ్ హరా అన్నారు. మెట్రో రైలు విస్తరణతో పాటు, అర్హతలున్న ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు జైకా నుంచి ఆర్థిక సాయం పొందేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు,ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, మెట్రో రైలు ఎండి ఎన్వీఎస్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, తెలంగాణకు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ హసన్ భాష

**గుంటూరు తూర్పు,ఏప్రిల్17,ప్రభాతవార్త :** నూతనంగా రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గా నియమితులైన హాజీ హసన్ బాషా గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు హజ్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీలో కష్టించి పనిచేసిన వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని




ఆయన చెప్పారు పార్టీలో సుదీర్ఘకాలంగా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేసిన తనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సముచిత స్థానం అప్పగించారని తన అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి తెలుగుదేశం ప్రభుత్వానికి కీర్తి ప్రతిష్టలు పెంచుతానని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఏటా హజ్ యాత్రకు ముస్లిం సోదరులు అత్యధిక



సంఖ్యలో వెళుతూ ఉంటారని వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకునేందుకు తమ వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. ముస్లింల పక్షపాతిగా పేరుందిన చంద్రబాబు నాయుడు భవిష్యత్తు కాలంలో ముస్లింల భవిష్యత్తుకు సువర్ణ అధ్యాయాన్ని లిఖిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఇతర పార్టీ నాయకులకు హాజీ హసన్ భాష కృతజ్ఞతలు తెలిపారు.

## తితిదేను స్వార్థ రాజకీయాలకు బలిచేశారు: యాగంటి

**మాచర్ల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** పవిత్రమైన తితిదేను తమ స్వార్థ రాజకీయాలకు బలిచేసి, ప్రశాంతమైన రాష్ట్రంలో విధ్వంస రచన చేయాలన్నదే జగన్ వైకాపా నేతల పన్నాగం అని తెదేపా సీనియర్ నాయకులు, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ఎక్కడో చనిపోయిన గోవుల ఫొటోలతో తితిదేని, హిందూధర్మాన్ని అన్యమతస్తుడైన భూమన కరుణాకరరెడ్డి బదనాం చేస్తున్నాడని, భూమనలో ఉన్న పళంగా తితిదే, గోవులపై వాత్సల్యం, ప్రేమ ఉప్పొంగాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో విద్వేషాలు రెచ్చగొట్టేందుకు గోమరణాలను రాజకీయం చేస్తున్నారని తెలిపారు. తిరుమల లడ్డూని మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు, ఓట్ల కోసం పంచి పెట్టినప్పుడు భూమనకు తితిదే ప్రతిష్ట గురుకురాలేదా అని అన్నారు. తిరుమల వెంకటేశుడు కేవలం నల్లరాయి, దాన్ని పెకిలించివేస్తే మాత్రం తప్పేమిటని తూలనాడిన భూమన నేడు జరదని దాన్ని జరిగినట్టుగా ప్రచారం చేస్తూ గోమరణాలతో లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైకాపా పాలనలో రథాలు తగులబడ్డా, విగ్రహాలు నరికివేయబడ్డా, ఆలయాలు కూల్చినా, ఆఖరికి సాధాసీదా గుడులు మొదలు ప్రసిద్ధ క్షేత్రాల్లో నిధులు సొంతపార్టీవారే స్వాహా చేశారన్నారు. భూమన కుటుంబం ఆచరించేది, విశ్వసించేది ఇతర మతం.



మరి అపనిందలు, అసత్య ప్రచారం తితిదేపై, హిందూధర్మంపై ఎందుకు భూమనా? అని ప్రశ్నించారు. అవినీతి, అక్రమార్జన కోసం చైర్మన్‌గా ఉన్నప్పుడు తితిదే సొమ్మును భూమన దారి మళ్లించలేదా? సాక్షాత్తు ఏడు కొండలను అయిదు కొండలుగా మార్చే కుట్రలకు తెరలేపింది భూమన కాదా? తాను చేసిన తప్పుల్ని, అపచారాల్ని కప్పిపుచ్చుకోవడానికి తన మనిషి హరినాథ్‌రెడ్డిపై ఉన్న అభిమానంఒనే భూమన పనిగట్టుకొని మరీ తిరుమలపై గోశాలపై విషం చిమ్ముతున్నాడనేది కాదనలేని సత్యం. తితిదే గోశాలలో 100 ఆవులు చనిపోయాయనే భూమన, వైకాపా నేతల ప్రచారమంతా అసత్యం. అభూత కల్పన. ఎక్కడో మరణించిన గోవుల ఫొటోలు తితిదే గోశాలవని నమ్మించేందుకు భూమన చేస్తున్న ప్రయత్నాలు చిన్న పిల్లల కుప్పిగంతుల్ని తలపిస్తున్నాయి నిన్నటి వరకు శవాలతో రాజకీయం చేసిన వైకాపా నేతలు, ఇప్పుడు పవిత్రమైన గోవుని వాడుకుంటున్నారు. పవిత్రమైన తితిదేని తమ స్వార్థ రాజకీయాలకు బలిచేసి, ప్రశాంతమైన రాష్ట్రంలో విధ్వంస రచన చేయాలన్నదే జగన్, వైకాపా నేతల పన్నాగం అని యాగంటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బెట్టింగ్ యాప్‌లో నష్టం.. విద్యార్థి బలవన్మరణం

**హైదరాబాద్ (అత్తాపూర్) ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** బెట్టింగ్ యాప్ భారిన పడి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అత్తాపూర్ రెడ్డిబస్తీలో చోటుచేసుకుంది. సిఐ నాగేశ్వర్‌రావు వివరాల ప్రకారం.. గద్వాల్ జిల్లాకు చెందిన పవన్ అత్తాపూర్‌లో రెడ్డి బస్తిలో నివాసం ఉంటూ మాసబ్ ట్యాంక్ జెఎన్‌టియులో ఎమ్ టెక్ చదువు తున్నాడు. ఈ క్రమంలో యాప్స్‌లో బెట్టింగ్‌కు పాల్పడిన పవన్ ఒకేసారి 1లక్ష పోగొట్టుకున్నాడు. తరవాత తన వద్ద ఉన్న ఐఫోన్, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను అమ్ముకొని బెట్టిం గ్‌కు పాల్పడ్డాడు. చదువు కోసం తల్లిదండ్రులు పంపిన డబ్బులను సైతం బెట్టింగ్‌యాప్‌లో పెట్టి మోసపోయాడు. చివరికి ఒక్క రూపాయి కూడా లాభం రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన విద్యార్థి పవన్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డడంతో కుటుంబసభ్యులు తీవ్రవిషాదంలో మునిగిపోయారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణ సంస్కృతి చాటేలా నిర్వహించాలి

### టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతి, చారిత్రక వైభవం చాటి చెప్పేలా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించాలిప్రపంచ సుందరి పోటీల నిర్వహణపై మంత్రి జూపల్లి సమీతెలంగాణ సంస్కృతి, చారిత్రక వైభవం చాటి చెప్పేలా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. గురువారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ప్రపంచ సుందరి పోటీల నిర్వహణపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. విశిష్ట సంస్కృతులకు కొలువైన తెలంగాణ వైభవం ఒక్క హైదారాబాద్ నగరంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల్లో నిక్షిప్తమై ఉందని, ఆయా ప్రాంతాలకు ప్రపంచ దేశాల సుందరీమణులను తీసుకెళ్లి వాటి గొప్పతనాన్ని వివరించాలని అన్నారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, ఆధ్మాత్మిక క్షేత్రాలు, చారిత్రక కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా అందాల పోటీలను సద్వినియోగం చేసుకోవాలని దిశానిర్ధేశం చేశారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించడం ద్వారా పర్యాటక రంగ అభివృద్ధి తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 20కి పైగా వేదికల్లో వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. వివిధ వేదికల్లో వేడుకలు నిర్వహిస్తున్నందున ఆయా ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని సుచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలను ఇందులో భాగాస్వాములను చేయాలన్నారు. ఈ సమీక్షలో పర్యాటక శాఖ సెక్రటరీ స్మితా సబర్వాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ జెండాగే హనుమంత్ కొండిబా, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ సోని బాలదేవి, యుజవన సర్వీసుల శాఖ డైరెక్టర్ వాసం వెంకటుశ్వర్లు, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు .

**టూరిజం స్టేక్‌హోల్డర్స్ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన మంత్రి**

ప్రపంచం ఎంత శరవేగంగా అభివృద్ధి చెందుతుంటే అంతే వేగంతో ఆతిథ్య, టూరిజం రంగాలు కూడా వృద్ధి చెందుతున్నాయని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

ఈ రంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. టూరిజం ప్లాజాలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథిమ్) ఆధ్వర్యంలో యూరోపియన్ యూనియన్ సహకారంతో నిథిమ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రాజెక్ట్ కు సంబంధించిన టూరిజం స్టేక్‌హోల్డర్స్ వర్క్‌షాప్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు జ్యోతి ప్రజ్వలన చేసిన లాంఛనంగాప్రారంభించారు. నిథిమ్ విద్యార్థులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. అనంతరం వెబ్ సైట్ ను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. యూరోపియన్ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి చొరవ తీసుకున్నందుకు డైరెక్టర్ జెండాగే హనుమంత్ కొండిబాను మంత్రి జూపల్లి అభినందించారు. ఈ సదర్భంగా లాట్వియా లోని విడ్జెమ్ యూనివర్శిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ ప్రొఫెసర్ అగిట, పోర్చుగల్ లోని ఇన్‌స్టిట్యూటో పాలిటెక్నికో డి సెటుబల్ ప్రొఫెసర్ దురాటే జారా బ్రాసిల్, పాండిచ్చేరి యూనివర్శిటీ ప్రొఫెసర్ సంపద కుమార్ స్వైన్, సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కర్ణాటక అసోసియేట్ ప్రొఫెసర్,హెడ్ డాక్టర్ జి. మహేందర్, ఇతర కన్సార్టియం సభ్యులను మంత్రి జూపల్లి కృష్ణారావు సన్మానించారు.

# అకాల వర్షాలతో ఆగమాగం

### నీటి పాలైన యాసంగి పంటలు

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** ఆరుగాలం శ్రమించిన అన్నదాతలకు అకాల వర్షం కన్నీళ్లు తెప్పించింది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కామారెడ్డి జిల్లాల్లో దెబ్బతిన్న పంటలతో రైతులు తల్లడిల్లిపోయారు. కల్లాల్లోని ధాన్యం, మిర్చి, మక్కలు వరదపాలు కాగా, పలు జిల్లాల్లో వరి, మక్క పంటలు, మామిడి కాయలు నేల వాలిపోయాయి. మరోపక్క ఈదురుగాలులకు కల్లాల్లోని పరదాలు చెల్లాచెదురుకావడంతో చేతికందివచ్చిన పంట నీటిపాలైంది. ప్రధానంగా కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మిర్చి, మొక్కజొన్న తడిసిపోయాయి. ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో కాంటాలకు సిద్ధంగా ఉన్న ధాన్యంపై అడుగు మేర నీళ్లు చేరడంతో అన్నదాతలు ఆ నీళ్లను బకెట్లతో ఎత్తిపోశారు. అర్ధరాత్రి కావడంతో ఎక్కువమంది రైతులు ఆరబెట్టిన ప్రదేశాలకు చేరుకోలేకపోయారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం, ఖమ్మం రూరల్, ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యంతో పాటు మొక్కజొన్న పంటలు పూర్తిగా తడిసిపోయాయి. కల్లూరు మండలంలో పొలాల్లో వరి పంట నేలమట్టమైంది. ఖమ్మం మార్కెట్‌లో యార్డులో మిర్చి బస్తాలు తడిశాయి. వైరాలో అత్యధికంగా 3.4 సెంమీ వర్షపాతం నమోదైంది. భద్రాద్రి జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షం కురవడంతో పంటలకు నష్టం వాటిల్లింది. మహబూబాబాద్ మండలంలో ఓ మోస్తరు వాన పడింది. నర్సింహులపేట మండలంలో 150 ఎకరాల్లో వరిపంట నేలవాలి వడ్లు రాలిపోయాయి. ఉమ్మడివరంగల్ జిల్లా మామిడి రైతులను అకాల వర్షాలు కోలుకోలేని దెబ్బ తీశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చాలా చోట్ల మామిడికాయలు రాలిపోయాయి. పంట చేతికొచ్చే సమయంలో కాయలన్నీ నేలరాలడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా వందల ఎకరాల్లో మామిడికాయలు నేలరాలగా అధికారులు పంట నష్టంపై వివరాలు సేకరించే పనిలో పడ్డారు.

# పుప్పాలగూడలో 450 ఎకరాల్లో ఐటి నాలెడ్జ్ హబ్

### ప్రభుత్వ లక్ష్యం 5 లక్షల మందికి ఉపాధి

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 17:** పుప్పాలగూడ పరిసరాల్లో సుమారు 450 ఎకరాల్లో మొదటి దశలో ఐటి నాలెడ్జ్ హబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, పరిశ్రమల, రెవెన్యూ శాఖ కీలక అధికారులతో వారు సమావేశం నిర్వహించారు. పుప్పాలగూడ పరిసరాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్ అధికారుల కోసం ప్రభుత్వం గతంలో స్థలాలు కేటాయించింది. వీరితోపాటు రెవిన్యూ అధికారులు, స్పెషల్ పోలీస్ మ్యూచువల్ కో ఆపరేటివ్ సొసైటీ తదితర సొసైటీలకు సుమారు 200 ఎకరాలకు పైచిలుకు భూమిని ప్రభుత్వం కేటాయించింది. పుప్పాలగూడ పరిధిలో సొసైటీలకు కేటాయించిన భూములను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధికారులు సబ్ కమిటీ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ భూమికి పక్కనే ఇండస్ట్రియల్ కార్పొరేషన్ కు సంబంధించిన సుమారు 250 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లుగా అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం గా మొదటి దశలో ఐటి నాలెడ్జ్ హబ్ అభివృద్ధికి సుమారు 450 ఎకరాలు అందుబాటులో ఉంది అని చెప్పారు. మొదటి దశలో ఏర్పాటు చేయబోతున్న ఐటీ హబ్ ద్వారా ఐదు లక్షల మంది యువతకు ఉపాధి లభిస్తుందని అధికారులు మంత్రుల బృందానికి సూచించారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హయాంలో హైటెక్ సిటీకి శంకుస్థాపన జరిగింది, ఆ తర్వాత నాలెడ్జ్ హబ్ ఏర్పాటయింది, ఆ తర్వాత ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ రూపు దిద్దుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగాల్లో వచ్చిన ప్రతి మార్పులో హైదరాబాద్ భాగస్వామి అయిందని, ఇప్పుడు కూడా ఐటీ రంగంలో ఎఐ టెక్నాలజీలో వేగంగా వస్తున్న మార్పును హైదరాబాద్ అందిపుచ్చుకోవాలని మంత్రుల సబ్ కమిటీ నిర్ణయించింది. హైదరాబాద్ ఆర్థిక అభివృద్ధిలో సుస్థిర స్థానాన్ని ఇప్పటికే సాధించింది, హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకోవడం సాధ్యం కాదని ఆర్థికవేత్తలు స్పష్టం చేసిన విషయాన్ని మంత్రులు చర్చించారు. అభివృద్ధిని కొనసాగించే క్రమంలో పుప్పాలగూడలో 450 ఎకరాల్లో నాలెడ్జ్ హబ్ అభివృద్ధి చేస్తూ దశాబ్దాలుగా కొనసాగుతున్న హైదరాబాద్ ప్రగతిని వేగవంతం చేయాలని నిర్ణయించారు.

# 26.7 కేజీల గంజాయి పట్టివేత

### రెండు కేసుల్లో ఇద్దరి అరెస్టు

### తొమ్మిది మందిపై కేసు నమోదు

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** ధూల్‌పేట్‌లో గంజాయి అమ్మకాలకు అక్ర మంగా దిగుమతి చేసుకున్న 25.230 కేజీల గంజాయిని ఎస్‌టిఎఫ్ బృందం పట్టుకుంది. ఇదే టీమ్ మరో 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుంది. తాము పట్టుకున్న మొత్తం 26.7 కేజీల గంజాయి విలువ రూ.13.50 లక్షలు ఉంటుందని అంచనా వేసినట్లు టీంలీడర్ అంజిరెడ్డి తెలిపారు. ధూలపేటలో రాణి అవంతిబాయ్ విగ్రహం సమీ పంలో ఒరిస్సా నుంచి దిగుమతి చేసుకున్న గంజాయిని తీసువెళుతున్న అకాష్‌సింగ్‌ను ఎస్‌టిఎఫ్ ఏ టీమ్ సిబ్బంది పట్టుకుని ఆ వ్యక్తిని, గంజాయిను ధూలపేట్‌లో అప్పగించినట్లు తెలిపారు. కేసుతో సంబంధం ఉన్న లఖన్‌సింగ్, సం జయ్‌సింగ్, జ్యోతి బాయ్, అనంద్‌సింగ్, మణిష్‌సింగ్, దీప, నిరంజన్ కుమార్‌లపై కూడ కేసు నమోదు చేసినట్లు అంజిరెడ్డి తెలిపారు. జియాగూడ పీలాకాశీ శివ మందిర్ సమీనంలో గంజాయిని అమ్మకాలు జరుపుతున్న భద్రి నారాయణ్‌సింగ్‌ను ఎస్‌టిఎఫ్ ఏ టీమ్ పట్టు కున్నారు. నిందితుడి వద్ద ఉన్న 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బంగ్లా వాలా అజయ్‌సింగ్, మంజు దేవి లకు సంబం ధం ఉండడంతో వారిపై కూడ కేసునమోదు చేసినట్లు తెలిపారు.

**ఎక్సైజ్ ఎస్ఐ బానాల మురళీకృష్ణకు క్యాష్ అవార్డు**

భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేసిన సమయంలో పట్టుకున్న గంజాయి కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల శిక్షతో పాటు రూ. 20 వేల జరిమాన పడే విధంగా కేసు రాసిన బానాల మురళీ కృష్ణకు గురువారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి చేతు లమీదుగా క్యాష్ అవార్డును అందించారు. ప్రస్తుతం ఊట్నూర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా మురళీ కృష్ణ పనిచేస్తున్న ఆయన 2023 భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లో పని చేసిన సమయంలో 28 కేజీల గంజాయిని రవాణ చేస్తు న్న వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ నిందితుడికి శిక్షపడేలా కేసును, సాక్షులను ప్రవేశపెట్టడంలో కీలకపాత్ర వహించిన మురళీకృష్ణకు అబ్కారీ భవన్ ప్రధాన కార్యాలయంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ చాంబరులో క్యాష్ అవార్డును అందించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి తదితరులు ఉన్నారు.

## దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

మాచర్లటౌన్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): నియోజకవర్గ దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మరోసారి చంద్రబాబు రుజువు చేశారని ఎస్సీ ఉపవర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల నియోజకవర్గ తెదేపా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మాచర్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రాజీవ్ రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, దానిపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై కేబినెట్ చర్చించి, వీటి ప్రకారం 200 పాయింట్ల రోస్టర్ అమలుకు నిర్ణయించిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఎస్సీ వర్గీకరణ వివాదం మొదలైందని, మాల, మాదిగ సహా 59 కులాలు, ఉపకులాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డ్ కులాలుగా గుర్తించారన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ జనాభా 1,38,78,078 మంది. వీరిలో మాదిగలు 67,02,609 కాగా, మాలలు 55,70,244. మాదిగల జనాభా మాలలకంటే 11,32,365 మంది ఎక్కువ అని అన్నారు. 1997లో ఏబీసీడీ గా వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వర్గీకరణ ఉద్యమం ఉప్పెనలా సాగరడంతో షెడ్యూల్డ్ కులాల మధ్య నెలకొన్న సామాజిక అసమానతలు అధ్యయనం చేసేందుకు 1996 సెప్టెంబరు 10న రామచంద్రరాజు కమిషన్‌ను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. 1997లో ఉమ్మడి ఆంధ్రప్రదేశన అసెంబ్లీలో ఈ డిమాండ్‌కు అనుకూలంగా తీర్మానం చేశారన్నారు. 1997 జూన్ 6న ప్రభుత్వం జీవో ద్వారా షెడ్యూల్డ్ కులాల కోటాను వర్గీకరించింది. ఈ జీవో ప్రకారం ఎస్సీలను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా వర్గీకరించాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ కింద గ్రూప్-1లో 12 ఉపకులాలకు 1 శాతం, గ్రూప్-2లో 18 ఉపకులాలకు 6.5 శాతం, గ్రూప్-3లో 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా ఆమోదంతో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఎ-గ్రూపులో రెల్లి సహా 12 కులాలు, బి- గ్రూపులో మాది సంబంధిత 18 కులాలు, సి-గ్రూపులో మాల కులస్థులతోపాటు మరో 24 కులాలు, డి-గ్రూపులో ఆదిఆంధ్ర కులాలను చేర్చారని, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని ధర్మాసనం తుది తీర్పు ఇచ్చిందన్నారు. కేబినెట్ ఆమోదంతో ఎస్సీలందరూ కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్సీ కార్పరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల దాస్, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి బొల్లెద్దుల ప్రకాష్‌బాబు, జిల్లా తెదేపా ఎస్సీ సెల్ సోషల్ మీడియా అధ్యక్షులు కలివెల మరియదాసు, ఎస్సీ సెల్ కార్యదర్శి ఆదిరాల ప్రసాద్, అయిదు మండలాల ఎస్సీ సెల్ అధ్యక్షులు తదితర మాల, మాదిగ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఈ-వేస్ట్ సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు

### -కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్17,ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 19న స్వర్ణాంధ్ర - స్వచ్చాంధ్రలో భాగంగా ఈవేస్ట్ సేకరణపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో నగరంలో జీఎంసి తీసుకుంటున్న చర్యలు, ప్రజలా సహకారం, భాగస్వామ్యంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి నెలా 3వ శనివారం ప్రత్యేక అంశాల ప్రాతిపదిన చేపట్టే స్వర్ణాంధ్ర - స్వచ్చాంధ్రలో భాగంగా ఈ శనివారం ఈవేస్ట్ నిర్వహణపై చేపట్టనున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ఈవేస్ట్ సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, ఈవేస్ట్ అందించే ప్రజలు తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు. సిఆర్డీఏ చేపట్టిన ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్3 విస్తరణ పనుల్లో భాగంగా స్వర్ణభారతి నగర్ లో ప్రభావితమయ్యే



ఆక్రమణదారుల్లో అర్హులకు ప్రభుత్వం నుండి ఇప్పటికే ఇంటి పట్టాలు అందాయని, అనర్హులకు అందవ్వని తెలిపారు. విస్తరణలో నష్టం జరిగే ఇళ్లకు చట్ట ప్రకారం నష్ట పరిహారం అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిలు ఏక మొత్తంగా చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ, ఈ ఏడాది పన్ను అంతా ఒకేసారి చెల్లిస్తే మొత్తం పన్నుపై 5 శాతం రాయితీ గడువు ఈ నెలాఖరు వరకే ఉన్నందున నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీర్ఘకాలంగా పన్ను చెల్లించని వారిపై ఆర్‌ఆర్ యాక్ట్ ప్రకారం చర్యలుకు యాక్షన్ ప్లాన్ సిద్దం చేస్తున్నామని, అనధికార మీడియా డివైస్ డిస్ప్లే బోర్డ్ లను స్వచ్చందంగా తొలగించుకోకుంటే జీఎంసినే తొలగిస్తుందని స్పష్టం చేశారు. అనధికార లే అవుట్స్ ని ఉపేక్షించబోమని, ఇప్పటికే కొన్ని తొలగించామని, తిరిగి కొందరు ఏర్పాటు చేస్తున్నారని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరంలోని ప్రతి కమర్షియల్ సంస్థ జీఎంసి నుండి డి ఓ ట్రేడ్ లైసెన్స్ కల్గి ఉండాలి, లేని వాటిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి అపరాధ రుసుం లేదా సీజ్ చేస్తామని తెలిపారు. అన్ అసెస్మెంట్, అండర్ అసెస్మెంట్ లను సచివాలయాల వారీగా ప్రత్యేక బృందాల ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటామని, అనధికార ట్యాప్ కనెక్షన్ లు కల్గి ఉండడం చట్టరీత్యా నేరం, వారిపై చర్యలు తప్పవన్నారు. జీఎంసి నుండి తీసుకున్న నిర్దేశిత ప్లాన్ కి భిన్నంగా నిర్మాణాలు చేపట్టేవారి నిర్మాణాలు నిలిపి వేయడం, ప్లాన్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి, వచ్చే నెల నుండి పటిష్టంగా నిషేధం అమలు చేస్తామన్నారు. వీధి వ్యాపారులు తప్పనిసరిగా ఫుట్ పాత్ కి వెనుకనే పెట్టుకోవాలని, త్వరలో రెండో వెండింగ్ జోన్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రోడ్ల పక్కన అనధికార వాహనాల పార్కింగ్ నిషేధమని, ఇక నుండి అటువంటి వాహనాలను జీఎంసి సిబ్బంది తొలగిస్తారన్నారు. ఖాళీ స్థల యజమానులకు నోటీసులు ఇస్తున్నామని, స్పందించని వారి స్థలాలను జీఎంసి స్వాధీనం చేసుకుంటాన్నారు. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను సోమవారం నుండి పునః ప్రారంభంకు చర్యలు తీసుకుంటామని, సుప్రీం కోర్ట్ మార్గదర్శకాల మేరకు తగిన జాగ్రత్తలతో ఆపరేషన్లు జరిగేలా చూస్తామన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ ప్రజా ప్రతినిధులు, ప్రజలు భాగస్వామ్యంతో మరింత అభివృద్ధి పథంలో క్లీన్, గ్రీన్ గుంటూరుగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.

## మున్నేరులో మునిగి ఇద్దరు మృతి

**క్రైమ్ ఖమ్మం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** ఇంట్లో కుటుంబసభ్యులకు క్రికెట్ ఆడటానికి చెప్పి బయలుదేరివెళ్లారు, ఈత రాకపోయినా ఇద్దరు సాహసించి ఈ ప్రమాదాన్ని తెచ్చుకున్నారు. మున్నేరు బ్రిడ్జి సమీపంలో ఈత నేర్చుకోవడానికి నీటిలోకి దిగారు. వెరసి నీటిలో కాలుజారిపడి కొట్టుకుపోయి మృతి చెం దారు. ఈ సంఘటన ఖమ్మం జిల్లా కానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్ పరిధి గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రడం భాను ప్రకాష్ కథనం ప్రకారం.. ఉదయం 6:30 గంటలకు ఖమ్మం నగరం గుట్టలబజారు చెందిన విద్యార్థి, గాంధీచౌక్ సాయిబాబాగుడి ప్రాంతానికి చెందిన మరో విద్యార్థి ఇద్దరు స్నేహి తులు. వీరిద్దరూ దానవాయిగూడెం మున్నేరు బ్రిడ్జి సమీపంలో ఈత నేర్చు కోవడానికి నీటిలో దిగారు. గుట్టలబజార్ నివాసి కూచిపూడి బిన్విత్ (16) గాంధీ చౌకు చెందిన అన్నం కిరణ్‌తేజ (16) ఈ ప్రమాదంలో మృతి చెందారు. వేసవి సెలవులు కావడంతో సరదాగా క్రికెట్ ఆడుకుంటామని చెప్పి వెళ్లిన విద్యార్థులు తిరిగి ఇంటికి రాకపోవడంతో ఇరువురు కుటుంబాలలో విషాద ఛాయలు చోటుచేసుకున్నాయి. మృతులిద్దరి తండ్రులు సుబ్బారావు, ముద్దు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నీట మునిగిన మృతదేహాలను బయటకుతీసి శవ పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం వారిద్దరు మృతదేహాలను మృతుల బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

18-4pg10exBWT.qxd:18-4pg10exBWT.qxd 18/04/25 11:45 PM Page 1





### మహిళల గ్రాండ్‌ప్రీలో

## హంపి, హారిక తొలి విజయం



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ చెస్ సమాఖ్య మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె చెస్ టోర్నమెంట్‌లో మూడో రోజు భారత్ స్టార్ గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక సత్తా చాటారు. వీరిద్దరూ ఈ టోర్నీలో తొలి విజయాన్ని అందుకున్నారు. పూణేలో జరిగిన మూడో రౌండ్ గేముల్లో ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్ హంపి తెల్ల పావులతో ఆడుతూ 53 ఎత్తుల్లో ప్రపంచ జూనియర్ ఛాంపియన్, భారత్‌కు చెందిన రైజింగ్ స్టార్ దివ్య దేశ్‌ముఖ్‌ను ఓడించింది. తొలి రెండు రౌండ్ గేముల్లో నెగ్గిన దివ్యకు ఇది తొలి ఓటమి కావడం గమనార్హం. మరో గేమ్‌లో హైదరాబాద్‌కు చెందిన హారక 68 ఎత్తుల్లో బల్గేరియాకు చెందిన నుర్గుల్ సలీమోవాపై గెలిచి ఈ టోర్నీలో తొలి గెలుపు రుచి చూసింది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్ మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు రెండో డ్రా నమోదు చేసుకుంది. ఇక రష్యాకు చెందిన సొలీనా షువలోవాతో జరిగిన మూడో రౌండ్ గేమ్‌ను వైశాలి63 ఎత్తుల్లో డ్రా గా ముగించింది. మరోవైపు మంగోలియాకు చెందిన బత్ఖుయాగ్ మున్‌గున్‌తుల్ 34 ఎత్తుల్లో పోలాండ్‌కు చెందిన అలీనా ష్లిన్‌స్కాయాపై గెలుపొందగా, చైనాకు చెందిన జు జినెర్-జార్జియాకు చెందిన మెలియా సలోమ మధ్య గేమ్ 76 ఎత్తుల్లో డ్రా గా ముగిసింది.



### టేబుల్ టెన్నిస్ ప్రపంచ కప్‌లో

## మనిక, శ్రీజ నిష్క్రమణ



**న్యూఢిల్లీ:న** ఐటీటీఎఫ్ ప్రపంచకప్‌లో భారత స్టార్ ప్యాడ్లర్లు ఆకుల శ్రీజ, మనికా బాత్రా పోరాటం ముగిసింది. తొలి రౌండ్‌లో అలవోక విజయాలు సాధించిన ఈ ఇద్దరూ రెండో మ్యాచ్‌లో మాత్రం చేతులెత్తేయడంతో భారత్‌కు నిరాశే ఎదురైంది. గ్రూప్ స్టేజ్‌లో భాగంగా మహిళల సింగిల్స్ రెండో మ్యాచ్‌లో శ్రీజ 0-4తో రోమేనియాకు చెందిన ప్రపంచ 13వ ర్యాంకర్ బెర్నడెట్టె చేతిలో చిత్తుగా ఓడింది. మరో పోరులో మనికా1-3తో బ్రున టకహాషి (బ్రెజిల్)కి తలవంచింది. మనికా, శ్రీజ ఓటములతో ఈ టోర్నీలో భారత పోరాటం కూడా ముగిసినట్టైంది. మానికా బాత్రా, తమ గ్రూప్ 16 మ్యాచ్‌లో ప్రపంచ 24వ ర్యాంకర్ బ్రెజిల్‌కు చెందిన బ్రూనా తకాహషి చేతిలో 3-1 (13-11, 11-8, 11-4, 10-12) తేడాతో ఓడిపోయింది. 2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల మొదటి రౌండ్‌లో ఇద్దరు ఆటగాళ్ల గతంలో తలపడిన ఏకైక మ్యాచ్‌లో తకాహషి 4-3 తేడాతో భారత టేబుల్ టెన్నిస్ ఆటగాడిని ఓడించాడు. ఇక ప్రపంచ 35వ ర్యాంకర్ మరియు కామన్వెల్త్ గేమ్స్ మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ పతక విజేత శ్రీజా అకుల గ్రూప్ 9లో రొమేనియాకు చెందిన బెర్నాడెట్ స్జోక్స్ చేతిలో 4-0 (11-8, 11-6, 11-9, 11-8) తేడాతో ఓడిపోయింది.

## క్వార్టర్స్‌లోకి బోపన్న, బెన్ జోడీ




**న్యూఢిల్లీ:** ఏటీపీ500 ఈవెంట్ అయిన బెవెరియన్ ఇంటర్నేషనల్ టెన్నిస్ టోర్నీలో భారత ఆటగాడు రోహన్ బోపన్న, బెన్ షెల్టన్ (అమెరికా) జోడీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. సోమవారం రాత్రి జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఈ ఇండోఅమెరికన్ ద్వయం 6-4, 6-3తో జెమీ ముర్రే (ఇంగ్లండ్)రాజీవ్ రామ్ (అమెరికా)ను ఓడించింది. ఇదే టోర్నీలో మరో భారత ఆటగాడు యుకీ బాంబ్రీ తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టాడు. ఈ మ్యాచ్‌లో రోహన్ మరియు షెల్టాన్ ద్వయం అద్భుతమైన సర్వింగ్ గేమ్‌ప్లేను ప్రదర్శించారు, ఏడు ఏస్‌లను సంధించారు, ఇది వారి ప్రత్యర్థుల కంటే 6 ఎక్కువ, మరియు మొదటి సర్వ్‌లో 84 అద్భుతమైన ఖచ్చితత్వాన్ని కలిగి ఉంది. రెండు జంటలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో మ్యాచ్ ఘనంగా ప్రారంభమైంది, మరియు ప్రారంభ సెట్ టైబ్రేకర్ వైపు వెళుతోంది, కానీ ఆ తర్వాత సెట్ యొక్క చివరి గేమ్‌లో రాజీవ్‌జామీ తమ సర్వీస్‌ను వదులుకోవడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. తొలిసెట్‌గెలిచిన తర్వాత ఇండోఅమెరికన్ జంట ఆత్మవిశ్వాసంతో ఉప్పొంగిపోయింది, రెండవ సెట్‌లో తొలి బ్రేక్‌తో దాన్ని రెట్టింపు చేసింది మరియు బ్రిటిష్అమెరికన్ జంటకు చాలా బాగా కనిపించింది. అయితే, వారు తర్వాతి గేమ్‌లోనే మ్యాచ్‌లో తొలి బ్రేక్‌ను కోల్పోవడం ద్వారా చిన్న ఎదురుదెబ్బ తగిలింది, కానీ ఆరో గేమ్‌లో బ్రేక్ ఇచ్చి వరుస సెట్లలో మ్యాచ్‌ను ముగించడంతో బలంగా పుంజుకుని మళ్లీ ఆధిక్యాన్ని సంపాదించింది.




## ఈ ప్లేయర్స్‌కు జాక్‌పాట్

### వరించిన ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్

### వెటరన్స్‌కు ప్రాణం పోసిన ఐపిఎల్

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2025 ఆటగాళ్లకు ఒక వరంలా మారింది. ఈ ఐపీఎల్ కొందరు వెటరన్ ప్లేయర్స్‌కి ప్రాణం పోసింది. గత కొన్నేళ్ళుగా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు నోచుకోని ఆటగాళ్లు ఇప్పుడు పోటీ పడుతున్నారు. అందుకు గాను ఇప్పుడు అద్భుత ఆటతో మ్యాచ్ విన్నింగ్ పెర్ఫార్మన్స్ ఇస్తున్నారు. ఎన్నేళ్ల నుంచి ఎదురుచూస్తున్న వారి నిరీక్షణ ఇప్పటికి సఫలీకృతం అయింది.

ఈ నేపథ్యంలో ఏడుగురు ప్లేయర్స్ జీరో నుంచి హీరోగా అయ్యారు. క్రికెట్ హిస్టరీలో మహేంద్ర సింగ్ ధోని, కర్ణ్ శర్మ, జోఫ్రా ఆర్చర్, నితీష్ రాణా, శ్రేయాస్ అయ్యర్, క్వింటన్ డికాక్, యుజ్వేంద్ర చాహల్ జట్లు విజయాల్లో కీలక పాత్ర పోషించి వరుసగా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు దక్కించుకున్నారు. ప్రస్తుత ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున ఆడుతోన్న కర్ణ్ శర్మ సుమారు 8 సంవత్సరాల తర్వాత ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు. అతడు చివరిసారిగా ఐపీఎల్ 2017లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సాధించాడు. కర్ణ్‌తో పాటు ఈ ఊపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న జోఫ్రా ఆర్చర్ కూడా 7 సంవత్సరాల తర్వాత ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకున్నాడు. అటు జోఫ్రా ఆర్చర్ గాయం కారణంగా 23 సీజన్లలో ఐపీఎల్ ఆడలేదు. రాజస్థాన్ రాయల్స్‌కు చెందిన నితీష్ రాణా 4 సంవత్సరాల తర్వాత ఈ సీజనులో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకున్నాడు. అతను చివరిసారిగా కేకేఆర్ తరపున ఆడినప్పుడు ఈ అవార్డును సాధించాడు. మహేంద్ర సింగ్ ధోని ఐపీఎల్ 2025లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచుకున్నాడు.

అంతకముందు 2019 తర్వాత తొలిసారిగా ధోని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సాధించాడు. డికాక్ మాదిరిగానే మూడు సంవత్సరాల తర్వాత పంజాబ్ కింగ్స్ బౌలర్ యుజ్వేంద్ర చాహల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకున్నాడు. అలాగే 4 సంవత్సరాల తర్వాత ఐపీఎల్ 2025లో శ్రేయాస్ అయ్యర్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు ఇక కోల్‌కతా నైట్ రైడర్స్‌కు చెందిన క్వింటన్ డికాక్‌కు కూడా 3 సంవత్సరాల తర్వాత ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది.

### వరల్డ్ కప్ టోర్నీలో అదరగొట్టిన

## షూటర్ సురుచి

### 24 గంటల వ్యవధిలో రెండు స్వర్ణాలు

### కాంస్యంతో సరిపెట్టిన మనూ



**న్యూఢిల్లీ:** అర్జెంటీనాలో గత వారం అదరగొట్టిన భారత్ టీనేజ్ పిస్టర్ షూటర్ సురుచి ఇందర్ సింగ్ అదే జోరును పెరూలో పునరావృతం చేసింది. అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య ప్రపంచ కప్ రెండో టోర్నమెంట్ మహిళా విభాగంలో హరియాణకు చెందిన 18 ఏళ్ల సురుచి 24 గంటల వ్యవధిలో రెండు స్వర్ణ పతకాలతో మెరిసింది.. భారత్ కాలమానం ప్రకారం అర్ధరాత్రి దాటాక జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో సురుచి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో సురుచి 243.6 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకాన్ని దక్కించుకుంది. సురుచి ధాటికి గత ఏడాది పారిస్ ఒలింపిక్‌సలో రెండు కాంస్య పతకాలు నెగ్గిన భారత్ స్టార్ మనూ భాకర్ రజత పతకంతో సంతృప్తిపడింది. మనూ భాకర్ 243.3 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. 34 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో సురుచ 582 పాయింట్లతో రెండో స్థానంలో, మనూ భాకర్ 578 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించారు. తాజాగా జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లోనూ సురుచి గురి లక్ష్యాన్ని అందుకుంది. ఈ ఈవెంట్ ఫైనల్లో సురుచి-సౌరభ్‌చౌదర ద్వయం విజేతగా నిలిచి పసిడి పతకాన్ని సాధించింది. ఫైనల్లో సురుచి-సౌరభ్ జోడీ 17-9తో చైనాకు చెందిన కయాన్ జున్ యావో-కాయ్ హు జంటను ఓడించింది. కాంస్య పతక మ్యాచ్‌లో మనూ భాకర్-రవీందర్ సింగ్ జోడీ 6-16తో చైనా ద్వయం కియాన్‌కె మా-యిఫాన్ జాంగ్ ద్వయం చేతిలో పరాజయం పాలైంది.

## టారిఫ్‌లతో తీవ్ర పరిణామాలే...యుఎస్ ఫెడ్ రిజర్వ్ చైర్మన్ సీరియస్

**వాషింగ్టన్, ఏప్రిల్ 17:** రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరలేపిన విషయం విదితమే. భారత్, చైనా సహా ప్రపంచవ్యాప్తంగా 70కిపైగా దేశాలపై ప్రతీకార సుంకాలు విధించారు. ట్రంప్ నిర్ణయంతో అమెరికా కంపెనీలు, పరిశ్రమలపై పెను ప్రభావం చూపుతోంది. దీంతో ట్రంప్ ఆర్థిక విధానాలపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ విషయంలో ఇప్పటికే అమెరికాలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగిన కాలిఫోర్నియా, ట్రంప్ యంత్రాంగంపై న్యాయ పోరాటానికి దిగిన విషయం విదితమే. తాజాగా సెంట్రల్ బ్యాంకు ఫెడ్ చైర్మన్ జోరోమ్ పావెల్ కూడా ట్రంప్ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ యంత్రాంగం ఇప్పటి వరకూ ప్రకటించిన సుంకాలు, ఊహించిన దానికంటే ఎక్కువ అని వ్యాఖ్యానించారు. వీటి గురించి ఎలా ఆలోచించాలో కూడా అర్థం కావట్లేదన్నారు. ట్రంప్ టారిఫ్ విధానాలతో అమెరికాలో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. సుంకాల పెంపుతో ద్రవ్యోల్బణం తారాస్థాయికి చేరకుంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. ట్రంప్‌పాలనలో విధానపరమైన మార్పులు ఫెడరల్ రిజర్వ్ సిస్టమ్‌ను ముంచేశాయని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. టారిఫ్‌ల వల్ల నెలకొన్న అనిశ్చితి ఆర్థిక వ్యవస్థకు శాశ్వత నష్టాన్ని కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.




## అమ్మకాల్లో ఐఫోన్స్ టాప్ రికార్డ్..

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** ఐ ఫోన ఎగుమతుల్లో 25వ త్రైమాసికంలో 3 మిలియన్ యూనిట్లను అధిగమించి ఆపిల్ కంపెనీ భారత దేశంలో అతిపెద్ద మొదటి త్రైమాసిక షిప్‌మెంట్‌లను నమోదు చేసిందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. అలాగే నో కాస్ట్ ఈఎంఐలు, క్యాష్‌బ్యాక్, ఈటైలర్ డిస్కౌంట్‌లు వంటి కారణాల వల్ల రెండంకెల వృద్ధిని ప్రోత్సహించాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. విస్తృత డిస్కౌంట్లు, ధరల కోతల వల్ల ఈ త్రైమాసికంలో భారతీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ మధ్యలో సింగిల్ డిజిట్ కుదించే అవకాశం ఉన్నప్పటికీ ఈ మైలు రాయిను ఆపిల్ సాధించింది. బడ్జెట్ అనుకూలమైన ఐఫోన్ 16ఈతో సహా కొత్తగా ప్రారంభించిన ఐఫోన్ 16 సిరీస్ అమ్మకాల పెరుగుదలకు కారణమవుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే ఎగుమతుల్లో కూడా సగానికి పైగా వీటి వాటా ఉందని చెబుతున్నారు. 2024 నుంచి భారతదేశంలో ఐఫోన్ మార్కెట్ వృద్ధి కొనసాగు తుంది. ఆ సమయంలో ఐఫోన్ 15, 13 మోడల్స్ అమ్మకాలు వేగంగా సాగాయి. అయితే ఐడీసీ ఇంకా పూర్తి డేటాను విడుదల చేయనప్పటికీ జనవరి, ఫిబ్రవరి నెలల గణాంకాలు సంవత్సరానికి



8.1 శాతం తగ్గుదలని సూచిస్తున్నాయి. ముఖ్యంగా డిస్కౌంట్లు ప్రకటించినా వినియోగదారులు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే భారతదేశంలోని అగ్రశ్రేణి స్మార్ట్‌ఫోన్ బ్రాండ్లు వివో, శామ్‌సంగ్ వరుసగా 2.7 శాతం, 19.5 శాతం తగ్గుదలలను చవిచూశాయి. అయితే అనూహ్యంగా ఒప్పో, రియల్‌మీ వరుసగా 14.3 శాతం, 5.3 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ప్రస్తుతం యాపిల్ మార్కెట్ వాటా పరంగా నాలుగో స్థానంలో ఉంది. అలాగే 36.1 శాతంతో అత్యంత వేగవంతమైన వృద్ధిని నమోదు చేసింది. 2024లో భారతదేశం ఆపిల్‌కు ప్రపంచవ్యాప్తంగా నాలుగో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించింది. అమెరికా, చైనా, జపాన్ తర్వాత షిప్‌మెంట్‌లు రికార్డు స్థాయిలో 12 మిలియన్ యూనిట్లను తాకాయి. అంటే 35 శాతం వృద్ధిని సాధించాయి. 2024 నాలుగో త్రైమాసికంలో ఆపిల్ మొదటిసారిగా భారతదేశంలోని టాప్ ఐదు స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌లలోకి 10 శాతం మార్కెట్ వాటాతో ప్రవేశించింది. 2023 ప్రారంభం నుంచి కుపెర్టినో ఆధారిత కంపెనీ భారతదేశంలో త్రైమాసిక అమ్మకాల రికార్డులను స్థిరంగా బద్దలు కొడుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మరింత బలమైన ఆదాయం, లాభాల వృద్ధికి అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. భారత దేశంలో ఆపిల్ ఐఫోన్ అమ్మకాలు 2025 నాటికి 13 14 మిలియన్ యూనిట్లకు చేరుకుంటాయని అంచనా వేస్తున్నారు. భారతదేశంలో తన మూలాలను మరింతగా పెంచుకోవడం ద్వారా తన ర్యాంకింగ్‌ను పటిష్టం చేసుకోవాలని ఆపిల్ ప్రయత్నిస్తోంది. కీలక నగరాల్లో నియామకాలను వేగవంతం చేస్తూనే, కంపెనీ తన స్థానిక తయారీ, రిటైల్ ఉనికిని దూకుడుగా విస్తరిస్తోంది. భారతదేశంలో 3,000 మందికి పైగా ఉద్యోగులను కలిగి ఉన్న ఈ కంపెనీ బెంగళూరు, పుణె, ఢిల్లీ ఎన్‌సిఆర్, ముంబైలలో రాబోయే నాలుగు స్టోర్‌లతో సహా తయారీ, రిటైల్ విస్తరణకు సంబంధించిన వందలాది ఉద్యోగ నియామకాలను పూర్తి చేసింది.

## వాణిజ్యం

### ఆల్‌టైమ్ గరిష్టానికి సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, ఏప్రిల్ 17:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా, చైనా మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నా.. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ముఖ్యంగా ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సూచీలను ముందుండి నడిపించాయి. దీంతో సెన్సెక్స్ 1500 పాయింట్ల మేర లాభపడి మళ్లీ 78 వేల మార్కును దాటగా, నిఫ్టీ దాదాపు 400 పాయింట్ల మేర లాభపడి 23,800 ఎగువన ముగిసింది. ఇన్వెస్టర్ల సంపదగా వ్యవహరించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.4 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.419 లక్షల కోట్లకు చేరింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ ఉదయం 76,968.02 పాయింట్ల వద్ద వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది.



తర్వాత క్రమంగా లాభాల్లోకి వెళ్లిన సూచి, ఇంట్రాడేలో 78,616.77 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1508.91 పాయింట్ల లాభంతో 78,553.20 వద్ద ముగిసింది. నిఫ్టీ 414.45 పాయింట్ల లాభంతో 23,851.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.85.35గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ షేర్లు మినహా మిగిలిన షేర్లు లాభాల్లో ముగిశాయి. ఎటర్నెల్ (జొమాటో), ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 66 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 3,324 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బ్యాంకింగ్ స్టాక్స్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ కలిసి సెన్సెక్స్‌ను దాదాపు 600 పాయింట్లు పెరగడంలో దోహదపడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు బుధవారం రూ.3,936 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు.

## జెన్సోల్ స్టాక్ 90% భారీ పతనం

**ముంబై, ఏప్రిల్ 17:** నిధుల మళ్లింపు కేసులో కంపెనీ, ప్రమోటర్లు అన్మోల్, పునీత్ సింగ్ జగ్గీలపై సెబి నిషేధం విధించడంతో జెన్సోల్ ఇంజినీరింగ్ షేర్లలో పతనం కొనసాగు తోంది. వరుసగా రెండోరోజూ ఆ కంపెనీ షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. గురువారం కంపెనీ షేర్లు 5 శాతం క్షీణించి 116.54 వద్ద కనిష్ఠాన్ని తాకాయి. ఆల్‌టైమ్ గరిష్ఠాల నుంచి కంపెనీ షేర్లు దాదాపు 90శాతం మేర పతనం అయ్యాయి. గతంలో ఈ కంపెనీ షేర్లు గరిష్ఠంగా రూ.1,124.90 వద్ద ట్రేడయ్యాయి. సంస్థపై గత కొన్ని రోజులుగా వస్తున్న అభియోగాల నేపథ్యంలో ఈ ఒక్క క్యాలెండర్ సంవత్సరంలోనే 84 శాతం మేర పతనం కావడం గమనార్హం. ఐఆర్ఈ డీఏ, పీఎఫ్‌సీ నుంచి జెన్సోల్ ఇంజినీరింగ్ మొత్తంగా రూ.977.75 కోట్ల రుణం తీసుకుంది. ఇందులో రూ.663.89కోట్లను ప్రత్యేకంగా 6,400విద్యుత్తు వాహనాల (ఈవీ) కొనుగోలు కోసం కంపెనీ వెచ్చించాలి. కొనుగోలు చేసిన వాహనాలను బ్లూస్మార్ట్‌కు లీజ్‌కు ఇవ్వాలి. ఇప్పటివరకు 4,704 ఈవీలను రూ.567.74 కోట్లతో కొనుగోలు చేశామని ఫిబ్రవరిలో సెబీకి జెన్సోల్ తెలిపింది. జెన్సోల్‌కు ఆ వాహనాలు సరఫరా చేసినట్లు గో ఆటో ప్రైవేట్ లిమిటెడ్ ధ్రువీకరించింది. జెన్సోల్ తన వాటా కింద మరో 20 చెల్లించాలి కనుక, రుణాలతో కలిపి ఈవీల కొనుగోలు కు కేటాయించాల్సిన మొత్తం రూ.829.86 కోట్లు అవుతుంది. ఇందులో 4,704 ఈవీలకు వెచ్చించిన రూ.567.74 కోట్లను మినహాయిస్తే.. రూ.262.13 కోట్లకు లెక్క తేలలేదు. ఈ నిధులు ఏమయ్యాయో తెలుసుకునేందుకు జెన్సోల్, గోఆటోల బ్యాంకు స్టేట్‌మెంట్‌లను సెబీ విశ్లేషించింది. పలు సందర్భాల్లో ఈవీ కొనుగోళ్ల కోసం గోఆటోకు బదిలీ చేసిన నిధులు తిరిగి ప్రత్యక్షంగా, పరోక్షంగా జెన్సోల్/అన్‌మోల్/పునీత్ ఖాతాల్లోకి వచ్చినట్లు సెబీ గుర్తించింది. ఇందులో కొంత మొత్తాన్ని ఇతర అవసరాల కోసం వారు వినియోగించారు. విలాసవంత అపార్ట్‌మెంట్ల కొనుగోలుకు, బంధువులకు డబ్బుల బదిలీ, తమ సొంత సంస్థల్లో పెట్టుబడులు పెట్టేందుకు వినియోగించుకున్నారు.




## భారత్‌లోకి చైనా ఉత్పత్తుల వెల్లువ!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** అమెరికాలో టారిఫ్‌ల విధింపుతో చైనా ఉత్పత్తులు భారత్‌లోకి వెల్లువెత్తే అవకాశాలున్న నేపథ్యంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి అంతర్-మంత్రిత్వ శాఖల మానిటరింగ్ సెల్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అటు అగ్రరాజ్యంపై చైనా ప్రతీకార టారిఫ్‌ల వల్ల అమెరికా వ్యవసాయో త్పత్తులు కూడా భారత్‌లోకి భారీగా వచ్చి పడే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు నెలకొన్నా యి. ఈ నేపథ్యంలో దిగుమతుల్లో అసాధారణ ధోరణులేమైనా కనిపించిన పక్షంలో దేశీయ పరిశ్రమల ప్రయోజనాలను పరిరక్షించే దిశగా యాంటీ-డంపింగ్ సుంకాల్లాంటివి విధించ వచ్చని వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి తెలిపారు. కమోడిటీలు, దేశాలవారీగా ట్రెండ్స్‌ను మానిటరింగ్ గ్రూప్ ప్రతివారం సమీస్తున్నట్లు తెలిపారు. ఇందులో వాణిజ్యశాఖ, డిజిఎఫ్‌టి (డైరెక్టరేట్ జనరల్‌ఆఫ్ ఫారిన్ ట్రేడ్), సిడిఐసి (పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్రీయ బోర్డు), పరి శ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డిపిఐఐటి) మొద లైన విభాగాల నుంచి ప్రతి నిధులు ఉన్నారు.



## కెనడాలో మాంద్యం భయాలు!

**ఒట్టావా, ఏప్రిల్ 17:** అమెరికా సుంకాలు ప్రపంచ వాణిజ్య యుద్ధాన్ని ప్రేరేపిస్తే కెనడాలో ద్రవ్యోల్బణం పెరుగుతుందని, దేశం తీవ్ర మాంద్యంలోకి వెళ్తుందని బ్యాంకు ఆఫ్ కెనడా తెలిపింది. తీవ్రఅనిశ్చితి కారణంగా సెంట్రల్‌బ్యాంకు తన సాధారణ త్రైమాసిక ఆర్థిక అంచనాలను విడుదల చేయలేదు. దానికి బదులుగా భవిష్యత్తులో యుఎస్ ఆర్థిక వైఖరి కెనడాపై ఎలా ప్రభావం చూపుతుందో అంచనా వేసింది. బ్యాంకు ఆఫ్ కెనడా తెలిపిన వివరాల ప్రకారం, మొదటి సందర్భంలో, చాలా సుంకాలు రద్దు చేస్తారు. కెనడాతో పాటు ప్రపంచ వృద్ధి తాత్కాలికంగా బలహీనపడుతుంది. కెనడా ద్రవ్యోల్బణం సంవత్సరానికి 1.5శాతానికి పడిపోతుంది. తర్వాత 2శాతానికి చేరుతుంది. రెండో సందర్భంలో, సుంకాలు దీర్ఘకాలిక ప్రపంచ వాణిజ్య యుద్ధానికి దారితీస్తాయి. కెనడా భారీ మాంద్యంలోకి ప్రవేశిస్తుంది. ద్రవ్యోల్బణం 2026 మధ్యలో 3 శాతం కంటే ఎక్కువ పెరిగి 2 శాతానికి తిరిగి వస్తుంది. ఇంకా ఇతర పరిస్థితులు సాధ్యమేనని నొక్కి చెప్పిన బ్యాంకు వార్షిక మొదటి త్రైమాసిక జిడిపి 1.8శాతంగా అంచనా వేసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14